నవశక్తి

Vol. 2, no. 8

(Feb. 1, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 8

(Feb. 1, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

ఢెంకనాల్ పోరాటం

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

సంపుటం 2 } బుధవారం 1—2—39 బెజవాడ {సంచిక 8

పిశాచి పిలుపు!



యుద్ధ దేవత (యూరోపియన్ యువకునితో):—రా! నాయనా! రా! మా యింట్లో చక్కని గదులున్నాయి. నీకిక్కడ ఎంతో ఆదరణ జరుగుతుంది! మీ బాబును నేనెరుగుదును, ఆయనకిక్కడే శాశ్వత విశ్రాంతి చేకూరింది కూడాను!

★ స్వాతంత్ర్య దినోత్సవము ★

విద్యార్థులలో అపూర్వ చైతన్యం

బెజవాడ

జనవరి 26 వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవము అమితోత్సాహంతో, పాత బస్తీ డివిజనల్ కాంగ్రెసు కమిటీ, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, యువజన సంఘము, విద్యార్థి సంఘం, ప్రెస్ వర్కర్సు యూనియన్, రైల్వే పనివారల సంఘముల సంయుక్త యాజమాన్యమున జరిగింది. ఉదయం శ్రీ హనుమంతరాయ గ్రంథాలయంమీద శ్రీయుత వి. యల్. శాస్త్రి గారిచే జాతీయ పతాకము ఎగురవేయబడినది. సాయంత్రం 4 గంటలకు ప్రెస్ వర్కర్సు యూనియన్ ఆఫీసు నుండి గొప్ప ఊరేగింపు బయలుదేరి పుర వీధు లన్ని తిరిగి 6 గంటలకు గాంధీ పార్కునకు చేరినది. అచ్చట శ్రీ పేట బాపయ్య గారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగినది. సభలో పుచ్చలపల్లి సుందరయ్య, చెలసాని వాసుదేవరావు, కె. యల్. నరసింహం, వి. యల్. శాస్త్రి, ఆంజనేయ ప్రసాద్, పిల్లలమఱ్ఱి వెంకటేశ్వర్లుగారలు ఉపన్యసించిరి.

— కె. కుటుంబరావు,
కార్యదర్శి,
సోషలిస్టు పార్టీ.

బందరు

అఖిల భారత విద్యార్థి సంఘ తీర్మానము ప్రకారము 26—1—39 వ తేదీని బందరు విద్యార్థులచే స్వాతంత్ర్యదినోత్సవము జరుపబడినది. పుర వీధు లందు "ఫెడరేషన్ ప్రతిఘటించాలి", "స్వాతంత్ర్యము కావాలి" అనే నినాదాలతో ఊరేగింపు. సాయంత్రం 5 గంటలకు కామ్రేడ్ మల్లెల రామారావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరుపబడెను. శ్రీ యుఱ్ఱమిల్లి నరసింహారావు గారు స్వాతంత్ర్య దిన ప్రాముఖ్యతను గురించి ఉపన్యసించిరి.

— వై. నరసింహారావు.

పామఱ్ఱు

26—1—39 వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంలో పామఱ్ఱు విద్యార్థి సంఘంవారు పెద్ద ఊరేగింపు జరిపారు. 300 మంది పాల్గొన్నారు. చౌకులో కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగినది. అధ్యక్షులు, కంచెర్ల వెంకట్రామయ్య. తోట నరసయ్యగారలు ఉపన్యసించిరి. అందరును స్వాతంత్ర్య ప్రమాణమును గైకొనిరి.

—ఒక విలేఖరి.

నాగాయితిప్ప

26—1—39 వ తేదీ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ యాజమాన్యమున ఊరేగింపు నాగాయితిప్పలో బయలుదేరి, మోపిదేవి, రావివారిపాలెం. చిరువోలు, కొత్తపాలెం మున్నగు గ్రామాలలో తిరిగినది. సాయంత్రము 8 గంటలకు కూనపరెడ్డి సీతారామయ్యగారి అధ్యక్షతను బహిరంగ సభ జరుపబడెను.

—కె. అచ్యుతరామయ్య
సోషలిస్టుపార్టీ కార్యదర్శి.

మంగళాపురం

కృష్ణాజిల్లా మంగళాపురంలో జనవరి 26 వ తేదీని స్వాతంత్ర్య దినోత్సవము జరుపబడినది. సభకు 200 మంది హాజరయిరి. కాంగ్రెసు పుట్టుక, 1921 ఉద్యమము లాహోరుకాంగ్రెస్‌లోని సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం 1930—32 లోని ఉద్యమం, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పుట్టుక, ఫెడరేషను సమస్య మొదలైన వాటి మీద ఉపన్యాసము లివ్వబడినవి.

—చంద్ర రాజేశ్వరరావు

గుంటూరు

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో. నగర కాంగ్రెసు సంఘం, నగర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ. నగర విద్యార్థి సంఘము, యువజన సంఘము, ముస్లిం మాస్ కాంటాక్టు కమిటీల యాజమాన్యమున, ఉదయం స్వరాజ్య మైదానము నందు జాతీయ పతాక ప్రతిష్టాపనయు. సాయంత్రం 4 గం॥ ఊరేగింపు 6 గం॥ బహిరంగ సభయు జరిగెను. సభకు శ్రీ మాడభూషి వేదాంత నరశింహాచార్యులు గారధ్యక్షత వహించిరి. ఈ సందర్భమున హిందూ, క్రిష్టియన్ కాలేజీలు మూసివేయ వలసి వచ్చినది.

—ఒక విలేఖరి.

నర్సారావుపేట

మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భమున సెలవు ఇవ్వలేదని సమ్మె చేసిరి. సా॥ 5 గంటలకు హైస్కూలు ముందర కామ్రేడ్ శ్రీ గిరిరాజు సత్యనారాయణగారి అధ్యక్షతను సభ జరిగినది.

బాపట్ల

పట్టణ కాంగ్రెసు సంఘ యాజమాన్యమున స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ఊరేగింపు సాయంకాలం బహిరంగ సభ జరిగినవి.

ఒంగోలు

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భమున హైస్కూలు విద్యార్థులు హరతాళము చేసిరి. విద్యార్థిసంఘము, పట్టణకాంగ్రెస్ సంఘముల యాజమాన్యమున ఉదయం శ్రీ శ్రీరాముని రాధా కృష్ణయ్య గారిచే జాతీయ పతాకము ఎగుర వేయబడినది. సాయంత్రం 3 గంటలకు, విద్యార్థులు, సోషలిస్టులు మొదలైనవారు 300 మంది ఊరేగింపు జరిపిరి. 4½ గంటలకు కొండ మీది దేవాలయం మీద విద్యార్థి సభయు 6 గంటలకు కాంగ్రెసువారి సభయు జరుపబడినవి.

తెనాలి

స్వాతంత్ర్యదినోత్సవం జయప్రదంగా జరిగినది. బహిరంగ సభలో ఫెడరేషన్ పిశాచము బొమ్మను తగులబెట్టిరి.

కాకినాడ

స్వాతంత్ర్య దినోత్సవం కాంగ్రెసు సంఘం, సోషలిస్టు పార్టీల యాజమాన్యమున అతి జయప్రదంగా జరిగింది. ఉదయము డా॥ చెలికాని వెంకట రామారావు గారు పుర మందిరమున జాతీయ పతాకమును ఎగురవేసిరి. సా॥ 4½ గంటలకు విద్యార్థులు, కార్మికులు, పురప్రముఖులతో పెద్ద ఊరేగింపు జరిపిరి. టౌన్ హాలులో డా॥ వి. వి. కృష్ణయ్యగారి అధ్యక్షతను సభ జరిగినది. సభానంతరం ఫెడరేషన్ పిశాచపుబొమ్మను విద్యార్థులు తగులబెట్టిరి.

పోలవరం

స్వాతంత్ర్య దినోత్సవానికి సెలవు ఇవ్వలేదని హైస్కూలు విద్యార్థులు సమ్మె చేశారు. సాయంత్రం 3 గంటలకు విద్యార్థులు జాతీయ గీతాలు పాడుకుంటూ వూరేగి బహిరంగ సభ జరిపిరి

విశాఖపట్నం

విశాఖపట్నం విద్యార్థి సంఘం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జయప్రదంగా జరిపింది. అన్ని కాలేజీలు, స్కూళ్ళలోను నూటికి 95 మంది విద్యార్థులు సమ్మె చేసిరి. ఉదయాన్నే 100 మంది విద్యార్థులు,దళాలుగా బయలుదేరి పట్టణమంతా సంకీర్తన జరిపిరి. ఊరేగింపుతో బయలుదేరి వచ్చి టౌన్‌హాల్ ఎదుట పతాకవందనము చేసిరి. సాయంకాలం బహిరంగ సభలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సమ్మెసందర్భంలో అధికారులు పోలీసులను ఉపయోగించడం గర్హ్యనీయం.

విజయనగరం

ఈ సంవత్సరం స్వాతంత్ర్యోత్సవము ఇదివర కెన్నడూ జరుగనంత వైభవంగా జరిగింది. పట్టణ సంయుక్త కాంగ్రెసు సంఘం, పట్టణ యువజన సంఘం,ప్రెస్ వర్కర్సు యూనియన్‌ల యాజమాన్యమున అరమైలు పొడుగున పెద్ద ఊరేగింపుజరిగినది. కాలేజీకువిద్యార్థుల పురజనులకోరిక పైఒకపూట సెలవుఇవ్వబడినది. హైస్కూలుకు సెలవు ఇవ్వనందున విద్యార్థులు సమ్మె చేసినారు. సా॥ 3 గంటలకు బయలుదేరిన ఉత్సవము 5 గంటలకు స్వరాజ్య మైదానము చేరినది. బహిరంగ సభకు శ్రీ వి. జె. గుప్త, ఎం. ఎల్. సి. గారధ్యక్షత వహించారు. కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య, జిల్లాకాంగ్రెసు అధ్యక్షులు వెంకట్రావుగారు మొదలగువారు ఉపన్యసించిరి.

మొత్తంమీద విద్యార్థులు దేశమంతటా ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ఎక్కువగా పాల్గొని. సెలవు లివ్వ[illegible]
త్రే [illegible] చ

లె[illegible] [illegible]త్సవం

జనవరి 21 వ తేదీన లెనిన్ దినోత్సవము ఆంధ్ర దేశంలో చాల చోట్ల జరుపబడినట్లు రిపోర్టులు వచ్చాయి. స్థలాభావం చేత వివరాలు ప్రకటించ లేక పోయాం.

బార్సిలోనా పతనముతో యూరపులో యుద్ధభయం ఎక్కువయింది

జనవరి 22 తేదీన బార్సిలోనాకు 20 మైళ్ళ దూరములో ఫ్రాంకో సేన లున్నాయి. బార్సిలోనాపై అతని విమానాలకు, ప్రభుత్వ విమానాలకు తీవ్రమయిన యుద్ధము జరిగింది. బార్సిలోనాలో ఆ రోజున 10 విమాన దాడులు. మరునటి రోజున 13 విమాన దాడులు. అయినా బార్సిలోనాలోని ప్రజలందరూ కందకములు త్రవ్వడము, కోటలు నిర్మించడంలో నిమగ్నులై ఉండిరి. మిగిలిన పనులన్నింటిని మానివేసి, ఫ్యాక్టరీల నన్నింటిని మూసివేసి ఈ పనిలో బార్సిలోనా ప్రజలు నిమగ్నులయ్యారు. మార్షలు లా ప్రకటించబడి, ప్రతి పౌరుడు యుద్ధానికి సాయపడవలసిన ఆవశ్యకత తెలియజేయబడింది. మాడ్రిడ్‌లో సేనా నాయకుడు మియాజా "స్వాతంత్ర్య పోరాటము కోసం, ఎంత త్యాగం చేయవలసి వచ్చినా, కడకు ప్రాణాలర్పించవలసి వచ్చినా లెక్కజేయ నవసరము లేద"ని ప్రకటించాడు. యూరోపియను కార్మిక నాయకులు, లండనులో సమావేశమయి, స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు పంపించేటట్లు, తటస్థ విధానాన్ని ఫ్రాంసు ఇంగ్లండులు మానుకోవాలని తీర్మానం చేశారు. స్పెయినులో ఫ్రాంకోకు విజయము కల్గితే, దక్షిణ అమెరికా అంతటను, యునైటెడ్ స్టేట్సుకు వ్యతిరేకంగా ప్రచారము సాగించడానికి స్పెయిను కేంద్రమవుతుందని యునైటెడ్ స్టేట్సు (అమెరికా) ప్రభుత్వానికి భయమున్నది. ఇప్పటికైనా స్పెయినుకు ఆయుధముల బంపుటకు తన న్యూట్రాలిటీ ఆక్టు (తటస్థ చట్టం) క్రింద వీలుండేమోనని ఆలోచిస్తూ ఉంది. అమెరికను కార్మిక నాయకులు ఆయుధాలను పంపవలసినదిగా రూజ్‌విల్టుకు ఒక విజ్ఞప్తిని పంపారు. ఫ్రాంసు ఒక వేళ బార్సిలోనా రిపబ్లికు ప్రభుత్వానికి ఆయుధాలు సైన్య సహాయము పంపుతుందేమో అనే భయంతో 60,000 సైన్యాన్ని "జినోవా" యందు, రోము యందు తయారుచేసి ఉంచినది ఇటలీ. ఫ్రాంసు సహాయము జేసిన మరుక్షణాననే ఈ సైన్యమును ఫ్రాంకోకు పంపుతానని ముస్సోలీని బెదరిస్తూ ఉన్నాడు.


బార్సిలోనాను చుట్టూ ముట్టడించడానికి, బార్సిలోనాకు ఉత్తరముననున్న మన్రెసా అనే పట్టణమును వశపర్చుకోడానికి ఫ్రాంకో సేనలు ప్రయత్నించాయి. భయంకర యుద్ధం సాగింది కడకు తిరుగుబాటుదారుల వశమయింది. బార్సిలోనా చుట్టూ శత్రుసేనలు మూగ నారంభించాయి. ఈ పరిస్థితులలో బార్సిలోనాలో యుద్ధం చేయుట, అసంఖ్యాక ప్రజానష్టానికి దారి తీస్తుందని ప్రభుత్వసేనలు బార్సిలోనాను వదిలి ఉత్తరము వైపు మరలాయి. మంత్రులు, జిరోనా అనే పట్టణములో తమ కేంద్రస్థానమును ఏర్పరచు కున్నారు. ప్రభుత్వ ఓడలు, బార్సిలోనాను వదిలి ఉత్తరమున రోసాస్ రేవును చేరుకున్నాయి. బార్సిలోనా నగరములో విద్యుచ్ఛక్తినిగాని, టెలిఫోనులనుగాని, మరితర కట్టడములనుగాని నాశనము గావించకనే ప్రభుత్వ సేనలు వెడలిపోయాయి. 26 వ తేదీన శత్రుసేనలు బార్సిలోనాను ఆక్రమించుకున్నాయి.

బార్సిలోనా పతనము : తదనంతరము

ఇటలీ దేశమందంతా, బార్సిలోనా పతనము ఇటలీ విజయముగా ఊరేగింపులు, ఉత్సవాలు చేయబడ్డాయి. ముస్సోలినీ ఉపన్యసిస్తూ, ఈ విజయము మన విజయం. ఇది కేవలం స్పెయిను ప్రభుత్వ ఓటమియేకాదు. మన శత్రువులలో ఇంకను అనేకమంది యొక్క ఓటమి. ఈ విజయమునకు కమ్యూనిస్టు ప్రభుత్వము నుండి విముక్తిచెందిన స్పెయిను పట్టణాలన్నీ ఆనందిస్తూ ఉన్నాయన్నాడు.

గైడా "బార్సిలోనా పతనము ఫ్రాంసుకు అమితమగు నిరుత్సాహము కలిగించింది. రష్యాను నోరు మూయించింది. ఈయుద్ధము ఇంకను స్పెయిను ప్రభుత్వము సాగించడము, మానవజాతియెడ నేరముగాక మరేమీ కాదు. ఈ మూర్ఖపు పట్టుదల, త్వరలో అంతర్జాతీయ క్లిష్టదశ ఏర్పడుతుందనే ఆశమీద ఆధారపడి ఉంది" అని అన్నాడు.

హిట్లరు, జపాను ప్రధానికూడ ఫ్రాంకోను అభినందిస్తూ సందేశాలు పంపాడు.



ఫ్రెంచి మితవాద పత్రికలు "బార్సిలోనా పడిపోయింది. ఇక మాడ్రిడ్ వాలెన్షియా రిపబ్లికు ప్రాంతంకూడా యుద్ధముచేయుట నిష్ప్రయోజనము. వెంటనే స్పెయిను ప్రభుత్వము లొంగిపోయి, ఇప్పటికే అనవసరముగా ఇంత దీర్ఘకాలము జరిగిన యుద్ధము త్వరలో ముగియునట్లు, ఫ్రెంచిప్రభుత్వము జోక్యము కల్గించుకోనాలి" అని వ్రాస్తున్నాయి.

కాని, ప్రభుత్వసేనలు తమ శిక్షణను వదలలేదు. నిరుత్సాహ పడడములేదు. క్రమముతప్పక వెనుకకు వెళ్లాయి. తిరిగియుద్ధానికినిలబడ్డాయి. మధ్యధరా సముద్రతీరమున "మతారో" రేవు నుండి, గనోల్లర్సు మీదుగ, సియోడి ఉర్గుల్ వరకు యుద్ధము సాగుతూ ఉంది. మాడ్రిడ్ సైన్యానికి రెండవ సేనాధ్యక్షుడు జనరల్ కాసడద్ ఈ విధంగా ప్రకటించాడు : "స్పెయిను దేశస్థులకు స్పెయిను దక్కువరకు యుద్ధము సాగుతూనే ఉంటుంది. యుద్ధము ముగియ వచ్చిందని మా దేశంపై దండెత్తినవారు మురియవచ్చు. కాని ప్రపంచయుద్ధము త్వరలోవచ్చే సూచనలు కన్పడుతున్నాయి. దానిలో మేము తప్పక పాల్గొంటాము. మాకు నిరుత్సాహమేమీ లేదు."

స్పెయిను ప్రధాని నెగ్రిన్‌కూడ జయము తథ్యమని ధైర్యము చెపుతున్నాడు : "బార్సిలోనా పతనముతో రిపబ్లికు ప్రభుత్వం ధ్వంసమవుతుందని శత్రువులనుకుంటూ ఉన్నారు. యుద్ధపరిస్థితి ప్రభుత్వానికి చాల వ్యతిరేకముగా ఉన్ననూ, ఈ ఆశలనన్నిటిని భగ్నము గావించుతాము. మాకు సకాలములో కావలసిన పరికరములు వచ్చాయి. మాకు కావలసినంత సైన్యము, ఆయుధాలు ఉన్నాయి. మా సైన్యం అంతులేని సాహసము, ధైర్యముతో కూడినది. ఏ మాత్రము ఆశలేనపుడు నేను మీకు ఆశ గొల్పుతూ మాట్లాడక యుంటిని. కాని నేడు మనము చాల సురక్షితముగ ఉన్నామని నేను ప్రకటించగలను."

బార్సిలోనా పతనముతో అనేక వేలమంది స్త్రీలు, బిడ్డలు, ముసలివారు ఫ్రాంసుకు తలదాచుగోడానికి పోతున్నారు. ఫ్రెంచి ప్రభుత్వము దాదాపు రెండు లక్షలమంది వస్తారని అంచనా వేసికొంది. యుద్ధము చేయడానికి బలముగల వారిని మాత్రము ఫ్రాంసులోకి రానివ్వకూడదని నిశ్చయించింది. ఇదివరకువచ్చినవారిని మాత్రం ఫ్రాంసునుండి తిరిగి పంపించ నవసరములేదని కూడ నిర్ణయించుకుంది. కాని ఇంటర్నేషనల్ బ్రిగేడుకుచెందిన ఇటలీ, జర్మను, జెకోస్లోవేకియాదేశాలకు చెందినవారిని ఆదేశాలకువారు పోవడము అసంభవము కాబట్టి, ఫ్రాంసులోకి రానివ్వనంటూ ఉంది. మేము ఫ్రాంసులో నివాస మేర్పరచుకోము; ఫ్రాంసులో బోర్డెక్సు రేవు వరకు ప్రయాణము చేయనిస్తే తదుపరి అచ్చటనుండి మరి యేదేశానికైనా వెళ్లెదమని హామీ ఇచ్చినను అంగీకరించుటలేదు. ఇటలీ జర్మనుల సంతృప్తిపర్చడానికి ఫ్రాంసు ప్రభుత్వం ఇట్టి పని చేస్తూఉంది.

ఫ్రాంసులో స్పెయిను ప్రభుత్వానికి ఆయుధాలు ఇప్పుడైనా పంపవలసినదని ఊరేగింపులు ప్రదర్శనాలు జరుగుతున్నాయి. కాని బోనెట్ దలడీలు అంగీకరించుట లేదు.

బార్సిలోనా పతనం : దాని ఫలితాలు

ఫ్రెంచి పార్లమెంటులో బోనెట్ ఒక ఉపన్యాసము చేశాడు. ఫ్రాంసుకు చెందిన భూభాగాన్ని ఏమాత్రము ఇతరులకు ఇవ్వడట. స్పెయినులోగాని, స్పెయిను దీవులలోగాని, ఆఫ్రికాలోని తన రాజ్యాలకు వెళ్లే మార్గాలకు ప్రమాదకరముగ మరియే యితర దేశమైనను సైన్యాన్ని ఉంచితే ఊరుకోడట! స్పెయిను దీవులలో విదేశస్థుల సైన్యమున్నట్లయితే, బ్రిటనుకుచెందిన జిబ్రాల్టరుకు, మాల్టాకు కూడ ముప్పుకాబట్టి బ్రిటిషు ప్రభుత్వము తనకు తోడునీడై ఉంటుందట! రష్యాతోను, పోలండుతోను తన సంబంధాలు మునుపటివలె సుహృద్భావముతో ఉన్నాయట! జర్మనీతో చేసుకొన్న "ఒకరిపై ఒకరు యుద్ధము చేయమ"నే ఒడంబడిక చాల లాభకరమయినదట! స్పెయినుకు ఆయుధాలను పంపకుండుట మంచిదేనని తనకు ఇంకనూ విశ్వాసమున్నదట! దలడీరు వీని కన్నిటికి తలఊపాడు!

ఒకవైపు బింకాలు పలికినా, స్పెయిను ప్రభుత్వము ఓడిపోతే ఇటలీ, ఫ్రెంచి ప్రభుత్వముపై జిబోతి, ట్యూనిస్‌లను ఇమ్మని మరింత ఎక్కువ ఒత్తిడి తెస్తుందని భయముంది. అందుచే "యుద్ధము చేయమ"నే ఒడంబడిక ననుసరించి, జర్మనీని ఫ్రెంచి ప్రభుత్వము, ఇటలీని ఆపరిస్థితులలో బలపర్చకుండా ఉంటావా? అని అడిగింది. దానికి జవాబుగ కాబోలు జర్మను పత్రికలు "ఇటలీ సైన్యము స్పెయిను నుండి మరలిపోవుటకు గ్యారంటీగా ఫ్రాంసు స్పెయిను దేశములో ఏదైనా ప్రాంతాన్నిగాని లేక బాలరికు దీవులనుగాని ఆక్రమించుకోదలచి నట్లయితే, ఆ విషయమై జర్మనీ ఫ్రాంసుతో సంప్రదింపులు సాగించరు. ఇటలీ కోర్కెలను నెరవేర్చి ఇటలీని సంతృప్తి పర్చడమే, ఫ్రాంసుకు మార్గము" అని వ్రాశాయి.

ఫ్రాంసులో 1918 వ సంవత్సరము పుట్టినవారు, ఈ సంవత్సరము అక్టోబరులో సైనిక శిక్షణ కోసం, సైన్యములో చేరవలసి ఉండినది అయినా ఏప్రిల్ నెలలోనే సైన్యములో చేరవలసినదని ఫ్రెంచి ప్రభుత్వ మాజ్ఞాపించింది. ఇటలీకూడ మరి 2 లక్షల మంది రిజర్వులను సైన్యములో వచ్చి వెంటనే చేరాలని ఆజ్ఞలు పంపించింది.

ఛాంబర్లేనుకూడ పార్లమెంటులో ఇటలీతో స్నేహము చాల ప్రధాన మన్నాడు. ముస్సోలినీ గత సెప్టెంబరులో శాంతిని కాపాడాడని ప్రశంసించాడు. మ్యూనిక్ ఒడంబడికను మరియొక పర్యాయము సమర్థించాడు. అయితే జర్మనీ ఇటలీలు శాంతి కనుకూలించే పనినేదయినా చేయాలని సూచించాడు. ఇటలీ పత్రికలు, జర్మనీ పత్రికలు ఛాంబర్లేను ఉపన్యాసాన్ని మెచ్చుకొన్నాయి. కాని తమ వద్దనుండి శాంతి సూచకమయిన సంజ్ఞ కోసం ఇంకను ఎదురు చూస్తూ ఉన్నానని ఛాంబర్లేను అనడము, బిడ్డలకు బడి పంతులిచ్చిన ఉపన్యాసం లాగుందంటున్నాయి.

శాంతి సూచన లేమి రాక పోవడము వలన కాబోలు, ఇంగ్లండులోకూడ యుక్త వయస్సు వచ్చిన ప్రతి పౌరుడు, యుద్ధము వస్తే, ఏమి పని చేయడానికి తయారుగ ఉంటాడో తెలియజేయవలసినదని ఒక కోటి ఫారాలు పంచిపెట్టింది. ఇది ఒక విధమయిన యుద్ధ సన్నాహము. నిర్బంధంగాగాక పౌరులు స్వేచ్ఛగానే బ్రిటీషు యుద్ధ యంత్రంలో ఇరుక్కోడానికి పన్నిన వ్యూహము. మంత్రి వర్గములోకూడ

(మిగతా 22 వ పేజీలో)

1—2—39 బుధవారం

సుభాసు చంద్రునికి అభివందనాలు!

కాంగ్రెసు మహాసభా అధ్యక్షతకు స్పష్టమైన కార్యక్రమంపై ఎన్నికలు జరుగుట కిదియే మొదటిసారి. ఫెడరేషను విషయమై రాజీపడే మార్గము అవలంబించే వారికీ, ఎట్టి రాజీ పనికిరాదనే వారికి సూటీగా పోటీ జరిగింది. సామ్రాజ్య వాదులు భారత ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఫెడరేషను అమలులో పెట్ట జూచుచున్న సమయ మిది. ప్రపంచ క్లిష్ట పరిస్థితులకు లోనై బ్రిటీషు సామ్రాజ్య పునాదులు ఊగిసలాడుచున్న రోజు లివి. స్వాతంత్ర్య సంపాదనా బద్ధ కంకణమైన కాంగ్రెసు మహాసభలోని మితవాదపక్షము పార్లమెంటరీ తత్వంపై మోజు హెచ్చి, ప్రత్యక్ష ప్రజా పోరాట విధానమును వెనుకకు నెట్టి, నామకః మార్పులతో బానిస రాజ్యాంగ విధానమును అమలు జరుపుటకు రహస్యాలోచనలు చేయుచున్న కాల మిది. భారత ప్రజా సామాన్యము, కార్మిక కర్షకులు, సంస్థాన ప్రజలు తమ హక్కుల కొరకు భారత స్వాతంత్ర్యంకొరకు తమ సర్వస్వము అర్పింప సిద్ధమగుచున్న విప్లవయుగ మిది. ఇట్టి సమయానికి తగిన నాయకత్వం, ప్రజాసామాన్యాన్నంతటినీ కదనరంగానికి నడపగల్గిన నాయకత్వం కావాలి. ప్రజలు కాంగ్రెసు ప్రతినిధుల ద్వారా అట్టి అర్హత గల సుభాసుచంద్రబోసునే కాంగ్రెసు అధ్యక్ష పీఠానికి ఎన్నుకొనుట శుభావహము. ప్రజల విశ్వాసాన్ని చూరగొని జయం పొందిన సుభాసు చంద్రునికి మా ధన్యవాదములు.

ఎన్నికలో వల్లభాయి, రాజేంద్రబాబు మొదలగు మితవాద కాంగ్రెసు నాయకులు చేయవలసిన, చేయగలిగిన ప్రచారమంతయు చేసినారు. గాంధిమహాత్మ, జహ్వార్‌లాల్ పేర్లు ఉపయోగించుకొన్నారు. మంత్రి పదవుల అధికారం వినియోగించబడింది. ఆంధ్ర, గుజరాతు, బీహారు రాష్ట్రాలలో అతివాదులు ప్రతినిధులుగా ఎన్నుకోబడకుండుటకు సిగ్గుచేటయిన కార్యకలాప మంతయు మితవాదులచే అనుసరింపబడింది. ఇన్నిచేసినా, దేశం మొత్తంపై కాంగ్రెసు డెలిగేట్లు వల్లభాయి ప్రకటనలను, బెదరింపులను లక్ష్యము చేయక సుభాసుచంద్రుని ఎన్నుకొని ఫెడరేషనును భగ్నము గావించడానికి పోరాటము ఆరంభించాలని తెలియజేశారు.

ఈ సందర్భంలో ఆంధ్ర దేశంలోని మా సోదర పత్రికలు అనుసరించిన ప్రచార పంథాలను గురించి కొంచెము ఉదహరించుట అప్రస్తుతము కాదని భావించుతాము. రెండు పక్షములును తమ తమ కార్యక్రమము, రాజకీయ పంథాలను గురించి ప్రచారము చేసికొనుట భావ్యమే. కాని తమ అభ్యర్థుల జయం కోసం తాపత్రయంలో సముచితజ్ఞతను గోల్పోవుట విచారకరము. ఆంధ్రుడైనవాడు తప్పనిసరిగా పట్టాభికే ఓటివ్వాలనీ సుభాసుబాబుకు ఆరోగ్యము సరిగా లేదు కాబట్టి ఎన్నుకోనవసరము లేదనీ, మొదలగు వాదములకు దిగుట, రాష్ట్రీయ దురభిమానమును పురిగొల్పుట మేము హర్షింపజాలము. ఈ రకపు వాదనలు జిన్నావంటివారి కమ్యూనల్ ప్రచారము వలెనే సంకుచితమైనవి. సరిహద్దు, అస్సాం, ఒరిస్సా, కేరళ, కన్నడ రాష్ట్రవాసులును యింతవరకు కాంగ్రెసు గద్దె నెక్కలేదని జ్ఞాపకం చేసిన మా ఆంధ్ర సంకుచితాభిమానుల అక్కసు చల్లారునని నమ్ముతున్నాము. కొందరు ఎన్నడు లేని ఎన్నిక రద్దీ బోసు తెచ్చిపెట్టాడని నిందించుతున్నారు. కాంగ్రెసు నియమావళిలో అట్టి అభ్యంతర మేమియు లేకపోవుటేగాక లోగడ, ఫైజ్‌పూర్ కాంగ్రెసులకు తామూ సోషలిస్టునేనని డాక్టరు పట్టాభిగారు, జహ్వారిలాల్‌తో పోటీ చేసి ఓడిపోయిన సంగతి స్మరణకు తెస్తున్నాము.

పటేలు ప్రభృతుల రాజీ ధోరణిని దేశం హర్షించుట లేదని యీ ఎన్నిక స్పష్ట పరచింది. ఇక ఫెడరేషను విషయమయి రాజీ ప్రయత్నములు సాధ్యమని భావించువారు ఆ ప్రయత్నాలు చాలించవలెను. బాధ్యతలేకుండా చరించు సత్యమూర్తి వంటి వారి ప్రచారము సాగనీయరాదు.

వివిధ రాష్ట్రాలలో అతివాదులను, సోషలిస్టులు కమ్యూనిస్టులను ఏదో మిష కల్పించి కాంగ్రెసునుండి వెడలగొట్టుటకు గాంధివాదులచే గావించబడుచున్న ప్రయత్నాలను అధ్యక్షుడు బోసు అరికట్టవలెను. పట్టాభిగారు ఆంధ్ర రాష్ట్రంలో వలెనే 'ఇల్లుచక్క బెట్టెద' ననుచున్నారు. ఇట్టి కార్యక్రమంలోని అపాయమును గుర్తించవలెను. గాంధిమహాత్ముడు హరిజన పత్రికలో కమ్యూనిస్టులు, సోషలిస్టులు జయం పొందిన బొంబాయి కాంగ్రెసు ఎన్నికలపైనను, బీహారు రైతుల హక్కుల రక్షణకై పోరాడుచున్న కిసాన్ సభలలో పనిచేయు కాంగ్రెసు వాదులపైనను, శిష్యుల రిపోర్టులపై ఆధారపడి దాడి ప్రారంభించాడు. ఆంధ్ర దేశంలో యిదివరకే "తమలోనూ, దేశ ప్రజలలోను నమ్మకం గోల్పోయిన" నాయకమ్మన్యులు అవలంభించిన శుద్ధి విధానము వెంటనే ఆపివేయబడవలెను. పోరాటము, ప్రజా సేవయే కాంగ్రెసు వాదులకు ఒరపిడి రాయి అని స్పష్టపరుప బడవలెను.

బోసు ఫెడరేషను భగ్నం చేయుటకు ప్రత్యక్ష కార్య క్రమాన్ని త్రిపురి కాంగ్రెసు ముందు పెట్టబోతున్నాడు. కార్యక్రమాన్ని అమలు జరుపుటకు తగిన వర్కింగు కమిటీనికూడ నియమించుకోవలెను. రఫీ అహమ్మద్ కిద్వాయి అన్నట్టుల, ఇదివరకు నెహ్రూ, బోసులు వర్కింగు కమిటీలో అత్యధిక సంఖ్యాకులు మితవాదుల నియమించుట, అతివాదులను నాలతక్కువగా వేసుకొనుట బలహీనతయే. ప్రజలు ఫెడరేషను భగ్నం చేయడానికి, బ్రిటీషు సామ్రాజ్య వాదులతో రాజీలేని పోరాటాన్ని కొనసాగించడానికి అధ్యక్షునికి అధికార మిచ్చారు. అట్టి కార్యక్రమాన్ని అమలు నందుంచుటకు అనుకూలించు సహచరులను తగినంత మందిని అధ్యక్షుడు వర్కింగు కమిటీలో నియమించుట సమంజసము. మితవాద నాయకులుకూడ ఫెడరేషనును భగ్నం గావించడానికి సుభాసుబాబుతో కలసి పూర్తిగ కృషి చేసెదరని ఆశిస్తున్నాము.

అతివాదులు గమనించవలసిన విషయ మింకొకటి. కాంగ్రెసులో బ్రిటీషు ప్రభుత్వంతో ఏ విధమైన రాజీకి యిష్టపడని రాజకీయ వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఉన్నారు. అధ్యక్షుని ఎన్నికవల్ల ప్రజలలో మితవాదుల నాయకత్వముయెడల అనుకోబడుచున్నంత విశ్వాసము లేదని తేలిపోయింది. అతివాదులందరూ, సోషలిస్టుల, కమ్యూనిస్టుల సూచనపై ఒకే నినాదంపై నిలబడి దిగ్విజయం పొందారు. తాత్కాలికముగా వచ్చిన యీ అతివాదుల ఐక్యతను నిర్మాణ యుక్తం చేదాము. ఈ ఐక్యత నాధారముగా చేసుకొని కాంగ్రెసు వాదులందరమూ, ఫెడరేషనును భగ్నము గావించడానికి ఒక కనీస కార్యక్రమంపై పదండి, ముందుకు పోదాం. 1921, 1930-33 లో వలె జాతీయ పోరాటాలను అగమ్య గోచరమైన మార్గాల నడిపి, ప్రజా శక్తిని వృధా పరచక కాంగ్రెసు నాయకత్వాన్ని చరిత్ర నేర్పిన సుబోధకమైన విప్లవ పంథాల నడచునట్లు చేదాం. అందులకు అవసరమైన అతివాదుల కలయిక కొరకు సంపూర్ణ స్వాతంత్ర్యం కోరు ప్రతి కాంగ్రెసువారు సహాయ పడతారని ఆశిస్తాము. ఇది సాధించుటకు ముఖ్యంగా సోషలిస్టులు, కమ్యూనిస్టులు నడుం కట్టాలి అని కోరుతాము. అపుడే మనము అతివాదులకు నేడు సమకూర్చిన విజయం స్థిరపచ్చ గల్గుతాము: బ్రిటీషు సామ్రాజ్య వాదులకు సరియైన పోరాట మివ్వ గల్గుతాము.

ఈ లోగా ఫెడరేషను వ్యతిరేక పోరాటానికి ప్రజలను సంసిద్ధ పరచాలి. స్వదేశ సంస్థానాలలోని ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్ష సహాయ మివ్వాలి. కార్మిక సంఘాలను, కిసాన్ సభలను బలపరచాలి. కాంగ్రెసు మంత్రి వర్గాలు ప్రజా హక్కులను రక్షించడానికి, ఉద్యోగుల లంచగొండి తనాన్ని నిర్మూలించడానికి పూనుకోవాలి. వారి డ్యూటీ బ్రిటీషు సామ్రాజ్య రక్షణ కొరకు శాంతి భద్రతల కాపాడుట గాదు: కాని ప్రజా సామాన్యమును, స్వాతంత్ర్య పోరాటమునకు సంసిద్ధ పరచాలి సి. ఐ. డీ. లచే కాంగ్రెసు వాదుల వెంటాడించుట కాదు. సోషలిస్టులు అహింసా సూత్రాన్ని బోధించుటలేదని ఆరోపించుట గాదు: కాని క్రింది ఉద్యోగులలో స్వరాజ్య పోరాటం యెడల సుముఖత కల్గించి, రానున్న పోరాటములో ప్రభుత్వ యంత్రం కూలి పోవునటుల చేయుట. ఇట్టి కార్యక్రమాన్ని నెరవేర్చినపుడుదే కాంగ్రెసు మంత్రులు కాంగ్రెసు ఆశయమైన బానిస రాజ్యాంగ విధ్వంసమునకు తోడ్పడిన వారౌతారు.

రాబోవు సంవత్సరము కాంగ్రెసు మహాసభ సుభాసుచంద్రుని నాయకత్వాన, స్వదేశ సంస్థాన ప్రజా ఉద్యమం జహ్వార్‌లాల్ నాయకత్వాన, అఖిల భారత కిసాన్ సభ స్వామి సహజానందుని సారథ్యాన, సంయుక్త ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు నాయకత్వాన కార్మికులు, సంయుక్తంగా ఫెడరేషనుకు వ్యతిరేకముగాను, బానిస రాజ్యాంగ విధానాన్ని భగ్నం గావించుటకు, కాన్‌స్టిట్యూయంటు అసెంబ్లీ ద్వారా నూతన రాజ్యాంగ విధానాన్ని తయారు గావించుటకు, స్వాతంత్ర్య పోరాటము ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాము.

ఫెడరేషనుకు వ్యతిరేకంగా స్పష్టంగా ప్రకటితమైన కాంగ్రెసు అభిప్రాయాన్ని గమనించి బ్రిటీషు సామ్రాజ్యవాదులు ప్రస్తుత అంతర్జాతీయ విషమ పరిస్థితులలో ఫెడరేషనును ఏర్పరచడానికి నిర్బంధ విధానాన్ని ప్రారంభించ వచ్చును. ఈ దాడిని యెదుర్కోడానికి కాంగ్రెసువాదు లందరు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నాము.

మలబారు రైతు చరిత్రలో మరో విషమ ఘట్టమా?

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ.

కేరళ రాష్ట్ర రైతులు చాల నికృష్టదశ అనుభవించుచున్నారు. అందుచేతనే 1858 నుండి అనేకసార్లు కర్షకుల తిరుగుబాట్లు జరిగాయి. అఖరిది అన్నిటిలో ప్రఖ్యాతివహించినది 1921 లోని మాప్లా తిరుగుబాటు. ఈప్రాంతములో మతాధికారులైన నంబూద్రిలు గొప్ప జమీందారులు (వీరిని యిచట జన్మిలని పిలుస్తారు) భూమిలో ఎక్కువ భాగానికి వీరే స్వంతదారులు. మలబారు వ్యవసాయదారులను యీ విధంగా విభజించవచ్చును.

	జనసంఖ్యలో నూటికి
భూమిలేని వ్యవసాయకూలీలు	45
10 యకరాల్లోపు సాగుచేయు కవులుదార్లు	35
సాగుచేయని భూస్వాములు (జన్మిలు) భూమిలో నూటికి 80 వంతులు వీరిదే	5
సాగుచేయు భూస్వాములు	6
సాగుచేయని రైతులు (వకీళ్లు, ఉద్యోగులు)	9

మలబారులో భూమియంతయు జనసంఖ్యలో నూటికి 11 గురు చేతిలోనేవుంది. నూటికి ఐదుగురైన జన్మిల నూటికి 80 పాళ్లు భూమికల్గివున్నారు.

కవులుదార్లలో షుమారు నూటికి 10 మంది కనందార్లు వుంటారు. వీరు జన్మిలతో ఏర్పాటు చేసికొన్న కవులు ఏర్పాటుప్రకారం ప్రతిసంవత్సరం ముందుగానే కనం చెల్లించాలి. ఈ కవులు 12 సంవత్సరాలు వుంటుంది. వీరు చెల్లించు కనం సాధారణకవులుదారు చెల్లించు కవులులో షుమారు మూడోవంతు వుంటుంది. కనందారు సామాన్యంగా కవులు 12 యేళ్లకొకసారి మార్చుకుంటాడు. పూర్వం జన్మి కనందారును తొలగించే హక్కువుండేది. కాని 1927 శాసనంప్రకారం తొలగించడానికి వీల్లేదు. లాండ్ రివిన్యూకు, కవులుకు, ఆదాయానికి వున్నభేదం 2½ రెట్లు కన్నా హెచ్చించరాదు.

ఆందోళన చరిత్ర

1900 వరకు కేరళ రైతులకు ఎట్టి రక్షణ లేదు. ఆ సంవత్సరంలో టెనెంటు ఇంప్రూవ్మెంటు శాసనం ప్రకారం కవులుదారుని జన్మి భూమినుండి తొలగించిన, కౌలుదారు కౌలుకాలంలో చేసిన భూమి బాగుచేతకైన ఖర్చుయివ్వాలని నిర్ణయించారు.

1917-18 లో సర్ ఎం. కృష్ణన్నాయర్ నాయకత్వాన కనందారులకు భూస్వాధీనపు హక్కుకొరకు ఆందోళన ప్రారంభమయింది. ఇందుకొరకు శాసనసభలో ఒక బిల్లు ప్లాను చేయబడింది. కాని గవర్నరు తన ప్రత్యేక అధికారాల క్రింద జన్మిల భూస్వామ్య హక్కును తొలగించుతూందని అడ్డుతగిలాడు. ఈబిల్లులో కనందార్లకుకాని అత్యధిక సంఖ్యాకులైన తక్కిన కౌలుదార్ల హక్కుల విషయమై ఎట్టిశ్రద్ధ తీసికోలేదు. కాని మొట్టమొదటిసారి హిందూ ప్రజలందరికి మతాధికారులైన జన్మిల (భూస్వాముల) అధికారానికి మాత్రం చక్కని సవాలిది. ఈ ఆందోళన యింకా కొనసాగి 1926-27 లో మలబార్ టెనెన్సీ ఆక్టు ప్యాసయింది.

ఈఆక్టు ప్రకారం కౌలుదార్లందరకు కుడివరం హక్కు నిచ్చింది. కాని ఆచరణలో వీరిలో నూటికి 95 మందికి ఈహక్కు యింతవరకు ప్రాప్తించనేలేదు. కారణం కౌలుదారు దారిద్ర్యావస్థలో వున్నాడు: ఆక్టు ప్రకారం కుడివరం హక్కుకోసం ఒక సంవత్సరపు మగతా భూస్వామికి అదనంగా చెల్లించాలి: అది చెల్లించజాలని స్థితిలో వున్నాడుగాన ఆక్టు యిచ్చిన హక్కు అతనికి అందుబాటులో లేదు. ఈ ఆక్టులో యింకొక సెక్షను ప్రకారం న్యాయమైన మగతా నిర్ణయించాలి: కాని యీ నిర్ణయం 1942 తరువాత జరుగాలని వుంది. అంతే. యీఆక్టులో రైతులహక్కులు కొన్ని గుర్తింపబడినా, ఆక్టులో చేయబడినవన్న సౌకర్యాలు మాత్రం రైతులలో ఎక్కువ మందికి ఆచరణలో అందుబాటులో లేకుండా పోయాయి.

కేరళ రాష్ట్రంలోని స్వదేశ సంస్థానాలలోని రైతుల స్థితి యింతకంటే దుర్భరంగా వుంది. అచట కనందార్లుకాని కౌలుదార్లకు భూస్వాధీనపు హక్కే లేదు. జన్మి దయ తలచినపుడు భూమినుండి వెళ్ళగొట్టవచ్చును....

రైతుసంఘాల నిర్మాణం

కాంగ్రెసుమంత్రులు ఏర్పడిన తరువాత మలబారుకర్షకులలో ఆశాలత మరల చిగిర్చింది. కేరళ కాంగ్రెసు సోషలిస్టుపార్టీ యాజమాన్యాన ఆర్గనైజింగు కమిటీలు ఏర్పడ్డాయి. కేరళ రైతాంగము వేలకొలది సమావేశమయి తమ కోర్కెలను యెలుగెత్తి చాటసాగారు: (1) జిరాయితీ హక్కు (2) నికరాదాయంలో సగానికి (3) అప్పులలో తగ్గింపు వగైరా హక్కులకై ఆందోళన బయలుదేరింది. ప్రస్తుతం కేరళరాష్ట్ర కాంగ్రెసుసంఘ కారంలోవున్న అతివాదులు కర్షక ఉద్యమానికి తోడ్పడుతున్నారు. అఖిలభారత కిసాన్ సంఘ శాఖ అయిన మలబార్ కర్షకసంఘం గ్రామగ్రామాన రైతు సంఘాలు యేర్పాటు చేస్తోంది. మలబారు రాష్ట్ర కర్షకసంఘానికి అధ్యక్షులు పి. నారాయణ నాయకర్, కార్యదర్శి కె. ఏ. కేరాలీయన్.

డిశెంబరు 18 వ తేదీ చేవాయూర్‌లో ఏ. కె. గోపాలన్‌గారి అధ్యక్షత క్రింద మలబార్ రైతు మహాసభ జరిగింది. మహాసభకు ఉత్తర దక్షిణ మలబారు జిల్లాలనుండి 5 వందల రైతుల యాత్రాదళాలు రెండువచ్చాయి. కాలికట్ టౌను హాలులో రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు అబ్దుల్ రహిమాన్, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యదర్శి కృష్ణపిళ్లై మొదలగు నాయకులు స్వాగతమిచ్చారు.

రైతు మహాసభ చిరకాల్ కొట్టయం [illegible] రైతు ఉద్యమాన్ని [illegible]ంచారు. మలబార్ దక్షిణ కెనరా [illegible] జిల్లాల కలెక్టర్లు పంపిన సర్క్యులర్లను [illegible] హక్కుల [illegible] రైతులపై తెచ్చిన అభియోగాలను [illegible] అవసరమైన [illegible] పన్నుల నిరాకరణ, మగతా నిరాకరణ, సాంఘిక బహిష్కరణ ఉద్యమాలను వినియోగించడానికి రైతులు హక్కు కల్గివున్నారనియు, తప్పనిసరియగు చో పెల్ల అట్టి సద్దతులవలంభించ వచ్చుననియు హెచ్చరిస్తూ తీర్మానించారు. కొబ్బరి ఖరీదు తగ్గిపోవుటచే శిస్తులు కూడ తగ్గించవలెననియు తీర్మానించారు.

రైతులలో ప్రచారం. రైతు ప్రదర్శనాలలో వేలకొలది పాల్గొనుటచూచి జన్మిలు రైతులపై దాడి ప్రారంభించారు. ఉత్తర మలబారుజిల్లాలో పూనం(FugitiveCultivation). మిరియాలు పంటలు మలబారు టెనెన్సీ ఆక్టు క్రిందకురావు. అందుచే జన్మిలు యీపంటలు సాగుచేయుటకు రైతులకు భూమిని యివ్వ నిరాకరించుతున్నారు. అంతే ఆప్రదేశంలో ప్రతి బీద రైతు కుటుంబానికి పస్తుండాలిసిన స్థితి యేర్పడుతుంది. సాగుచేయడానికి భూమిలేక పోవుటేగాక, పూర్వంనుంచి అనుభవించుతున్న ఎండుపుల్లలు, వంటచెరకు తెచ్చుకొను హక్కులను ఆటంకపరుస్తున్నారు. జన్మిలు, స్థానిక ఉద్యోగులు జన్మిలకు సాయపడుతూ ప్రభుత్వానికి రైతు ఉద్యమానికి వ్యతిరేకంగా రిపోర్టులు పంపుతున్నారు. ఆమధ్య రైతులపై ప్యూనిటివ్ పోలీసు నియమింపబడుతుందని వదంతులుకూడా బయలుదేరాయి. కొత్తగా కొన్ని పోలీసు స్టేషన్లు యేర్పాటు చేయబడ్డాయి.

రివిన్యూ మంత్రి ప్రకాశంగారు డిసెంబరు నెల చివరభాగంలో అచటిపరిస్థితులను స్వయంగా విచారించడానికి మలబార్ టూర్ వెళ్లారు. ఏచట చూచినా వేలకొలది రైతులు తమకష్టాలను నివేదించుకొన్నారు. జన్మిలచే తాము పడుచున్న బాధలను తెల్పుకొన్నారు. రైతు సంఘ అధ్యక్షులు నారాయన్ నాయర్ గారు రైతుల తరపున మెమొరాండం యిచ్చారు. రైతు ఉద్యమం దౌర్జన్యపూరితమని ఉద్యోగుల ఆరోపణలు కల్పితమని రుజువుచేస్తారు. కాంగ్రెసుప్రభుత్వం వెంటనే రైతులకు సాయం చేయవలసినదని కోరారు. మలబార్ టెనెన్సీ ఆక్టును సవరణ చేయుటకు ఒకచిత్తు బిల్లును కూడా తయారుచేసి యిచ్చారు.

మంత్రిగారు ప్రభుత్వం మలబార్ రైతుల దుస్థితిని విచారించి తగినసాయంచేస్తుందనియు ప్యూనిటివ్ పోలీసులు నియమింప తలచుట అబద్ధమనియు స్పష్టంగా తెలియచేసారు.

జనవరి మూడవవారంలో మలబారులో ప్రచారం చేసిన అఖిలభారత కిసాన్ కార్యదర్శి రంగాగారు ప్రజలు క్రొత్తగా పోలీసుస్టేషన్లు ఏర్పరచుటను నిరశించుచున్నారనియు, వానిని రద్దుచేసి ప్రభుత్వం వెంటనే రైతులకు భూమిపై హక్కునిచ్చు శాసనాలు గావించాలని హెచ్చరించారు.

మలబారు రైతులు మేల్కొన్నారు. తమ హక్కులు సంపాదించుకొనువరకు వారు నిద్రపోరు. అచటి రైతాంగంలో చైతన్యం కలిగించి, వారి సంఘములను వృద్ధిచేసిన కేరళ కాంగ్రెసు సోషలిస్టు పార్టీకి అభివందనాలు తెల్పుదాము.

ప్రళయం

మంగిపూడి సర్వేశ్వర సిద్ధాంతి.

ప్రళయం ప్రళయం
ప్రజ్వలిత ప్రచలిత
అగ్నిజ్వాలలు అవి
దిగ్దిగంతముల
వ్యాపిస్తున్నాయ్

ఆకాశాంగణమున
కారుమబ్బులు
అల్లుకు
కమ్ముకు వస్తున్నాయ్

మిన్నుకుముస్తే
ధూమజ్వాలలు
యువకుల రక్తం
ఘనీభవించే ప్రళయం
హృదయాకాశమ్మున
మహోద్భుత ప్రళయం
వివిధజీవుల
ఆర్తనాదములు
శబ్దిస్తున్నాయ్
దశదిశల

అదే మనో ప్రళయం
మానవ ప్రళయం
విశ్వానికి ప్రళయం
ప్రళయంలోనూ
జ్వాలల్లోనూ
కనిపిస్తోందా
తేజస్సే

పరస్పర కలహం
మాని
పరుగిడి
పోదాం
తేజంలోకి
ఏటికి అవతల
తేజం లోపల
నూతన విశ్వం
కనబడుతోందా
అదే
విశ్వ మానవ
కళ్యాణానికి
సోపానం
విశ్వమానవ
సౌభ్రాతృత్వానికి
సహకారం



★ కథ

చెప్పులు కుట్టేవాడు

ముల్కరాజ్ ఆనంద్

నా చిన్నతనంలోనూ సౌదాగరుని ముసలతనములోనూ ఉన్న అమాయకత్వంవల్ల "మెషినంటే" ఒకవిధమైన ఆసక్తి యిద్దర్నీ ఆవేశించింది. సౌదాగర్‌ది మావూరే. నా ముసలి స్నేహితుడన్నమాట.

ఆ నల్లటిపిడి, దానిచుట్టూ పచ్చటి ఆకుల బొమ్మలు. వాటితో గజాలకు గజాలు బట్టని గబగబా కుట్టేసే ఆబట్టల మిషను చూడ్డానికి కొండలమధ్య నివసించే వాళ్ళంతా మైళ్ళకు మైళ్ళు నడిచివచ్చి పోతూంటారు. చిన్ని వసారాలో పీటమీద కూర్చొని ఆదర్జీ కుడుతూంటాడే — ఆమిషను — ఆమిషనంటే సౌదాగర్‌కు మహాయిష్టం. నాకుమాత్రం అలాకాదు. అన్ని మిషన్లు నాకిష్టమే. పట్టణంలోకి బడికెళ్ళేటప్పుడు చూసే మిషన్లన్నీ నాకిష్టమే. వాటిలో ఆపెద్ద రైలింజనొకటి. దాని ధ్వని చాల బాగుంటుంది. దానిలాగ అరవాలని యెన్నోసార్లు ప్రయత్నించాను. ఆగ్రామఫోనులో నామాటలూ వినాలని కుతూహల పడేవాణ్ణి తర్వాత.... ఆమోటారు కారు. దాన్లోనేకదూ? మానాన్నను లాలా సేన్ దాసు తన ఎలక్షన్లలో తీసికెళ్ళారు. ఇంకా.... ఆమోటారు సైకిలొకటి. దాన్లో మా చిన్న మాష్టారు రోజూ తన బంగాళానుంచి మాబడికి వస్తూవుంటారు. ఇంకా అంతులేని ఆ మరమేకులూ అవీ యివీ గుట్టలు గుట్టలుగా ఆ ఎలక్ట్రిసిటీని తయారుచేసే ఆ భవనములో, రెండు కాలువలకూ మధ్యగా పడివేసి ఉండేవి. ఆ మర్చేపోయాను—ఆ పెద్ద యినుపయంత్రాలు ఉక్కు యంత్రాలూ, మావూరి నూదిసీ, ఉన్నినీ బట్టలక్రింద మార్చేసే ఆ ధారీవాల్ మిల్లులు— రోజూ అవన్నీ నాకు మహాసరదా కలిగిస్తాయి. వాటితోపాటు, సౌదాగర్ ఉపయోగించేవి గాకుండా, కనీసము రెండురకాల మెషీన్లు చూశాను. మూడోదొకటి ఉంది. దానికి కాలితో త్రొక్కడానికి పెడలుకూడా ఉంది. దాన్ని పెద్ద బజారులో బహా-ఉద్దీను తొక్కుతూంటే చూస్తూండేవాడ్ని. అలాంటిదే భల్లా చెప్పులకొట్లో ఒకతను ఉపయోగిస్తూంటే కూడా చూశాను.

ఒకరోజు సౌదాగరుని తాటాకుల గుడిసెలో తలుపువారనుకొని కూర్చున్నాను. సౌదాగర్, తనకెదురుగా భగీరధుడు తన మెషీనును హుషారుగా త్రిప్పుతూ బట్టలు కుట్టడం, అప్యాయంగా చూస్తూ కూర్చున్నాడు పాపం. నాకు జాలేసింది. "ఎందుకు మామా యిలా చిన్నముక్కల్ని చెప్పులకు కుడుతూ కాలాన్నంతా పాడుచేస్తావు! పైగా వాళ్ళేమో నీవు బాగా కుట్టడంలేదనీ. చెప్పుల్లోకి నీరొస్తూందనీ అంటారు. హాయిగా భగీరధున్లాంటి మెషీను లాంటిది నీవూ కొనుక్కుంటే సరిపోతుందిగా. అంతకన్న మంచి దాన్నే దొరలు కూర్చొనే కుర్చీలలాంటివి తగిలించబడ్డ వాటినే కొనుక్కోవచ్చు. అలాంటి దానిమీదే కుట్టే ఒకాతనిని 'భల్లా' చెప్పుల కొట్లో చూశాను" అని అన్నాను.

"బాబూ! అలాంటి మెషినేదైనా ఉందా?" అని దర్జీ మెషిను కొన్నప్పటినుంచి అలాంటిదే తోలుకుట్టడానికి మాత్రం ఉండపోదని మనస్సులో అనుకుంటూ యిప్పటి కడిగాడు. నాకు చాలా ఉత్సాహమేసింది. వెంటనే "ఉంది మామా! నాకలాంటివన్నీ ఆటవస్తువులులాగుంటాయి. పట్టణంలోనికి నీవొకసారివెళ్ళి చూస్తే ఎన్నోరకాలు కనుపిస్తాయి. అబ్బ! నీగుడిసె దాటి బయటికడుగుపెట్టవుగామరి. లాహోరులో ఆ ప్రదర్శనాన్ని చూడ్డానికెప్పుడేనా వెళ్ళావా? మెషినుమీద కుట్టినబూటొకటుందిట అక్కడ మా నాన్న చెప్పారు. దానిలో మనుష్యులు దాకలమూచిలాడుకోవచ్చునట అని అన్నాను. మా స్కూలు రసాయనశాస్త్రభవనంలో అబ్బో! ఎన్నో గొప్పవస్తువులు చూశాను. పట్టణాలో ఆ పెద్దబజారులో ఎన్నో చిత్రాలు చూసాను. అవన్నీ మావూరికెప్పుడో వస్తాయనితలచాను. మా పల్లెలోని పురాతనపు ఆచారాలన్నీ పోయి, నవనాగరికత తప్పక వస్తుందని నాకో ఘట్టి నమ్మకం.

"నిజమే బాబూ! చేతికిబదులు పనిచేసే మెషినొకటుందని విన్నాను. గాని చూడలేదు. ఠాకూర్ మహన్‌చంద్ కొట్లోవున్న కళ్ళాలూ, జీన్లూ చూసినప్పటినుంచి సాధారణంగా మన చేతులు చేసినవి కావనీ, యింకా నేర్పుగల చేయి చేసుంటుందనీ అనుకున్నాను. అంతేగాదు ఆ భూస్వామికొడుకు పట్టణంలో కొన్న తన బూటును బాగుచేయడానికని పంపిస్తే అప్పుడే అనుకున్నాను, దాన్ని మనిషికుట్టలేడని. అప్పటినుంచీ భగీరధుని బట్టలు కుట్టే మెషిను లాంటిదే చెప్పులుకుట్టడానికుంటుందా అని ఆలోచిస్తున్నాను. కాని చూడుబాబూ! ముసలాడ్ని పది సంవత్సరాల్నుంచి పట్నం ముఖం ఎరగను. మెషినంటే ఎలావుంటుందో నాకు తెలీదు. ఒక రోజల్లా వెళ్ళిరావాలి దాన్ని చూడ్డానికి. కాని యేంజేస్తాం! కొనడానికేమో బీదవాణ్ణి. దేవుడు సరిగా చూడకపోతే, కొన్నప్పటికీ నా చేతులూ, నా శిష్యులచేతులూ అపనికి పనికిరాకపోవచ్చు." అన్నాడు ముసలాడు.

"మామా! చూడు. వక్కసారి ఆమిషను చూసావా మరి యింక వదలిపెట్టవు. దానికున్న కుర్చీలో కూర్చుంటే నీవొకదొరలాగ కనుపిస్తావన్నమాట. యిక కావలసింది నీకొక పెద్ద టోపీ. నీవుకూడా యిక కుర్చీలో కూర్చొని హాయిగాతినొచ్చు. మా యింట్లో పగిలిపోయిన బానను కుర్చీగా చేయొచ్చు. ఆ చిన్న కొద్దైను టేబిలుగా వాడొచ్చు. అలా వాటిని బోర్లించి కుర్చీగాను, టేబిలుగానూ మా అమ్మ వాడనిస్తే బాగుండును."

"కాని బాబూ! నేనేమో మాదిగవాడిని. నేనెలా దొరలలాగ కూర్చొని తినేది బాబూ, అలా కూర్చొని చెప్పులు కుడుతుంటే ప్రజలంతా నవ్వరూ?"

"లేదు మామా! వాళ్ళంతా శుద్ధ మూర్ఖులు. దొరలు శుభ్రంగా ఉన్నా వాళ్ళనీ మాదిగవాళ్ళలాగే చూస్తారీ ప్రజలు. ఈ పల్లెటూరివాళ్ళకి కాలం మారిందని తెలీదు. వట్టి ముసలితొత్తులు పశువులగుణాలును, వట్టి గొడ్లు. నూతన జీవితమంటే వాళ్ళకేమీ తెలీదు."

"అంతేబాబూ! దేవుడు మెషిన్లు చేసుకోమని యినుమును కొండల్లో పుట్టించాడనుకుంటాను!"

"నేనాటలాడుకొంటూంటే నాకొక మంచి బొల్టుదొరికింది. తెచ్చిచూపెట్టనా?"

ముసలాడి ముఖం చాటంతయింది. "ఏదీ బాబూ! తెచ్చిపెట్టూ. బాబూ! త్వరగా వెళ్ళిపో నాయనా. మీ నాన్న యింటికీపాటికొచ్చి మాదిగాడి కొట్లో వున్నావని తిడుతూండవచ్చు. త్వరగావెళ్ళి మీస్నేహితులతో ఆడుకోబాబూ!"

సాధారణంగా తన కష్టంగా పిల్లలు తన గుడిసె చుట్టూ గుమ్మంముందు నిలబడడం అతని కిష్టంలేదు. అందుకని నన్నెప్పుడూ అప్డు పెట్టకుండా ఉండడానికని వెంటనే నేను "నీకు కావలిస్తే, కుట్టే మిషను బొమ్మకూడా తెచ్చి చూపెడ్తాను మామా" అని అనేశాను.

"నిజమేనా బాబూ! ఏదీ తీసుకురా ఏమో చూపించి ఏంలాభం? కొనా పెట్టలేనమ్మకు ద్రాక్షగుత్తులు చూపితే యేం లాభంబాబూ!"

నా ఉత్సాహానికి పరిమితి లేకపోయింది. నిరాశాపూరితుడనుకున్న సౌదాగర్ హృదయములో మెషీను కొనాలనే ఆశ యింకా వున్నదనేసరికి నాకావేదన కొంత తగ్గింది. మా వూళ్లో కూడ చెప్పులు కుట్టేవాడి కోమిషనుంటుందనేసరికి నా ఆలోచనకంటే ముందు పరుగెత్తే కోరికలాగా నాబుర్రలో ఉత్సాహం రేకెత్తింది. వెంటనే యింటికి పరుగెత్తాను, యేదో భద్రంగా దాచినట్లు; మరి సౌదాగర్‌కు కావోయే మెషీన లాంటిదే కదూ! యిక దాంతో గాల్లో మేడలు కట్టేశాను. ఓగొప్ప మేడ ఉంటుందనీ, దాన్లో వేలకువేలు పెద్ద చక్రాలూ, మేకులూ, బోల్టులూ, పట్టాలూ ఉంటాయనీ, వాటి నన్నింటినీ ఎవరో మా సైన్సు మాష్టారిలాంటివాడే చేస్తుంటాడనీ ఇలా నాఆలోచనలు పరుగెత్తాయి.

నేను బడిలోంచి తిరిగి వచ్చేటప్పుడు రైలు స్టేషను గోడమీద ఒక కాగితాన్ని చూశాను. దాన్లో ఒక దొరసాని సింగరుమెషీను కుడుతూంది. నాతోడివాళ్ళను ఆగోడమీద కెక్కించి ఆకాగితాన్ని తీయించి పట్టుకెళ్ళి సౌదాగర్‌కు యిచ్చాను.

"ఇదిగో మామా! నీకు మెషినుకావాలి అని చెప్పానే యీ బొమ్మలో లాంటిదే. ఇదేమో బట్టలు కుట్టేది. చెప్పులుకుట్టేదికూడా యిలానే వుంటుంది. కాని, దానికి బలమైన సూది ఉంటుంది."

వెంటనే సౌదాగర్ దానిపైపు ఆశ్చర్యంగా చూశాడు. తనచేత్తో యేదో ఆప్యాయంగా దాన్ని నిమిరాడు. అతని ముఖంవేపు చూస్తే ఆ భగీరధుని కున్నదానికన్న గొప్ప మెషిను కావాలని అతనేదో పట్టుదలతోనే ఉన్నాడనీ కన్పిస్తుంది.

అప్పటికీ అతను తృప్తిపడలేదు. వెంటనే మేము దొంగిలించిన ఆ సింగర్ మిషన్ ఉక్కుబోల్టుకుకూడా తన కొట్టులో వేయమని చెప్పిన మా కష్టానికి ఫలితంగా తలొక కానీ చేతిలో పెట్టాడు.

ఎప్పటికో ఒకప్పుడు ఆ మిషను కొనకపోతానా అనే ఉద్దేశ్యంతో సౌదాగర్ దాని ఆకారాన్నెప్పుడూ చూస్తుండడానికని ఆ బొమ్మను కొట్టులో తగిలించాడు కాని అలంకారానికికాదు. తర్వాతకూడా అదే నిజమనిపించింది నాకు. నేవెళ్లినప్పుడల్లా అతను దాన్ని గురించే చెప్పుతుండేవాడు. దానిసూది సరిగ్గా తెలీడం లేదనీ, దాన్నోవేపు తొక్కుతూ, మరోవేపు ఎలా కుట్టగలదని అడుగుతూండేవాడు.

"కాని బాబూ! దాని వెనకుండే పీట చాల చిన్నదానిమీద కూర్చొని ఎలా త్రొక్కడం?

మా చిన్న గ్రామంలో సౌదాగర్ భల్లా చెప్పుకొట్లో వాడిలాగ కూర్చోబోతున్నాడని నాలో నాకే ఉత్సాహంగా ఉంది. "ఏం భయపడక్కరలేదు మామా! కొద్ది రోజులలవాటైతే చాలు. ఇంతకన్న బాగాకూర్చుని తొక్కగలవు ముసలాడివైతే యేం చూడు పట్టణంలో ఇంజనీరుగారి భార్య చూశావా! యేం సాహెబ్.... ఆమె వసారాలో నున్న పీటమీదనే హాయిగా గుర్రంమీద కూర్చునట్లు కూర్చుంటుంది." అని ఉత్సాహంతో జవాబుచెప్పాను.

అతని అమాయకపు దృక్కులలో చిన్న వెలుగు కన్పించింది. నావైపేదో ఒకవిధమైన వినయంగానూ, వాత్సల్యంగానూ, పరిలోకించడం మొదలెట్టాడు. అకుపచ్చని బల్లమీద తెలుపు నలుపులలో చెక్కబడ్డ బొమ్మనుజూచి సంతోషించడం మొదలెట్టాడు. కొంతసేపు కళ్ళుమూసుకొని యేదో ఆలోచించాడు. అంతా గందరగోళమైపోయింది. తాను ఊహాలో కంటూన్న కొత్త చెప్పులన్నీ పాతవస్తువులతో. పోటీ పడ్డట్లు గజిబిజిగా కొట్టుకున్నట్లు తోచింది.

"కాని చూడుబాబూ! ఈ కష్టాన్ని చూశావుగాదు. దీన్ని కొనడానికి డబ్బెక్కడ పుడుతుంది నాకు. అంతేగాదు. ఈ మెషినెలాదొరుకుతుందో కూడ తెలీదు. అసలు నాకు డబ్బెంతేగా!" పాపం, అతనిముఖంలో కాంతిలేదు. చాల విచారిస్తూ నిట్టూర్పుతో చెప్పాడు.

అతని వాదనకు నా తెలివితేటలేమీ పనిచేయలేకపోయాయి. మరి ఆ మిషను యెంత ఖరీదవుతుందో, డబ్బెక్కడ దొరుకుతుందో నాకు తెలీదు. మిషినెక్కడ దొరుకుతుందోమాత్రం నాకుతెలుసు. బొమ్మక్రింద 'సింగర్ సూయింగ్ కంపెనీ, ఇంగ్లండు.' అని ఉంది. బట్టలు కుట్టే మిషన్లుంటే చెప్పులు కుట్టేవికూడ ఉండకపోవనే ఘట్టి నమ్మకముందినాకు.

"దాన్ని సీమలో తయారుచేస్తారుట. అక్కడ్నుంచి తెప్పించుకోవచ్చు. మన జిల్లాలో లేక

పోయినా లాహోరులోనో, బొంబాయిలోనో దాని ఏజంట్లుంటారు. వాళ్ళ దగ్గర్నుంచి తెప్పించుకోవచ్చు."

"సీమ చాలదూరం. ఆ సప్త సముద్రాలు స్వర్గానికెళ్ళాలనొచ్చినా నేను దాటలేను. ఐనా స్వర్గానికెళ్లేటంత పుణ్యం నేనేం జేశానుగనక. ఎవరేనా పట్టణాలకి వెళ్తాంటే దీనివిషయం విచారించవచ్చు. అలానే చేద్దాం."

కొన్నివారాలు గడిచాయి.... మాసాలు గడిచాయి ఎవరుగానీ మా ప్రాంతాలనుంచి లాహోరుగాని, బొంబాయిగాని పోతున్నట్లు కనుపించలేదు. నేను నిరాశచెందడం ప్రారంభించాను. నాకలలన్నీ అంతరించాయి. అతన్ని చూడ్డానికి రోజూ సాయంత్ర వెళ్తానే ఉన్నాను. కాని పాపం నాతో ఆమిషను విషయం ఎత్తడం తగ్గించాడు. దానికి బదులు, తన చెప్పుల్ని కుట్టుకుంటూ ఏవో పిట్టకథలు చెప్పడం మొదలెట్టాడు. ఆ అదివిజంతు వలాచేసిందనీ, యీ ముసలి మంత్రగత్తెకు చచ్చేవరకూ పెళ్ళే లేదనీ—ఏవో చెప్పేవాడు.

ఒకరోజు ఎప్పటిలాగే సౌదాగర్ యింటి ప్రక్కనున్న మైదానంలో స్నేహితులకోసం ఆటలాడుకునేందు కెదురుచూస్తూంటే సౌదాగర్ పరుగెత్తు కొచ్చేశాడు. సాధారణంగా మౌనముద్ర వహించే అతని ముఖంలో నొకచిన్న దరహాసం కన్పించింది. అతనొక పిచ్చివాడిలాగ అట్టహాసంచేసాడు. తర్వాత "బాబూ! యిలారా! యేం జరిగిందో చెప్పుకో!"

అతని ముఖాన్నిచూస్తే అదియేదో మిషను మిషయమే అయివుంటుంది. అవుత్సాహం, ఆపిచ్చి, ఆ గంతులూ అని అనుకున్నాను. "ఏమిటి? చెప్పు! మామా!"

"లాలా సేన్‌దాసు సీమకెళ్ళాడని నీకూ తెలుసుగా! అతనితో వర్తకం చేసేవాళ్ళకివ్వడానికని నన్ను బంగారు తగరంతో జోళ్లు కుట్టివ్వమన్నాడు. నేను చేసిచ్చాను. ఆయన అవి పట్టుకెళ్తూ నీకేమి సహాయం గావాలన్నాడు. తోలుకుట్టే మిషను తెచ్చిపెట్టమన్నాను. అలాగే అన్నాడాయన. నేను బీదవాడ్నిగామరి. అందుకని తానే మిషనుకొని తెచ్చిస్తే దాన్నివాడుతూ వచ్చిన డబ్బును బాకీక్రింద కొద్ది వడ్డీతో తీర్చేస్తాను. చూశావా! ఇప్పుడు రైలువాళ్ళ దగ్గిర్నుంచి జాబువచ్చింది. మున్షి చదివాడు. లాలా సేన్‌దాసు చెప్పులు కుట్టేమిషను పంపాడుట. అది రైలు స్టేషనులో ఉందని రశీదొచ్చింది. అమ్మయ్య! నాకూ మిషనొచ్చింది. మెషీను రాగానే శుభకార్యంలాగ మావాళ్ళందరికీ పంచదార చిలకలు పంచేస్తాను. అసలు విషయానికంతటికి కారణం నీవేకాబట్టి నీకు మంచి యింగ్లీషు బూట్లజత ఆమెషీనుమీదే మొదట కుట్టిస్తాను.

నా ఉత్సాహానికి అంతులేక పోయింది. చప్పట్లుకొట్టాను. గంతులేశాను. బరేబరే అనుకుంటూ అరిచేశాను గొంతు బోయేలాగ. నాలో నాకే నాట్యం ఆడినట్లుంది. అమెషీను, దాని ఆకారం, రంగులు, తిరగడం, దానిమరలు, దానిమీద బొమ్మలు, అన్నీ మహాద్భుతంగానూ నా కాటవస్తువుల లాగనూ కన్పించాయి. సౌదాగర్ నాకు యింగ్లీషు బూట్లను యిస్తాననేటప్పటికి సంతోషంతో పిచ్చివాడ్నైపోయాను. ఆ బూట్లకోసమే కొన్ని సంవత్సరాల్నుంచీ మా నాన్నను యేడ్పించుక తింటున్నాను. వాటిని గొప్ప గొప్ప దొరలుతప్ప వేసికోరు. అలాంటివాటిని నేను వేసుకుని తిరుగుతూంటే నా స్నేహితులు నన్నెంత గొప్పవాడ్నిగా చూస్తారు?

"నీకసలు మెషీను యిక్కడి కెప్పుడు వస్తుంది మామా!" అని చాల ఆతురతతో అడిగాను.

"రేపుదయానికే వెళ్లి తెస్తాను. పట్టణానికెళ్లి పదకొండు సంవత్సరా లయింది"

"అలా అయితే పట్టణంలో కెళ్లగానే 'భల్లా' చెప్పుల కొట్టులోకెళ్లి అక్కడ చెప్పులు కుట్టే అతన్ని యీ మెషినెలా ఉపయోగించాలో అడిగి తెలిసికో"

"ఆ, నిజమే నాయనా, మంచిమాట చెప్పావు. ఆపని తప్పక చేస్తాను. ఆసలహా నీవేయిచ్చావు కాబట్టి యిప్పుడే నీకాలి కొలతలు తీసికొని రేపు మొదట మిషనుమీద నీచెప్పులే మొదలెడతాను."

ఆ మిషనునుగురించి సౌదాగర్‌తో యింకా చాలాసేపు మాట్లాడేవాడ్ని. కాని నా స్నేహితులింతలోకే పిలిచేశారు. ఆ సాయంత్రంగూడ సౌదాగర్‌కు నేనిచ్చిన సలహానుగురించి ఆలోచిస్తూ చెడుగుడుకూడ సరిగ్గాఆడలేదు. ఆ రాత్రికూడ యీకొత్తఉద్దేశాన్ని ముసలాడికి నేనే సూచించాననే ఉత్సాహంకొద్దీ నాకు నిద్రపట్టలేదు. ఉదయం బడికి-నా కలలన్నీ నిజమైనట్లుగా-గర్వంగా వెళ్ళాను. ఆ రోజు నేనుచేసిన అల్లరికి చెప్పడానికే వీల్లేదు. మహాఉత్సాహంగా ఉన్నాను.

నేను బడినుంచి తిరిగిరాగానే సౌదాగర్ యింటికెళ్ళా. చుట్టూ బడిపిల్లలూ, పెద్దలూ శిష్యులూ చూస్తూంటే అతనా చిన్న పీటమీద కూర్చొని తళతళలాడే ఆ మిషనుమీద తోలు ముక్క వేసి చెమటార్చుకొంటూ కుట్టడం ప్రారంభించాడు.

నన్నుచూడగానే "రా నాయనా రా! ఇదిగో యిది బూట్ల పైభాగం. నీకే యీబూట్లు. మరి నీదేగా మొదటి వంతు."

ఒక్క పెద్దనవ్వునవ్వేశాను. వెంటనే ఆ మిషన్ యెలాఉంటుందో చూడాలనిపించింది. దాన్ని ముట్టుకుని చూస్తే అంతా నే దెచ్చిన బొమ్మలాగనే ఉంది. పోతే దీనికి పైని మూసివేయడానికి మూతమాత్రం లేదు. ఇంతలోకే నన్ను చూసి అంతా ముట్టుకోడానికి మూగారు. వెంటనే సౌదాగర్ అందర్నీ అలా నెట్టేశాడు. నేనూ నాచిన్నతనపు చేష్టల్ని మానేసి నా చెప్పులెప్పటికవుతాయని అడిగాను.

"నెమ్మదిగా అవుతాయిలే. తీరికున్నప్పుడల్లా నీవే కుట్టేస్తాను. పనున్నప్పుడు నాపని చూడొద్దూ? మరి సేన్‌దాసు రేపే వస్తాడు. డబ్బు త్వరగా సంపాదించి తీర్చివెయ్యాలి."

సౌదాగర్ యింటికి చాల తరచుగా రావడం మొదలెట్టాను. అంటరానివాడైనా బూట్లు చూడ్డానికెళ్తున్నానని మా నాన్నకు సాకులు చెప్పి రాగలుగుతున్నాను. నానాటుచెప్పు లేమో అరిగిపోయాయి. సౌదాగర్ యింటికి వెళ్లనివ్వకపోతే యింటిదగ్గిర చెప్పులు కొనిపెట్టమని యేడ్పిస్తానని నన్ను వెళ్ల నిచ్చారు.

తర్వాత సౌదాగర్ నాకు చేయాలనుకున్న చెప్పుల కొక కుట్టు కుట్టి ప్రదర్శనాని కన్నట్లుగా తన గుడిసెలో వ్రేలాడగట్టి ఉంచాడు. కాలమంతా సేన్‌దాసు కివ్వవలసిన బాకీ దీర్చడానికి వేగంగా నాటుచెప్పులన్నీ కుట్టడం మొదలెట్టాడు పన్నులు, ఖర్చులు, ఖరీదు, అంతా కలిసి వేయి రూపాయి లయిందనీ, నూటికి సంవత్సరానికి 15 రూపాయల వడ్డీ చొప్పున తీర్చాలన్నాడుట సేన్. నేనా కొట్టుకు వెళ్ళినప్పుడెల్లా నాచెప్పుల్ని తీసి అటూ యిటూ తిరగేసేవాడు. "ఏంబాబూ! దాని కండుకుట్టడం వచ్చేవారం మొదలెడతాను. తర్వాత తమ, 'జీతాను' ను బంపి మడమ క్రిందకు వేయడానికి మంచితోలు తెప్పిస్తాను. లేకపోతే నీకు రబ్బరువి యిష్టమేనా!"

ఇంకా మడమ వేయడమే కాలేదనే టప్పటికి నిరాశ, నిరుత్సాహమూ కలిగింది. "ఎబ్బే! నాకు రబ్బరువీ. తోలువీ కావాలి."

"లేదుబాబూ! రెండు వక్కసారే వేయడానికి వీల్లేదు" అని మెల్లగా అన్నాడు.

"నాకు క్రొత్త ఫేషన్ కావాలి"

"కాని మొదట సాధారణమైన జతనే చేయనీయండి బాబూ! ఆ తర్వాత యేదో...."

"నిజంగా యెప్పటికి తయా రవుతాయి మామా!" అన్నాను కొంత నిరుత్సాహంతో.

"వీలుగా వుండే దేవుడి దయవల్ల రేపే కొంతపూర్తి చేస్తాను బాబూ!"

ఇలాంటి రేపు లెన్నో అయాయి. రోజూ విసుగెత్తి పోతూంది. నాచెప్పులన్నీ తెగిపోయాయి. వట్టి కాళ్లతో బడికీ యింటికీ, చెప్పులు కొననందుకు మానాన్ననూ, చెప్పులు త్వరగా కుట్టివ్వ నందుకు సౌదాగర్‌నూ తిట్టకుంటూ కొన్నిదినాలు నడిచాను. నా తల్లిదండ్రులు నీమ జోళ్లు కొనిపెట్టలేని బీదవాళ్లని గ్రహించలేకపోయాను. అందుకని నానాటుచెప్పులు వద్దని గట్టిపట్టు బట్టాను. దానికితోడుగా సౌదాగర్, సేన్‌దాసుకు బాకీ తీర్చేయడానికే, పనినంతటినీ వినియోగించడం చూసి నాకు బాధగల్గింది. దీనితో విసుగెత్తిపోయింది.

మా అమ్మ చివరకు "నాయనా! పాతచెప్పుల్లాంటివే కొనిపెడ్తానురా వేసుకో నాయనా" అంది.

"ఉహూ! సీమచెప్పుల్లాంటివే గావాలి. నీకేం బట్టింది నీ వూరుకో. సౌదాగర్ చేసి పెడతాడులే."

ఆమె సామెత లేకరువుపెట్టడంమొదలెట్టింది "లేదురా నాయనా, చాకలిమాట, మంగలిమాట, మాదిగమాట నీళ్లలో మూటరా"

దైవసంకల్పం అలాచేసిందిగాని నానమ్మకం యెప్పటికైనా జరిగితీరాల్సిందే. పాపం, సౌదాగర్‌కు జబ్బుచేసి కొన్నిరోజులవరకూ యే పనీ చేయలేకపోయాడు. నయం అయిన తర్వాత బాకీ యెక్కువ అయింది కాబట్టి దాన్ని తీర్చేందుకు చాల యెక్కువ పనిచేయాలనొచ్చింది. అందుకని పాపం కొంతకుట్టినా, చెప్పులవిషయం యెత్తడానికే వీల్లేకపోయింది. మిషను ఖర్చు కయ్యేవడ్డీమే సరిగ్గా చెల్లించకపోవడంచేత నా చెప్పులు పూర్తిచేయడం నాకు సందేహంగా ఉంది.

నేవెళ్లినప్పుడల్లా అతను ముఖంమీదికి నేలమీదికి చెమట గారేలాగు పాపం పనిచేస్తూంటే అతన్ని బాధించడానికి మనస్సొప్పకపోయింది. ముసలాడిమీద కల్గిన విసుగూ, జాలీ, చివరకు నాలో మిషనుమీద అసహ్యాన్ని పుట్టించాయి. ఎందుకంటే డబ్బులిస్తేగాని తోలుముక్కలు పట్టుకొననంత స్థితికి ముసలాడ్ని తీసికొచ్చిందీ మిషనే. అందుకే దానిమీద నాకసహ్యం. అదే సౌదాగర్‌కూ నాకూ మధ్య అఘాతాన్నేర్పరచింది. అతనిహృదయంలోని నిశ్శబ్ద ప్రదేశాలలో తన రక్తాన్ని తానే త్రాగడానికి అంతర్యుద్ధమైనట్లుగా ఆ మెషీనుకు అంటగట్టుకొని కూర్చోవడం వల్ల రోజురోజుకూ కృశించి పోయాడు. అతని సహజకాంతి నశించింది. ముఖం వెలవెల బోతూ మురికితోనూ, విషాద ఛాయలతోనూ కప్పబడింది. అప్పటికి తానూ, తన శిష్యులూ చేతులు విరగ్గొట్టుకునీ, అన్నం నీళ్లూ మానుకునీ అప్పు దీర్చడానికి పనిచేసినా నా చెప్పులు మాత్రం అలా వ్రేల్లాడుతునే ఉన్నాయి.

నా ఆశలన్నీ వదులుకొని, తాను చేసిన వాగ్దానం పూర్తి చేయలేదనే పశ్చాత్తాపంతో ఎప్పటికయినా పూర్తిచేయడా అనే నమ్మకంతో అతనింటికి వెళ్లడం చాలవరకు తగ్గించాను.

ఆరోజసలు రానేలేదు. ఓపికకు మించి కుట్టాలనొచ్చింది బాకీ తీర్చడానికి. రోజురోజూ యీ శ్రమకు రక్తాన్ని చెమటలాగ ధారవోసాడు. శరీరం రోజురోజూ క్షీణించింది.

ఒకరోజు పాపం తన అంత్యగీతాన్ని స్మరించుకుంటూ సౌదాగర్ తన ప్రాణవాయువుల్ని నిశ్చలంగా వదలేశాడు.

నాకేమీ తోచలేదు. ముసలిమిత్రుని మృతికి కారణం కొంతవరకు నేనేనని నా హృదయం వేదించుకు తింటూంది. సౌదాగర్ మృత్యువుకు కారణం మెషిన్ రూపములోనున్న భూతమేనని ఊళ్లో వాళ్ళంతా అంటున్నారు. సౌదాగరూ అతని శిష్యులూ — మెషినును ప్రేమించడం, దానితో పని చేయడం మాత్రమేచాలదు; మెషినుకు యజమానులై కూడా ఉండాలి. అప్పుడే వారికి సుఖం. ఈ విషయం మొదటనే నాకు తెలిస్తే ఆగ్రామస్థుల మాటను తిరస్కరించేవాణ్ణిగద!

జమీన్ రైతు ఆందోళనలో రాష్ట్ర రైతు సంఘపు కృషి.



ప్రకాశం కమిటీ నివేదిక వెలువడిన వారం రోజులకే సంఘసాధారణసభ డిసెంబరు 4, 5 తేదీలలో సమావేశమై, నివేదికలో జమీన్ రైతులకు లాభకరమయ్యే కొన్ని సూచనలు గావించి, వాటిని ప్రకటించినది. ప్రచార కార్యక్రమమును కూడ నిర్ణయించి వెంటనే కార్యాచరణకు గడంగినది. సంఘాధ్యక్షులు వివిధ జిల్లాలలో 27 రోజులు పర్యటనమొనర్చి, 63 కేంద్రములలో సభలు జరిపి, 400 గ్రామాదుల ప్రాతినిధ్యముగల 50 వేల రైతాంగమునకు నివేదికనుగురించి ప్రబోధము సల్పిరి. సంఘముయొక్క ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి శివలింగప్రసాద్‌గారు 20 రోజులు పర్యటనము గావించి, 25 కేంద్రములలో సభలు జరిపిరి. ప్రధానకార్యదర్శి చలసాని వాసుదేవరావుగారు ఆఫీసుపని కరపత్రముల పని చూచుకొనుచు 20 కేంద్రములలో సభలు జరిపిరి. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాష్ట్రమంతటా జరిగిన వివిధజిల్లా జమీన్ రైతు సమావేశములలో పాల్గొనిరి. ఇంచుమించు అన్ని జిల్లా రైతుసంఘ నాయకులును అనేకగ్రామాలలో ప్రచారం గావించి రాష్ట్రసంఘముయొక్క కార్యక్రమమును జయప్రదముగా నెరవేర్చిరి.

రాష్ట్ర రైతుసంఘం తరపున "ప్రజాసామాన్యం ఏమిచేయాలి?" "యాత్రల విజ్ఞప్తి" "ప్రకాశంకమిటీ నివేదిక" అను మూడు కరపత్రములు ప్రకటింపబడి, రైతుల కందజేయబడెను. అందు, "ప్రకాశం కమిటీ నివేదిక" పలువురు శాసనసభ్యులచే ప్రశంసింపబడినది. దానిద్వారా నివేదికయందలి ప్రధానాంశముల నన్నిటిని తెలుపబడినది.

డిసెంబరు 12 మొదలు 19 వరకు రాష్ట్ర రైతు సంఘం ఏర్పాటు గావించిన జమీన్ రైతు రక్షణవారము అనేకచోట్ల, వేలకొలది రైతులతో, జయప్రదముగా కొనసాగెను. తండోపతండములుగా రైతుయాత్రలు స్థానిక ప్రభుత్వ కచేరీలకు సాగింపబడెను. 20 వ తేదీ "రైతు రక్షణ దినము"గా పరిగణింపబడి, అన్ని జిల్లాలలోను సభలు ఊరేగింపులు జరుపబడెను. ఆరోజున వందలకొద్దీ టెలిగ్రాములు శాసనసభ కందజేసిరి. వేలకొద్దీ పిటీషనులు, తీర్మానములు, రాష్ట్ర రైతు సంఘంవారి సూచనలతో ప్రకాశం కమిటీ నివేదిక శాసన మొనర్చబడాలని రైతుల నిశ్చితాభిప్రాయమును ప్రభుత్వమున కందజేయబడెను.

సంఘాధ్యక్ష, కార్యదర్శులు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు గారలు 19 వ తేదీవరకు ప్రజాకార్యక్రమంలో పాల్గొని, తరువాత 20 వ తేదీని మదరాసువెళ్ళి, శాసనసభా వ్యవహారములను గమనించుచు, పలువురు శాసన సభ్యులను కలుసుకొని మాట్లాడిరి. రైతుల కోర్కెలను వారి కెరిగించిరి.

మొత్తంమీద, యీ నెలరోజులలో ప్రకాశం కమిటీ నివేదికయొక్క ప్రధమాంకము జయప్రదముగానే కొనసాగినది. అందుకు చైతన్యము పొందిన రైతులు, ఉత్సాహవంతులైన రైతు సేవకులు, యువకులు, సోషలిస్టులు జమీన్‌రైతు సంఘం వారు యీ కార్యక్రమమంతటిలోను తోడ్పడిరి. ఇకముందు కూడ, బిల్లు శాసనమగు వరకును రాష్ట్ర రైతు సంఘమువారు నిర్ణయించు కార్య విధానమునకు ఎల్లరు తోడ్పడి, జయప్రదముగా ప్రచారము, ఆందోళన కొనసాగించి, సామ్రాజ్య శక్తులను జమీందారీ శక్తులను ఎదుర్కొనవలెనని ఎల్లరిని కోరుచున్నాము అని రాష్ట్ర రైతుసంఘాధ్యక్షులు ప్రకటించుచున్నారు.



నందిగామ తాలూకా కలకోవ రైతు సభ

పంగిడిగూడెం ఎస్టేటు

17-1-39 వ తేదీ నుండి నేనూ, కామ్రేడ్ రంభా వెంకటప్పయ్య, పి. భుజంగరావు, చింతాడ రంగారావుగారలు పశ్చిమ గోదావరిజిల్లా, ఏలూరుతాలూకాలో వసంతవాడ, సత్యవోలు, నాగులపల్లి మొదలైన జమీందారీ-యినాందారీ గ్రామాలలో ప్రకాశం కమిటీ నివేదికనుగురించి ప్రచారము గావించితిమి. ఆయా గ్రామాలలో రైతులు భరింపరాని అనేక దురంతములకు గురియగుచున్నారు.

వసంతవాడ : ఈ గ్రామానికి రామిలేరు అనే యేరు ఒకటున్నది. దానినుండి రైతులు యిసుక తెచ్చుకొంటే, బండి 1కి 0-2-0, మట్టుకి 1కి 0-0-6 చొ॥, ఎస్టేటువారు ఎట్టిఅధికారం లేకుండా వసూలు చేస్తున్నారు. పుంతలు, దారులు వగైరా సాముదాయిక భూములు స్వాధీనపరచుకొన్నారు.

సత్యవోలు : ఈగ్రామానికి దారివసతిలేదు. పంటకాలువ మరమ్మతులు అసలేలేవు. పెనార్డీ బాధ దుర్భరంగాఉన్నది.

నాగులపల్లి : ఇది పంగిడిగూడెం ఎస్టేటులోని గ్రామం. రైతుల హక్కుదుక్తంతోఉన్న ఒక వేపచెట్టును ఎస్టేటువారు నరుక్కుపోతూంటే రైతులు అపుచేసినందుకు 15 మంది మీద దౌర్జన్య నేరం బనాయించారు. ముగ్గురికి 75 రూపాయల జరిమానా విధించబడింది. ఈ గ్రామంలో పండే మెరకపంటలతో జీవితం గడుపుటే దుర్భరం అవుతోంటే, ఎస్టేటువారు ప్రజలమీద కేసులుబనాయించి కోర్టులకీడ్చుచున్నారు. మొన్నటి తుపానుకు యీగ్రామంలో 200 పశువులు చచ్చిపోయినవి.

పంగిడి గూడెంలో కూడా రైతుల తాటిచెట్లన్నీ నరికించి అమ్మివేస్తున్నారు. జమీందారు పెట్టే బాధలు బహిరంగంగా చెప్పడానికి భయపడుచున్నారు.

వేంపాడు: ఈగ్రామం కూడా పై ఎస్టేటులోనిదే. గంటి చోడి మొదలైన మెరక పంటలుతప్ప ఫలసాయాన్ని కలిగించే యితర పంటలేవీ లేవు. సుమారు 2 నెలల క్రితము ఎస్టేటువారు రైతుల చెట్లను నరుక ప్రయత్నించగా, రైతులు చెట్లను కౌగలించుకొని సత్యాగ్రహం చేశారు. అయినా, ఎస్టేటువారు రైతులపై నిర్బంధ విధానం అవలంబించారు. ఒక రైతును మూర్ఛపోయేటట్లు కొట్టించారు. జమీందారుగారి బావమరది ఏడ్చుచున్న స్త్రీల మీదికి ఏనుగును పరుగెత్తించి తన పౌరుషమును వెల్లడించుకొన్నాడు. ఆగ్రామంలో పండే పంటను రేయింబగళ్లు కాపలాకాయాలి. లేకపోతే ప్రక్కనున్న అడవినుండి అడవిపందులు వచ్చి పంటను నాశనం చేస్తాయి. రైతులు మాత్రం వాటిని చంపకూడదు. ఒకవేళ చంపితే అథవా ఏ వేటగాడు చంపినా, 12, 15 రూపాయల చొప్పున జరిమానా విధిస్తారు. చింత కుంకుడు, మామిడి మొదలైన చెట్లు రైతుల భూములలో ఉన్నప్పటికీ, వాటి ఫలసాయం ఎస్టేటువారే తీసుకుపోతారు. పైగా, తమ యిష్టం వచ్చినట్లు నష్టం నిర్ణయించి దాన్ని రైతులవద్ద వసూలుచేస్తారు. గొఱ్ఱెలు - పశువులు వగైరాలకు పుల్లరి చెల్లించినప్పటికీ, 100కి 2 మేకల చొప్పున దసరా మామూలు యివ్వాలి. ఆగ్రామములో మంచినీటి చెరువు ఒకటి ఉంది. దానిని రైతులు స్వంతంగా మరమ్మతు చేయించుకోబోతే, జమీందారుగారు అది తనదని అడ్డు వచ్చారు. 12 ఏండ్ల క్రితం, తాలూకా బోర్డువారు నుయ్యి త్రవ్వకొనుటకు 2500 రూపాయలు గ్రాంటుచేశారు. గ్రామస్థులు నుయ్యి తవ్వించుకున్నారుగాని, నీరుపడలేదు. ఆనుయ్యి రైతుల భూములలో త్రవ్వబడినప్పటికీ, తన పర్మిషన్ లేకుండా త్రవ్వుటకు హక్కులేదంటూ జమీందారుగారు 200 రూపాయల జరిమానా విధించారు.

ఈ విధంగా ఉన్నది జమిందార్ల పరిపాలన. ఈ అక్రమాలన్నీ నశించాలంటే జమిందారీ విధానం నాశనం కావాలి. ఈలోగా రాష్ట్ర రైతు సంఘంవారి సవరణలతో ప్రకాశం కమిటీరిపోర్టు శాసనం అవాలి. అని కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు గారు వ్రాయుచున్నారు.

* * *

దివితాలూకాలో పేద రైతుల కష్టాలు

గడచిన డిసెంబరులో గాలితుపానువల్ల రైతులకు చాలా నష్టము కలిగినది. రిమీషను యిప్పించ వలసినదని రైతులు అర్జీలు పెట్టుకున్నారు. అధికారులువచ్చి పొలాలు తనిఖీ చూచేవరకు పైరు కొయ్యకుండా ఆపడం, యీలోగా సగము ధాన్యం రాలిపోవడం, జరిగింది. ఇన్ని కష్టములు పడినా, అధికారులది రాతి గుండె. రెమిషన్ కాంక్షను చేయమని పేద రైతు లెంత బ్రతిమాలినా, "నీఖర్మం. ఏడువు?" అని తిరస్కరిస్తారు. న్యాయములను విచారించరు. కాని, పెద్ద భూస్వాములు ఏ నూరు రూపాయలో అధికార్ల కిచ్చాడంటే, వెంటనే రిమిషన్ లభించినదన్నమాటే. ఏ రావుసాహేబు బిరుదాంకితులైనా ఉంటే, చేను పూర్తిగా పండినప్పటికీ, రెమిషన్ ! పేద రైతుకు ఒక రెమిషన్ వచ్చినదంటే, కరణంగారి మామూలు 3 రూపాయలు, యితర ఖర్చులు 2 రూపాయలుపోగా, లాభం ఒక్క రూపాయ మాత్రమే. అదైనా కరణంగారి యింటిచుట్టూ 10 రోజులు తిరిగి, వారికి నానా చాకరి చేస్తేనే కలుగుతుంది. బొత్తిగా పేద రైతులు ఏ రూపాయో, రెండు రూపాయలో యిస్తానంటే, కరణంగారు, "లంచం పుచ్చుకొనే వ్యాపారం కాదు నాది; పో; రెమిషన్ సంగతి నాకు తెలియదు ఇన్‌స్పెక్టరుగారిని పోయి అడుగు" అంటాడు. అక్కడికెళ్ళి మనవి చేస్తే, కరణంగారిని అడగమంటారు. కరణంగారి ముడుపు పూర్తిగా చెల్లిస్తేనేగాని మాట్లాడడు.

ఈవిధంగా పేదరైతుల రక్తాన్ని పీలుస్తున్నారు అధికారులంతా. కాబట్టి, కాంగ్రెసుప్రభుత్వంవారు యిట్టి అక్రమములు జరుగకుండా, రైతులను కాపాడెదరని కోరుచున్నాను. అని శ్రీ ఏ. యం. ప్రసాదరావుగారు వ్రాయుచున్నారు.

ఢెంకానాల్ మృత్యువును ధిక్కరించింది.

కామ్రేడ్ పి. సి. జోషి.

ఢెంకనాల్, ఒరిస్సాలో ఒకచిన్న సంస్థానం. నిరంకుశత్వాన్ని ఎదుర్కొనడంలో అచ్చటి ప్రజలు చూపిన ధైర్యసాహసాలవల్లనే నేటి పత్రికలలో ప్రాముఖ్యమైన స్థానం ఆక్రమించగలిగింది. ఢెంకనాలలోని ప్రజాపుద్యమం మన ఉద్యమం. మన ఉద్యమంలో ఒకభాగం. మనం ఏకోరికలకోసం ప్రజాపోరాటం సాగిస్తున్నామో వాటికొరకే సోదరులు కూడ పోరాడుతున్నారు. మనపోరాటం, వారిలో రగుల్గొల్పిన ఉత్సాహమే వారిని కార్యాచరణకు దింపింది.

ఎసెంబ్లీ ఎన్నికలవరకు ఒరిస్సా రాష్ట్రం రాజకీయంగా వెనకబడే వుందని చెప్పాలి. ప్రజలలో ఎన్నిక ప్రచారం విరివిగా సాగింది. కాంగ్రెసు పిలుపు వారిని కదిలించింది. పెద్దపెద్ద బహిరంగసభలు జరిగేవి. ఢెంకనాల్ ప్రజలు కూడ వానిలో పాల్గొనేవారు. కాంగ్రెసు మంత్రి పదవులు స్వీకరించిన తరువాతకూడ ఢెంకనాల్లో నిరంకుశ విధానం మరింత ఎక్కువైంది. అక్రమ శిస్తు వసూళ్ళు నాపడానికి జమీందారీ ప్రాంతాలలో బయలుదేరి విజయం పొందిన రైతు ఉద్యమం ఢెంకనాల్ సంస్థాన ప్రజలకు పాఠం నేర్పింది.

ప్రజల కష్టాలు

ఢెంకనాల్ ప్రజలు 17 వ శతాబ్దపు దైన్య జీవితాన్ని గడుపుతున్నారు. భరించరాని క్రౌర్యాన్ని అనుభవిస్తున్నారు. ప్రతివానికీ సంవత్సరంలో 3 మొదలు 4 నెలలవరకు వెట్టి చాకిరి తప్పదు. రాజుగారి దివ్యభవనం ఈ వెట్టి చాకిరీవల్లనే నిర్మింపబడింది. ఆ సంస్థానంలో పి. డబ్లియు. డిపార్టుమెంటు లేదు. అందుచేత రోడ్లు నిర్మించడం కూడా ఈ వెట్టిచాకిరీ డిపార్టుమెంటువారే చేయాలి. ధాన్యం ఎగుమతి, తమలపాకుల దిగుమతి వ్యాపారాలన్నీ రాజాగారి ద్వారానే జరగాలి. ఊరికి దగ్గరగావున్న అడవిని గ్రామస్తులుపయోగించుకోకూడదు. రాజుగారి అంతులేని కోరికలు తీర్చుకోడానికి ఒక వింత విధానం అవలంబించారు. ఇష్టం వచ్చిన వారిమీదల్లా తప్పుడువో ఒప్పుడువో కేసులు పెట్టడం, వాటిని సామాన్య కోర్టులలో కాక వేరే ఏర్పాటుచేసిన 'నిశరాత్రి కోర్టుల'లో విచారించి పది మొదలు వెయ్యి రూపాయల వరకు జరిమానా విధించడం ఇదీ పద్ధతి. ఈ 'నిశరాత్రి కోర్టుల' డిపార్టుమెంటుకు అధికార్లు రాజుగారి పేష్కారు. గ్రామాలలో చౌకీదారు బహిరంగ కోర్టులో నిర్దోషియని వదలివేయబడిన వారిని కూడ ఈ 'నిశరాత్రి కోర్టు' తిరిగి విచారిస్తుంది. అట్టిదే ఒక కేసుకు సంబంధించిన రికార్డు యావత్తూ తనకు పంపవలసిందిగా ఒకనాడు ఈ పేష్కారు దివానుకు అజ్ఞాపించాడు. గడగడలాడుతూ దివాన్ ఆ రికార్డంతా అప్పగించి సలాంచేశాడు. ఢెంకనాల్లో రాజావల్లగాన్ని, ఆయన మనుష్యులవల్లగాన్ని, మానవత్వానికి జరగని అపచారం లేదు.

ప్రజామండలి

1938 జూన్ 27 వ తేదీని ఒరిస్సాసంస్థాన ప్రజాసంఘం విచారణ కమిటీ ముందు సాక్ష్యం ఇవ్వడానికి వచ్చిన 300 మందితో ఢెంకనాల్ ప్రజామండలి స్థాపించబడింది. ప్రజామండలి ఏర్పరిచేముందు, సారంగధరదాసు వారితో బాగా ఆలోచించమనీ, ప్రజామండలి స్థాపించడమంటే మాటలుకాదనీ, రాజాకు వ్యతిరేక సంఘం నెలకొల్పడమేననీ, ఆస్తులుపోవడం, శిక్ష అనుభవించడం మొదలైనవన్నీ ఎదుర్కోవలసివస్తుందనీ హెచ్చరించాడు. వారిలో ఒక్కడు కూడ భయపడలేదు. అంతా ప్రజామండలి కావాలంటే కావాలన్నారు. ఈ ప్రజామండలి వారిలో విప్లవ బీజాలను నాటింది. జూలై 3 వ తేదీనే ఉద్యమం ప్రారంభమైంది. ఆనాడు ఒకచోట బహిరంగ సభ జరుగుతుందని ప్రకటించారు. కాని అక్కడ సభ జరపలేదు. రహస్యంగా ఒక అడవిలో జరిపారు. సభకు హాజరైన వారంతా, ప్రాణం పోయేవరకు ప్రజామండలియెడల విశ్వాసంతోవుంటామని ప్రమాణాలు చేశారు. మరునాటినుంచే తమలపాకుల బహిష్కరణ సాగించడానికి తీర్మానించారు.

బహిష్కరణ ప్రారంభమైంది. సంస్థానోద్యోగులకు వారు చెప్పిన సమాధానం బహుస్వల్పం. "మాకు డబ్బులేదు. తమలపాకులు వేసుకోడం మానేయవలసివచ్చింది" అని. ఈ ఉద్యమం చల్లగా సంస్థానమంతటా పాకింది. 2 వారాలలో సంస్థానంలో ఎక్కడా తమలపాకులు నమలడమనేది లేకుండాపోయింది. ఈ విజయం ప్రజలలో నూతనోత్సాహాన్ని రేకెత్తించింది. ప్రతి గ్రామంలోను బ్రహ్మాండమైన సభలు జరిపారు. తమకున్న కష్టాలన్నీ చర్చించారు. కావలసిన హక్కులన్నీ నిరూపించారు. వారిలో ఎక్కడలేని ఐక్యతాభావం తాండవించింది. రాజాగారి మనుష్యులీ ఐక్యతను భగ్నం గావించడానికి ప్రయత్నించారు. మతోద్రేకాలు కులకక్షలు ఎక్కించాలని చూశారు. కాని విఫలులయ్యారు. వ్యతిరేకమైన సభలుకూడా ఏర్పాటుచేశారు. కాని జనం ఎవరూ వచ్చేవారు కాదు. ఆగస్టు 10 వ తేదీని ప్రజామండలి అధ్యక్షుడు హరమోహన పాట్నాయక్ కు 144 వ సెక్షను జారీచేయబడింది. ఉద్యమాన్ని అణచివేయడం ప్రారంభించారు. ఈ చర్య ప్రజలలో మరింత ఉద్రేకాన్ని కలుగజేసింది. 11 - 13 తేదీలమధ్య ప్రజామండలి తయారుచేసిన కనీసపు కోర్కెల పత్రాలు 10,000 సంస్థానమంతటా పంచిపెట్టబడ్డాయి. లెక్కలేనన్ని సభలు జరుపబడ్డాయి. సంస్థానాధీశునికి ఏమి చెయ్యాలో తోచలేదు. సంస్థానంలో వ్యాపించుతూన్న ఉద్యమాన్ని నాశనం గావించడమా లేక రాజు ప్రజలకు లొంగిపోవడమా అనేది సమస్య.

కుయుక్తి.

ఈసమయంలో రాజా ఒక కుయుక్తి పన్నాడు. ప్రజలకు కొన్ని హక్కులిచ్చినట్లు కనబడి ఉద్యమాన్ని అణచి వేయాలనుకున్నాడు. అడవికి సంబంధించిన కష్టాలు విచారించడానికని ఒక కమిటీని నియమించాడు. కాని ప్రజామండలికీ ఎత్తులు తెలుసు. ఈ కమిటీని పూర్తిగా బహిష్కరించారు. వారికి కావలసిన ఇతర హక్కుల మాట తలబెట్టకుండా ఈ ఒక్క విషయంలో విచారణ చేస్తామనడం పనికిరాదన్నారు. ఇది [illegible] మాన్ని పెడమార్గాల పట్టించడానికి చేసిన [illegible] గాని వేరు కాదు [illegible]

ఇంతలో ఢెంకనాల్ గెజెట్ 'అసాధారణ ప్రచురణ' ఒకటి బైటికి వచ్చింది. అదివరకెన్నడూ ఈ గెజెట్ అసాధారణ ప్రచురణలుండేవికాదు. ఇప్పుడు హఠాత్తుగా ఒకదాని వెనుక ఒకటి చొప్పున "అసాధారణ గెజెట్"లు రావడం మొదలు పెట్టాయి. ప్రజలకు ఈ హక్కులిచ్చాం ఆ హక్కులిచ్చాం అంటూ పూరికే వాగ్దానాలు ప్రకటించారు. కాని ఒక్కటి కూడా అమలు జరిగేది కాదు. ఈ అసాధారణ గెజెట్లు ఎంత త్వరత్వరగా వచ్చేవో అంతకంటె త్వరగా సిపాయీలను చేర్చుకోడం సాగించారు. ఇదివరకు ఉద్యోగాలు మానివేసిన వారినందరినీ మరల సైన్యంలో చేర్చుకున్నారు. సిక్కులను, గూర్ఖాలను విరివిగా చేర్చుకోడం మొదలు పెట్టారు. ప్రక్కనున్న సంస్థానాలకు సాయుధ పోలీసులను సహాయంగా పంపమంటూ ఉత్తరాలు పంపారు.

ఆగస్టు 15 వ తేదీని రాజాగారు, చుట్టూ సాయుధపోలీసులను కాపలా పెట్టుకొని ఒక మీటింగులో ఉపన్యాసం దంచాడు. తలవని తలంపుగా, సుబాహుసింగ్, పూర్ణచంద్ర మహాపాత్ర అను ఇరువురు నాయకులను తనతో ప్రజల కష్టాలను గురించి చర్చించడానికి రాజభవనానికి రమ్మని ఆహ్వానించాడు. మహాపాత్ర వెళ్లాడు. కోటలోంచి బైటికిరాగానే ప్రజలతనిని గెలిచేశారు. మహాపాత్ర అవడానికి చాలకాలంనుంచి నాయకుడుగానే వున్నాడు. కాని ప్రజామండలితో సంప్రదించకుండ వారి అనుమతి లేకుండ స్వతంత్రించి రాజుతో రాయబారాలు జరిపినందుకు ప్రజలతనిని క్షమాపణ ఇమ్మన్నారు. విధిలేక క్షమాపణ చెప్పుకున్నాడు. అతని జన్మలో ప్రజాభిప్రాయాన్ననుసరించి ప్రవర్తించాలని అప్పుడే నేర్చుకున్నాడు. తరువాత ప్రజామండలి అతనినే మొట్టమొదటి డిక్టేటరుగా నియమించింది.

ఆగస్టు 18 వ తేదీని సుబాహుసింగ్ 50 వేల ప్రజలతో రాజావద్దకు వెళ్ళాడు. సంస్థానంలోని జనులందరు ప్రతి ఆరుగురికి ఒకరు చొప్పున ఎన్నుకొని పంపారు ఆ 50 వేల మందిని. చేసేదిలేక రాజా పైకివచ్చి ఒక ఉపన్యాసం చదివాడు. అందులో ప్రజలకు కావలసినదేమీలేదు. "మేం అన్నం అడిగితే మాకు సున్నం యిచ్చారు" అన్నారు ప్రజలు.

పోరాటం తప్పనిసరి అయింది. రాజా వారికేమీ ఇవ్వడని తేలిపోయింది. వారి సంగతి వారే చూసుకోవాలని స్పష్టపడింది.

ప్రజా ఉద్యమం

ప్రజామండలి కోరిన హక్కులను రాజు నిరాకరించిన తరువాత ప్రజలకు సత్యాగ్రహం సాగించడం ఒక్కటే మిగిలింది. కోటవదలి తిరిగివస్తూ సుబాహుసింగ్ 10 తాలూకాలు తిరిగి ప్రతి గ్రామంలోను సభలు జరిపి ప్రజామండలి హక్కులను ఎక్కువగా ప్రచారం గావించాడు. సంస్థానమంతటా అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లినట్లయింది. సెప్టెంబరు 1 వ తేదీని ప్రతి గ్రామంనుంచి పది పన్నెండువేల మంది ప్రక్కనేవున్న బ్రిటిష్ సరిహద్దులోని [illegible]లో కిసాన్ దినోత్సవానికి సాగిపోయారు. అప్పుడు ఒరిస్సాలో వరదలు ఎక్కువగా వున్నాయి. కాని ఆ జల ప్రవాహం ఈ జన ప్రవాహానికి అడ్డు తగులలేకపోయింది. కిసాన్ దినోత్సవం ఢెంకనాల్ ప్రజల ఐక్యతా ఆదర్శ దినోత్సవంగా మారిపోయింది.

సెప్టెంబరు 2 వ తేదీన ఢెంకనాల్ ప్రజామండలి కాన్ఫరెన్సు ఏర్పాటు చేశారు. ప్రజలంతా, "మేము ప్రజామండలిని వదలిపోము. అట్లు పోయిన వారికి కుష్టురోగం వస్తుంది" అని ఘోర ప్రమాణాలు చేశారు. అంటరానివారు మొదలు అగ్రజాతులవరకు, ఒక్క కుటుంబములోనివారివలె మెలగ జొచ్చారు. కేవలం ఆర్థిక హక్కులు కొన్ని వచ్చినంతమాత్రాన తమ పోరాటం పూర్తికాదని, సంపూర్ణబాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడేవరకు వారికి విశ్రాంతియుండదని సభలో చాలమంది ఉపన్యాసకులు ఉద్బోధించారు. ప్రజలు సంతోషంతో చప్పట్లుకొట్టి హర్షధ్వనులు చేశారు.

సెప్టెంబరు 10 వ తేదీనాటికి ఢెంకనాల్ ప్రభువు మెల్లగా ప్రక్క సంస్థానాధీశులను దేవులాడి 200 పోలీసులను సంపాదించగలిగాడు. 10 వ తేదీనే మీటింగులు, ఊరేగింపులు జరపకూడదంటూ శాసించాడు. 11 వ తేదీని ప్రజామండలి అధ్యక్ష ఉపాధ్యక్షులను, మరి 15 గురను అరెస్టు చేశారు. కారణం దివాణంలో పనిచేసే నౌకరులు పనిమానివేస్తున్నారట, ఒక పెద్ద సమూహం తమనాయకులకు దండవేసి ఊరేగించుతూ జైలుగేటువరకూ సాగనంపింది.

లాఠీ ఛార్జి: కాల్పులు

తిరిగివస్తూన్న ప్రజలపై పోలీసులు లాఠీ చార్జీ చేశారు, తుపాకీ మడమలతో మోదారు, బాయొనెట్లతో పొడిచారు, మీదనుండి మోటారు కారులను పోనిచ్చారు. ప్రజలు చలించలేదు, రోడ్డుకు అడ్డంగా కూర్చున్నారు. రాత్రంతా ప్రజామండలి ఆఫీసును జాతీయ పతాకాన్ని కాపాడుతూ ఉన్నారు. ఈవార్త పిడుగువలె వ్యాపించింది. ఎక్కడలేని జనం పట్టణానికి చేరారు. వారిపై పోలీసులు మరల లాఠీలుపయోగించారు గుర్రాలచేత, ఏనుగులచేత త్రొక్కించారు. రెండుసార్లు తుపాకులు కాల్చారు. కాని ప్రజలు పారిపోలేదు. సాయంకాలం 3 గంటలకు రైలుస్టేషనువద్ద 20 వేలమందితో ఒక బ్రహ్మాండమైన సభజరిగింది. దర్బారు తన బలగాన్నంతనీ వినియోగించింది. ఆసభను చెదరగొట్టడానికి. కాని లాభం లేకపోయింది. మరల లాఠీలు, తుపాకిగుండ్లు వర్షం కురిపించారు. మొత్తం 155 మంది గాయపడ్డారు. ఒకరిద్దరు అక్కడే చనిపోయారు. ఇదే ఢెంకనాల్ ప్రజలను ముంచెత్తిన మొట్టమొదటి రక్తప్రవాహం. ఇందులోనుంచే నూతనోత్సాహంతో మరింత పట్టుదలతో పోరాడాలనే భావం బయలుదేరింది. ఇదే ఢెంకనాల్ ప్రజలు తమ నిరంకుశ ప్రభువులనుండి పొందిన మొదటి విజయం.

మరునాడు సాయంకాలానికి ప్రజల రక్తం చిందిన ఆమైదానంలో 50 వేలమంది తయారయ్యారు. వారుకోటను ముట్టడిస్తామని చూస్తున్నారు. రాజుకుకూడ హడలెత్తింది. వచ్చి కలుగజేసుకోవలసిందిగా శ్రీ కృష్ణమెహతాబ్‌కు టెలిగ్రాముల మీద టెలిగ్రాములు పంపాడు

కోటను ముట్టడించే ప్రయత్నంనుండి వారిని మాన్పేసరికి అక్కడి ప్రజా నాయకుల తలప్రాణం తోకకు వచ్చింది. ఎట్లాగో నచ్చజెప్పి గ్రామాలకు పంపివేశారు. "మీమీ గ్రామాలకు పొండి. ఒక్కొక్క గ్రామాన్ని ఒక్కొక్క కోటగాయండి. ప్రజామండలియే మీ ప్రభుత్వం" అని నినాదాలిచ్చి వారిని ఇండ్లకు పంపారు.

గ్రామాలకు మరలిన ప్రజలు తమ నాయకు లిచ్చిన ఈ నినాదాలను అక్షరాల అమలు జరిపారు. గ్రామాలలోని చౌకీదారు మొదలైన చిన్న ఉద్యోగస్థులందరూ ప్రజామండలిలో చేరారు. ఫారెస్టు, రెవిన్యూ ఆఫీసర్లు సంస్థానం వదలి బ్రిటిష్ ఒరిస్సాలోనికి పారిపోయారు. కోర్టులన్నీ మూసివేయ బడినాయి. సంస్థానోద్యోగులంతా ఏమియు చేయలేని రాతిబొమ్మలుగా మారిపోయారు. ప్రజామండలి ప్రధాన కార్యస్థానము నుండి వెలువడు బులిటెన్ ఎక్కువ కాపీలు వేయవలసి వచ్చింది. ప్రతి గ్రామానికి పంపబడేది. చివరకు వారాని కొకసారి ప్రచురింపబడేది ప్రతిరోజూ ప్రకటింపబడవలసి వచ్చింది.—అంతేకాదు, ఏగ్రామానికైనా కొత్తవారువస్తే వారివెనకాలే ఒక వాలంటీరు తయారౌతాడు. అట్లా చేయడానికి రెండు కారణాలున్నాయి. అతనికేమి అపాయము రాకుండా చూడడం ఒకటి. అంతకంటె వారికి ముఖ్యమైనది, ఈవచ్చినవారు రాజుగారి మనుష్యుల వలలో పడకుండా చూడడం. ఈవిధముగా రెండు వారాలు దెంకనాల్ ప్రజలు స్వపరిపాలన చేసుకుంటూ స్వాతంత్ర్యవాయువులు పీల్చారు. నూతన జీవితాన్ని గడిపారు.

బ్రిటిషు వారి సాయం

సెప్టెంబరు 15 వ తేదీని ఒరిస్సా సంస్థానాల పొలిటికల్ ఏజెంటు దెంకనాల్‌కువచ్చాడు. 18 వ తేదీని, ప్రజలలో హింసను రెచ్చగొట్టుతున్నారనే వంకతో ప్రజామండలిని నాశనం గావించి శాంతి నెలగొల్పాలంటూ సంస్థానాధీశుడు విజృంభించాడు. 19 వ తేదీకి కలకత్తా నుండి బ్రిటిష్ ప్రభుత్వపు స్కాటిష్ సిపాయీలు దిగారు. మరల క్రౌర్యం రచ్చకెక్కింది ప్రజామండలి ఉద్యోగుల నందరిని అరెస్టు చేశారు. అభిమానులు కొంపలలో చొరబడ్డారు. 20 వ తేదీని పారగంజ్ గ్రామానికి చుట్టూ బ్రిటిషు సిపాయీలు కాపలాకాశారు. గ్రామంలోనికి రౌడీలను, దుర్మార్గులను సంస్థాన పోలీసులను తోలారు. సుబాహుసింగ్ ఇల్లు నేలమట్టం చేశారు. ఆగ్రామంలోని యువకుల నందరిని వీధులో బోర్లపడుకోబెట్టి వారికి స్పృహ తప్పిపోయేవరకు బూటుకాళ్ళతో పోలీసులు వారిపై ఎక్కి ఊగడం గంతులు వేయడం తన్నడం మొదలైనవన్నీ చేశారు, వారి దుండగాలంతటితో ఆగలేదు. లూటీచేయడం, స్త్రీలను చెరచడం మొదలైన అఘాయిత్యాలు చేశారు. ఇవన్నీ జరుగుతోంటే దెంకనాల్ చెల్చారు సంస్థాన ప్రభువులుచూచి ఆనందించారు. ఇటువంటి చర్యలే ప్రతి గ్రామంలోను సాగించారు, ఇవన్నీ చూస్తుంటే ప్రజలకు తమ స్త్రీలమానం కాపాడుకోడమే సమస్య అయిపోయింది. సంస్థానం విడిచిపెట్టి పోవడం ఒక్కటే గత్యంతరంగా కనబడింది. ఒక లక్షమంది (క్రైస్తవ జనాభా) సంస్థానం విడిచి వెళ్ళిపోయారు.

సత్యాగ్రహము

సెప్టెంబరు 24 వ తేదీని భువాన్ అనే ధనవంతమైన గ్రామం లూటీ చేయబడింది. ఈ దారుణాలను ఎదుర్కొడానికి తిరిగి సత్యాగ్రహం సాగించాలని అందుకు ఈలేచిపోయిన వారు తిరిగి సంస్థానంలోకి వచ్చి పోరాటం సాగించాలనీ పారగంజ్ గ్రామస్థులు కోరారు. అందుపైన అక్టోబరు 2 వ తేదీని సంస్థానం విడిచిపోయిన వారి నందరినీ తిరిగి రమ్మంటూ ప్రజామండలి ఆజ్ఞాపించింది. సంస్థానం విడిచి ఇతరచోట్ల వారు నివసించింది కొద్దికాలమే అయినా దానివల్ల మంచి ఫలితమే గల్గింది, సంస్థానేతర విద్యార్థులు, కాంగ్రెసు వారికిని ఈ సంస్థాన ప్రజలతో సంబంధం ఏర్పడింది. వీరి ఉద్యమం యెడల సానుభూతి ఎక్కువైంది.

అక్టోబరు 2 వ తేదీని సత్యాగ్రహం ప్రారంభమైంది. మొట్టమొదట కాలోగ్రామంలో ప్రభుత్వశాసనాన్ని ధిక్కరిస్తూ బహిరంగసభ నేర్పాటుచేశారు. దానికి 100 మందిని ఏరి పంపారు. పోలీసులు వచ్చి లాఠీచార్జిచేసి గ్రామములో కొన్ని ఇండ్లలో ప్రవేశించి స్త్రీలను అల్లరిచేసి చక్కాపోయారు. దానితో ఈ విధమైన సత్యాగ్రహం లాభంలేదని ప్రజలు గ్రహించారు. పదేసిమంది వాలంటీర్లను దెంకనాల్ పట్టణానికి ఒక్కొక్క దళంగా పంపేవారు. వారిని పోలీసులు చితుకగొట్టి వదలివేసేవారు. ఈవిధంగా 20 రోజులు సాగింది. చివరకు పట్టణంలో అడుగు పెట్టడానికే వీలు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ప్లానుకూడా సరియైనదికాదని వాలంటీర్లు గ్రహించారు. పద్ధతి మార్చారు. జండా పుచ్చుకుని గ్రామగ్రామాన మీటింగులు పెట్టుకుంటూ ప్రజలలో ప్రబోధం గావిస్తూ సంచారం చేయడం ప్రారంభించారు.

అమానుష హింసలు

ఇవన్నీ సంస్థానాధీశుడు సహించలేకపోయాడు. దానికి సాయం పొలిటికల్ ఏజంటు కూడా బాగా పురిమెక్కించాడు. అక్టోబరు 10వ తేదీ అర్ధరాత్రివేళ భువన్ గ్రామంమీదికి 40 మంది సాయుధ పోలీసులు దండెత్తారు. నిద్దుర పోతూన్న గ్రామస్థులను అన్యాయంగా పట్టుకు చావగొట్టి 8 మందిని అరెస్టుచేసారు. మిగిలిన వారందరు వారిని విడుదలచేయమనిప్రార్థించారు. వారిమీద హఠాత్తుగా పోలీసులు తుపాకులు కాల్చారు. ఆ కారుచీకటి. ఎటు పారిపోయి ప్రాణం రక్షించుకోవాలో ప్రజలకు తోచలేదు. పైగా వర్షం కురుస్తోంది. పారిపోతున్న ప్రజల మీద టార్చిలైట్లు ఫోకస్ చేసిమరీ వేటాడారు. ఆ చీకటిలో చచ్చినవారెవరో అంతులేకుండా పోయింది.

అరెస్టుచేసినవారిని తీసుకొని పోతూ కాలువను దాటించవలసినదిగా పడవలవారిమీద అధికారం చెలాయించారు. వారు అర్ధరాత్రివేళ దాటించలేమన్నారు. పడవలు దాటించమంటే వీరిని కాల్చారు. పోలీసుల కళ్ళఎదుటనే 4 గురు మరణించారు. ఇంకొక ఇద్దరుఆసుపత్రిలో మరణించారు.

అక్టోబరు 17 వ తేదీని హిందోకరోడ్ అనే పూరును పోలీసులు, రౌడీలు ముట్టడించారు. రాజుగారి యెడల భక్తిగలిగివుంటామని ప్రమాణ పత్రాలమీద సంతకాలు చేయమని గ్రామస్థులను ఆజ్ఞాపించారు. వారు నిరాకరించారు. వారిని చావమోది ఆస్తులు లూటీచేశారు. వారిలో కొందరు భయపడి సరిహద్దు దాటిపారిపోయారు. ఈ పోలీసులు గోడిడిహి అనే గ్రామంమీదపడి వారిని "రాజాకి-జై" అని మన్నారు. ప్రజలు "మేమనం. రాజు మా వాడైతే మమ్ముల నిట్లా హింసించడు" అని జవాబుచెప్పారు. దానికి ప్రతిఫలం లాఠీదెబ్బలు: పారిపోతూన్నవారికి తుపాకి గుండ్లు. 10-12 సంవత్సరాలి బాలురుకూడ కాల్చబడ్డారు.

అక్టోబరు 21 వ తేదీని సూపరింటెండెంటు ఒక పోలీసు దళంతోవచ్చి తుమునింఘ గ్రామస్థులను రాజభక్తి టిక్కెట్లమీద సంతకాలు పెట్టమని నిర్బంధించాడు. లేకపోతే తుపాకులతో కాల్చి చంపుతామని బెదిరించాడు. ప్రజలు "కాల్చి చంపినా సరే" నన్నారు. తుపాకులు పేలాయి. ముగ్గురు చనిపోయారు. 12 గురు గాయపడి ఆసుపత్రికి చేర్చబడ్డారు. వారిలో కూడ ఒకడు మరణించాడు.

నవంబరు 2 వ తేదీని కాతుమంద అనే చిన్న హరిజనపల్లెలో 100 మంది పోలీసులు ప్రవేశించి. పూర్ణచంద్ర మహాపత్ర ఎక్కడ దాగున్నాడో చెప్పవలసిందంటూ బాధించసాగారు. ఆ హరిజనులు మాకు ఆయనెవరో తెలియదు మొర్రో అని గోలపెట్టారు. కాని హింసించడం మానలేదు, బాధ పడలేక పారిపోతూన్న వారిపైనకూడ తుపాకులుకాల్చారు. ఇద్దరు మరణించారు. ఇంకో ఇద్దరు గాయపడ్డారు.

రాజుగారి జన్మదినం

అక్టోబరు 31 దెంకనాల్ ప్రభువుగారి జన్మదినం. ఆసందర్భంలోచేసే దర్బారుకు ఎవరూ వెళ్ళలేదు. సంస్థానాధికారులు పోలీసు సహాయంతో, విశ్వప్రయత్నంచేసి పట్టణం నుంచి, కొంతమందిని సంపాదించి తెచ్చి దర్బారు జరిపారు. దర్బారుకు వచ్చిన ఈకొద్దిమంది కూడా రాజుగారి జన్మదిన సందర్భంలో ఖైదీల నందరిని విడుదలచేస్తే బాగుంటుందని సలహాయిచ్చారు. రాజుగారికి పట్టలేనంతకోపం చక్కావచ్చింది. సంస్థానంలో జరిగిన కల్లోలుకు, దురంతాలకు వారే కారకులు ఆట్టివారి విడుదల చేయకూడదని గర్జించాడు. దానికితోడు 15 రోజులలో ఈ ఉద్యమం విరమించుకొనకపోతే ఇప్పుడున్న స్వాతంత్ర్యం కూడా వుండనివ్వనన్నాడు. ఇదీ, తన జన్మదినోత్సవంనాడు సంస్థానాధీశుడు చేసిన ప్రతిజ్ఞ. ఇటువంటప్పుడు మమ్ముల నిక్కడికి ఎందులకు తీసుకువచ్చారని వారంతా లేచిపోయారు.

తరువాత రాజుగారు ఏమనుకున్నారో గాని 10 మంది రాజకీయ ఖైదీలను విడిచిపెట్టారు, విడిచిపెట్టేముందు వారిని "పౌరసత్వ హక్కులంటే ఇవే" అని పేక బెత్తాలతోకొట్టి మరీ పంపారు.

నాయకుల నిరుత్సాహం.

గ్రామాలలో మిలిటరీని తిప్పడం సంస్థానానికి బ్రిటిషు సామ్రాజ్యపు సహాయం వుందని ప్రజలను బెదరించడం, గ్రామాలలోని ఉపాధ్యాయులచేత, ప్రజామండలి పేరుతో రాజుగారికి చేసిన పాపానికి పరిహారం, తిరిగి రాజభక్తిప్రమాణం చేయడమేనని ధర్మబోధలు చేయించడం మొదలైనవన్నీ సాగించారు. రాజుగారు కూడా సిపాయీలను వెంటబెట్టుకొని గ్రామాలలో సంచారంచేయడం క్షమాపణ చెప్పుకోమని హెచ్చరించడం మొదలు పెట్టాడు. దీనికి సాయం నాయకులలోకూడ నిరుత్సాహం వ్యాపించడం ప్రారంభించింది. అప్పటికి కేవ[illegible] కాల్పులవల్ల 17 గురు మరణించారు, [illegible] దెబ్బ[illegible] గాయాలు తగిలాయి. ఇతర చోట్ల [illegible]00 మంది[illegible]లకు గురియైనవారు లెక్కలేదు. [illegible]రు, ఇవిగాక పైగా జైలులో బంధింపబడి[illegible]డి, కట్టుగుడ్డ[illegible] ఆడవులలోకి తీసుకొని [illegible] పొలిసించి దిగంబరు[illegible]గా వదలివేయబడినవారు చాలమంది వున్నారు. ఈ పరిస్థితులలో సత్యాగ్రహం ఆపకుండ సాగించడానికి నాయకులు భయపడిపోయారు. సంఘటనలు నాయకుల కంటె ముందు నడిచాయి. వాటితో సమానంగా నాయకులు ముందంజ వేయలేకపోయారు. వీరి కాలం శక్తి అంతా, గాయపడిన వారిని శుశ్రూష చేయడంతోనే సరిపోయింది. ప్రజామండలి బులిటెన్ కూడ ప్రచురించలేకపోయారు. నాయకత్వం నిర్వీర్యం అయిపోయింది.

ఇదే సమయం

ఇదివరకు సాగించిన కుయుక్తినే మరల సాగించడాని కిదేసమయమని రాజా ఆశపడ్డాడు పేష్కారును తీసివేశాడు. "నిశరాత్రి కోర్టులు" లేవు. వెట్టిచాకిరీ పోయింది. భూమిపన్నులో ఇదివరకు పెంచిన రూపాయికి 4 అణాల హెచ్చును 2 అణాలకు తగ్గించాడు. 1939 ఏప్రిల్‌నెలలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరుస్తామని మళ్ళి "అసాధారణ గెజెట్"లో ప్రకటించారు.

ప్రజలకీ నాటకం తెలియకపోలేదు. రాజుగారి హృదయం ఒక్కసారిగా మారిపోయిందని వారు నమ్మలేదు. ఇవన్నీ తమలో చీలికలు కల్పించి ఉద్యమాన్ని నాశనం చేయడానికే చేస్తున్నాడని వారు గ్రహించారు. రాజుగారికి నిజంగా ప్రజలయెడల దయగలిగితే ప్రజామండలిపై నిషేధం ఎందుకు తొలగించడు? ఇదీ వారి ప్రశ్న!

యువకుల ఉత్సాహం

నాయకులలో బయలుదేరిన నిరుత్సాహం ప్రజలలోకూడ వ్యాపించడానికి యువకులు ఇష్టపడలేదు. అమానుషహింసలు జరిగినప్పుడు క్రౌర్యం తాండవించి నప్పుడు కూడ ప్రజలు వెనుకంజ వేయలేదు. ధైర్యంతో పోరాడారు. స్వాతంత్ర్యేచ్ఛగల జన సామాన్యంలో నిరుత్సాహానికీ అధైర్యానికి తావులేదని వారు గ్రహించారు. ప్రజలలోని పోరాట పటిమను తగ్గించడం వారికిష్టంలేదు. రైతుబిడ్డలంతా, తమంతట తామే. ఒక వాలంటీరు దళంగా ఏర్పడ్డారు. ప్రాణాల నర్పించడానికి కూడా వెనుదీయమని దీక్ష వహించారు. 20, 30, మైళ్ళదూరం కూడ నడిచిపోయి గాయపడిన వారికి ఉపచర్యలు చేయడం మొదలు పెట్టారు. ఆసుపత్రులకు తీసుకొనిపోయి చికిత్స చేయించే వారు. ప్రతిమూల నుంచీ వార్తలు ప్రోగుచేసుకొని వచ్చి ప్రజామండలి తరఫున వెలువడే బులిటెన్ను ప్రచురించడానికి నాయకులకు ఇచ్చేవారు. ఈ బులిటెన్లను ఇరుగు పొరుగు గ్రామాలకు పాలు పెరుగు అమ్ముకోడానికి పోయే గొల్ల స్త్రీలద్వారా పంచిపెట్టించేవారు. వారిని పట్టుకోడానికి పోలీసులువస్తే గ్రామస్థులు వారిని దాచివేసి దొరక కుండా కాపాడేవారు. ఈ విధంగా ప్రజలలో నిరుత్సాహం రాకుండాచేసి వారి ఆదరాభిమానాలను చూరగొన్నారు యువకులు.

కాంగ్రెసు జోక్యం

యదార్థానికి దెంకనాల్ మార్షల్లా క్రింద వుంది. అక్కడ మిలిటరీయే రాజ్యం ఏలుతోంది. భయపెట్టి ప్రజలలో నిరుత్సాహాన్ని వ్యాపింపజేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ సమయంలో ప్రజామండలి సమసిపోలేదని ప్రజలంతా దానివెనుకనే వున్నారనీ, ప్రదర్శించవలసిన అవసరం ఎక్కువైంది.

(మిగతా 22 వ పేజీలో)

రాష్ట్రమంతటా జయప్రదంగా జరిగిన రైతు రక్షణ వారం

19-1-39 వ తేదీని మధ్యాహ్నం 1 గంటకు తూర్పు గోదావరిజిల్లా, తుని తాలూకాకు చెందిన తొండంగి ఫిర్కా రైతులు సుమారు 1000 మంది తొండంగి గ్రామంలో ఫిర్కా మహాసభకు హాజరైరి. శ్రీ పెదిరెడ్ల చల్లారావుగారు అధ్యక్షత వహించిరి. డాక్టరు నాగాభట్ల మార్కండేయ శర్మగారు జాతీయపతాకోత్సవముజరిపిరి, కామ్రేడ్ యినుగంటి నారాయణరావుగారు సభకు ప్రారంభోత్సవం జరుపుచూ, ప్రకాశం కమిటీ నివేదికయందలి ప్రధానాంశములను గురించి ఉపన్యసించిరి. రిపోర్టును బలపరచుచూ, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘమువారి సూచనలను అంగీకరించి శాసనములో చేర్చవలసినదిగా మదరాసు ప్రభుత్వమును కోరుచూ ఏకగ్రీవంగా తీర్మానించబడెను. తాలూకాలో సగటున 8 వ వంతు పంట ఆయినను పంటనందున పూర్తి రెమిషన్ యిప్పించవలెననీ; తుపాను. నష్టనివారణకు తాలూకాలో ప్రభుత్వం ఎట్టిసహాయము చేయకుండుట విచారించవలసిన విషయం అనీ; రైతుల ఋణనివారణకై ప్రభుత్వం సుమారు 75 వేల రూపాయలు స్వల్ప వడ్డీ మీద అప్పులివ్వవలసినదనీ మొదలైన స్థానిక యిబ్బందులకు సంబంధించిన తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదించబడెను.

* * *

అగ్రహారం రైతులు

గుంటూరు జిల్లా, నరసారావుపేటలో జిల్లా రైతు సంఘమువారి యాజమాన్యమున ప్రకాశం కమిటీ నివేదికను, ఆంధ్రరాష్ట్రి రైతు సంఘమువారి సవరణలను బలపరచుటకు 17-1-39 వ తేదీని అగ్రహారం రైతులు. శేరీరైతులు కొప్పరపుపాలెం, లింగంగుంట్ల, పెట్టూరిపాలెం, పమిడిపాడు, ముత్తినపల్లి, ఆలవాల, పోతవరప్పాడు, మొదలైన అగ్రహారముల నుంచీ, శేరీ గ్రామములనుంచీ తండోప తండములుగా నరసారావుపేట వచ్చి యాత్రలో పాల్గొనిరి. కామ్రేడ్ శ్రీ గిరిరాజు సత్యనారాయణగారి ద్వారా ప్రకాశం కమిటీ నివేదికలో జరుగవలసిన సవరణలను గురించి డిప్యూటీ కలెక్టరుగారికి మెమొరాండం యిచ్చిరి. సాయంత్రం బహిరంగ సభలో తాలూకా రైతుల యిబ్బందులను గురించి ఉపన్యాసము లివ్వబడెను.

* * *

వినుకొండ తాలూకా

గుంటూరుజిల్లా రైతు సంఘమువారి యాజమాన్యమున జనవరి 19 వ తేదీని వినుకొండ తాలూకా రైతులు అనేకమంది శ్రీ వారణాసి వెంకట మల్లయ్య, కూచిపూడి కోటయ్యగారి ఆధ్వర్యమున, తహసీల్దారుగారి వద్దకు రైతు రక్షణ యాత్రను జయప్రదముగా జరిపిరి. ప్రతి అగ్రహారం తరఫున ప్రత్యేక మహాజర్లు యివ్వబడెను. రాబోవు ప్రకాశం కమిటీవారి కొత్త చట్టం అగ్రహారం రైతులకు కూడా వర్తింప చేయాలని మహాజర్లలో కోరబడెను. పిమ్మట తాలూకా కాంగ్రెస్ కార్యాలయంవద్ద జరిగిన బహిరంగసభలో కామ్రేడ్ చలసాని వాసుదేవరావుగారు అగ్రహారం రైతులకు [illegible] అన్యాయమును గురించి ఉపన్యసించిరి.

చదుము గ్రామం

జనవరి 16 వ తేదీని రైతుసేవకులైన శ్రీ సుబ్రహ్మణ్యంగారి నాయకత్వమున చదుము గ్రామ మండలి రైతాంగము జాతీయ, రైతు పతాకములతో, రైతు గీతాలు పాడుకొంటూ, కాలినడకను 34 మైళ్ళు మదనపల్లెకు రైతు రక్షణ యాత్రసాగించి, సబ్‌కలెక్టరుగారి యెదుట తమ యిబ్బందులను నివేదించుకొన్నారు. ప్రకాశం కమిటీ రిపోర్టుకు తమ ఆమోదాన్ని తెలియ జేశారు.

* * *

నందిగామా తాలూకా

తాలూకా రైతు సంఘము వారి యాజమాన్యమున మూడు యాత్రాదళములు బయలుదేరి పెనుగంచిప్రోలు, నందిగామ, కంచకచర్ల ఫిర్కాలలో సుమారు 35 గ్రామాలయందు ప్రకాశం కమిటీ రిపోర్టును ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి సూచనలతో వెంటనే శాసనమొనర్చవలెనని ప్రచార మొనర్చిరి. జనవరి 19 వ తారీఖున సుమారు 1000 మంది రైతులు నందిగామకువచ్చి, తహసీల్దారుగారివద్దకు రాయబారము వెళ్ళిరి. వాసిరెడ్డి శివలింగప్రసాద్, కామినేని వెంకటప్పయ్యగారు బెజవాడనుండి వచ్చిరి, యాత్రలు జయప్రదముగా కొనసాగుటకు కామ్రేడ్స్ వాసిరెడ్డి నారాయణరావు, వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, సుందరం, తిరుపతయ్య, బుచ్చిరామశేషయ్యగారలు తోడ్పడిరి, 20 తేదీని శివలింగప్రసాద్, సుందరం మొదలయినవారు పెండ్యాల, కేసర, వెల్లంకి, రాచవరం, కొణతమాత్మకూరు, చెరువుకొమ్ము పాలెం, గ్రామాలలో బహిరంగసభలు జరిపి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమువారి ఆదేశానుసారం జమీన్ రైతు వారమును జయప్రదముగా కొనసాగించిరి. రైతాంగగాయకుడు కామ్రేడ్ అట్లూరి అప్పారావు తన రైతుగేయాలతో ప్రచారకుల వెంటనుండెను.

* * *

తెనాలి తాలూకా.

19-1-39 వ తేదీని తెనాలి తాలూకా కంచర్లపాలెం గ్రామంలో శ్రీ ముక్కపల్లి వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షత క్రిందను, 20 వ తేదీని కూచిపూడిలో ముత్తేవి మాధవాచార్యగారి అధ్యక్షత క్రిందను జరిగిన బహిరంగ సభలలో ప్రకాశం కమిటీ నివేదికను, రాష్ట్ర రైతు సంఘమువారి సవరణలను, బలపరచుచు తీర్మానములు గావింపబడెను.

* * *

విశాఖపట్నం జిల్లా

పాలకొండ తాలూకాలో 15-1-39 తేదీని సుమారు 2000 మంది రైతులు రైతు యాత్ర సాగించుచు తాలూకా కచేరీవద్దకు రైతు భజనలతో ఊరేగి శ్రీ ప్రకాశం కమిటీరిపోర్టు సూచనలు, ఆంధ్రరాష్ట్రి రైతుసంఘ సూచనలతో వెంటనే చట్టము కావలసినదిగా కోరుచు ప్రకాశం కమిటీవారిని అభినందించుచు స్థానిక కష్టములను వెల్లడించుచు తహసీల్దారు వారికి మెమొరాండములు సమర్పించిరి.

ఇదేప్రకారము పార్వతీపురము, బొబ్బిలి, [illegible] సాలూరు [illegible]

జయముగా రక్షణయాత్రలు జరిగెను. సుమారు 300 గ్రామములలో అన్ని జమీలలో జమీందారీ రైతులు రిపోర్టును ఆ॥ రా॥ రైతు సంఘ సూచనలతో బలపరచుచు బహిరంగ సభలు జరిపి, తీర్మానములు గావించి మద్రాసు ప్రభుత్వమునకు పంపియుండిరి. 20-1-39 తేదీని జిల్లా నుండి ప్రభుత్వమును ల్యాండు రివిన్యూ బిల్లు ప్రవేశ పెట్టవలసినదని పంపిన టెలిగ్రాములు 500 అని యీసరికి లెక్కతేలినవి. ముఖ్యంగా "ఎస్టేట్సు ల్యాండు రివిన్యూ బిల్లు" గురించి జిల్లాలో చాలవరకు కృషిగావించిన జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి యన్. నరసింహమూర్తి, నగిరెడ్డి నారాయణనాయుడు, సర్పపల్లి సీతన్నాయుడు, పెన్మెత్స అచ్యుత రామరాజు, సింహాద్రి సూర్యనారాయణగారలు చాల ప్రశంసనీయులు.

* * *

భీమవరం తాలూకా.

భీమవరం తాలూకా కాంగ్రెసు సంఘ యాజమాన్యమున తాలూకా జమిందారీ రైతు మహాజనసభ శ్రీయుత భూపతిరాజు సోమరాజుగారి అధ్యక్షతను సమావేశమైనది. సభ ప్రారంభించుచు తణుకు ఆచార్యులుగారు, కామ్రేడ్ అప్పారావు, మైలవరపు రామారావుగార్లు జమీబిల్లునుగూర్చి ప్రస్తుత పరిస్థితులను గురించి విపులముగా మాట్లాడిరి. సభలో జమీ బిల్లును బలపరుస్తూ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి సూచనలతోసహా శాసనము చేయవలసినదిగా తీర్మానము చేసినారు.

జమీ బిల్లునుగూర్చి దాదాపు 50 గ్రామాదులనుంచి (ఆంధ్రరాష్ట్ర రైతుసంఘమువారికి పంపిన రిపోర్టుప్రకారం) తీర్మానములు, దాదాపు 20 గ్రామములనుంచి టెలిగ్రామములు, కాంగ్రెసు ప్రభుత్వమునకు పంపబడినవి.

* * *

కాశీ పట్టణం

కాశీపట్టణం జమీందారుగారు రైతులు పొలములోనికి అక్రమముగా వెళ్ళి సాగుచేయుచున్నారని పోలీసు సూపరింటెండెంటువారికి పిటీషన్ యిచ్చిన మీదట, జిల్లా సూపరింటెండెంటుగారు స్వయముగా కాశీపట్టణం వెళ్ళి పొలములు చూచి, వచ్చినట్లును, రైతులు పొలములలో ప్రవేశించనిదే తగాయిదా ఏమియు లేకుండగనే తప్పుడు పిటీషనులు జమీందారు యిచ్చినట్లును తెలియుచున్నది. సూపరింటెండెంటు ఆ రైతులతో జమీందారుకు మీకు రాజీచేస్తానని మీరు ఏమియు చేయక, శాంతముగా వుండవలసినదిగా చెప్పి తిరిగివచ్చినట్లు తెలియుచున్నది.

* * *

ఏజన్సీ రైతులు

తూర్పుగోదావరి జిల్లా, ఏజన్సీ పోలవరం తాలూకా, గంగోలు ఎస్టేటు రైతులు శ్రీ జొన్నలగడ్డ చంద్రన్నగారి అధ్యక్షత క్రింద సమావేశమై, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంవారి సవరణలతో ప్రకాశం కమిటీ నివేదిక శాసనం కావాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ముఖ్యంగా, 12 సంవత్సరముల నుంచి వరుసగా జమీందారు స్వంత [illegible]

రైతుల స్వాధీనమునకు వచ్చి జమీందారుకు 50 యకరములకంటె ఎక్కువ సొంత కమతం ఉండకుండా రివెన్యూ బిల్లులో చేర్చ వలసినదని కోరుచూ తీర్మానింపబడెను.

* * *

ఇతర గ్రామాలు

20-1-39 వ తేదీని కుంట ముక్కలలో కాకర్ల వెంకటేశ్వరరావుగారి అధ్యక్షత క్రిందను; నందిగామలో ఉప్పు వెంకటప్పయ్యగారి అధ్యక్షతను; కోడూరులో సూరానేని వెంకట తిరుమలయ్యగారి అధ్యక్షత క్రిందను; మొర్సుమల్లిలో అయ్యపు వెంకట కృష్ణయ్యగారి అధ్యక్షతను; చెవుటూరులో గంగవల్లి మాధవరావుగారి అధ్యక్షతను: రామచంద్రాపురంలో వెంకట శీతారామారావుగారి అధ్యక్షతను; తోలుకోటలో తాండ్ర పుల్లయ్యగారి అధ్యక్షతను జరిగిన బహిరంగ సభలలో ప్రకాశం కమిటీ రిపోర్టును బలపరచుచూ తీర్మానములు గావింపబడెను.

* * *

సవరణ

25-1-39 వ తేదీ "నవశక్తి" 17 వ పుట రెండవ "కాలం"లో శ్రీ చిట్టా శ్రీమన్నారాయణమూర్తిగారికి సూరానేని తిరుమలరావుగారు మొదటినుంచీ యిచ్చిన మొత్తం సొమ్ము 26-8-0 అనీ, వారినుండి యింకా పది రూపాయలు మాత్రం రావలసియున్నదనీ, దానిని యివ్వక ఉద్యోగమునుండి తొలగించిరనీ, శ్రీమన్నారాయణమూర్తిగారు సవరణపంపుచున్నారు.

* * *

ముక్త్యాల జమీలో పట్టపగలు దోపిడి

ముక్త్యాల జమీ పెద్దవరం గ్రామంలో జమీందారుగారి స్వంత వ్యవసాయం మేనేజరు గారి ఇంటిప్రక్కనే ఒక వైశ్యులఇల్లు. ఆఇంట్లో మగవారు చచ్చిపోయి, యిద్దరు విధవ స్త్రీలు వున్నారు. ఒకనాడు పట్టపగలు ఆ దిక్కులేని స్త్రీలను మేనేజరు జమాన్లచేత బైటకుతోయించి ఆ యింటిని తమ ఇంటిలో చేర్చి గోడ కట్టుకున్నారు. సుమారు 7 ఎకరముల భూమి, ఆమె మెడలోని 7 సవరనుల బంగారపు నాను ఒకటి 60 రూపాయలు రొఖం, 2 బట్టెలు, 10 సలకల ప్రత్తి, స్వాధీనం చేసుకొన్నారు. దిక్కులేని ఆ స్త్రీలు దగ్గరలోనున్న కోనాయపాలెం అనే గ్రామంలో ఒక బంధువుని యింట్లో వున్నారు. ఇటీవల రెవిన్యూ మంత్రి ప్రకాశంగారు నందిగామ వచ్చినప్పుడు వారి దగ్గరబంధువు గోపవరపు నరసింహాం వివరంగా పైవిషయం చెప్పుకొన్నాడు. తరువాత నందిగామ పోలీసు ఇన్స్పెక్టరు వచ్చి విచారణచేసి ఏమి వ్రాసిందీ చదివి వినిపించకుండానే ఆ నరసింహాం చేత సంతకం చేయించుకున్నట్లు తెలిసింది. వెంటనే తగిన శ్రద్ధతో విచారించి, ఆఅసహాయ స్త్రీలకు పై ఆస్తినంతటిని ఇప్పించవలసినదిగా కృష్ణాజిల్లా కలెక్టరుగారిని కోరుచున్నాను. అని శ్రీ వాసిరెడ్డి శివలింగప్రసాద్, ఆంధ్రరాష్ట్రి రైతు సంఘ ఆర్గనైజింగు సెక్రటరీగారు వ్రాయు[illegible]

జయాపజయములు 'పటేల్' అధీనములు కావు!
సుభాష్ బోసుకే అఖండ విజయం
బోస్ 1580 : పట్టాభి 1377



అబ్దుల్ కలామ్ అజాద్!

కాంగ్రెస్ అధ్యక్షపదవికై హేమాహేమీలే వీధినిబడిరని కొందరు చింతించు తున్నారు. ఎందుకో అంత కలవరం మా కర్థంకాలేదు. ఈ అధ్యక్షపదవి అనేకవిధాల పెద్దలకు—పిన్నలకు గుణపాఠాలు నేర్పింది. వివాదానికి మూలం విచారించుదాం.

చిచ్చుపెట్టింది మౌలానా

ఈ సంవత్సరం త్రిపురి కాంగ్రెస్ అధ్యక్షపదవికి, మౌలానా అబ్దుల్ కలాం అజాద్, బాబూ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ భోగరాజు పట్టాభి శీతారామయ్యగార్ల పేర్లు సూచింపబడినాయి. హిందూ — ముస్లిం సమస్య రోజు రోజుకూ రభస హెచ్చుతున్నదని, అబ్దుల్‌కలాం అజాద్‌వస్తే, ఆసమస్య తీరుతుందని చాలా మంది భావించారు. తక్కినవారు పోటీనుండి విరమించుకుంటారని కూడా తలిచారు. కాని మహమ్మదీయుడిని మహమ్మదీయుని కిచ్చుట మేము హర్షించజాలం. అయినా, అజాద్ అధ్యక్షత పదవికి వచ్చినా, సామ్రాజ్యవాదపు ఏజంట్లయిన జిన్నా ప్రభృతులు హిందూ—ముస్లిం సమస్య రెచ్చగొడుతూనే ఉంటారు.

కాని ముస్లిం అధ్యక్షత క్రింద ముస్లిం ప్రజాసామాన్యంలో ప్రబోధించ డానికి అవకాశం ఉంటుంది గనుక, జిన్నా మొదలగువారి దుష్ప్రచారాన్ని (ముస్లిములను రానీయడం లేదని) ఎదుర్కొంటానికి కొంత అవకాశం ఉంటుంది గనుక పూర్తిగా ఇష్టం లేకపోయినా మౌలానాను బలపఱచే వాళ్ళం. సుభాస్ బాబు కూడ పోటీ విరమించే వాడు.

కాని జనవరి 20 వ తేదీని మౌలానా తన అభ్యర్థిత్వము నుప సంహరించుకున్నాడు. ఉపసంహరించిన వాడూరుకొనక డాక్టరు పట్టాభి నెన్నుకొనవలెనని సూచిస్తూ ఇలా వ్రాశాడు. "నా ఆరోగ్యం బాగాలేదు. గత రెండేండ్ల పార్లమెంటరీ కార్యక్రమం వల్ల నా ఆరోగ్యం చెడింది. ఇకనింత కార్యభారం నిర్వహించలేను. పట్టాభి సీతారామయ్యగారు నా కొరకై విరమించుకొన సిద్ధమైనారు. కాని నేను మాని పట్టాభిని ఎన్నుకోమని ప్రతినిధులకు సలహా ఇస్తున్నాను. ఆయన చాలాకాలనుండీ కాంగ్రెసు సేవకుడు. [illegible] కర్మదీక్షగలవాడు. అతనిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటారని ఆశించుతున్నాను."

తాను మానుకునేవాడు మానుకొనక ఇట్టి ప్రకటనచేసి సుభాస్‌కు అన్యాయం చేశాడు. తనకు ఆప్తమిత్రులయిన పటేల్ వర్గానిక్కి-గాంధి గారికి సుభాస్‌బాబు రాకపోవడం ఇష్టం లేకపోతే ఆయనతో ఎందుకు చెప్పరాదు. ఆయనను విరమించుకోమని వ్యక్తిగతంగా ఎందుకు చెప్పరాదు? పత్రికలలో కెక్కి పట్టాభికి ఓటీయమని ఒక పక్షాన్ని బలపరచి మౌలానా చిచ్చుపెట్టాడు.

సుభాస్ బాబు మొదటి ప్రకటన

కలకత్తానుంచి జనవరి 21 వ తేదీన సుభాస్ బోస్ ప్రకటన వెలువడింది.

"ఈవిషయంలో మొగమోటమి విడచి చెప్పాలి. ఇది వ్యక్తిగత విషయం కాదు. హిందూదేశంలో సామ్రాజ్య వ్యతిరేక పోరాటం వృద్ధిచెంది తీవ్రత నందింది. అది క్రొత్తభావాలు, క్రొత్త లక్ష్యాలు, క్రొత్త సమస్యలు, క్రొత్త కార్యక్రమాలను తెచ్చి పెట్టింది. స్వతంత్రదేశాలలో వలె ఒక ప్రత్యేక కార్యక్రమం పైన అధ్యక్షుని ఎన్నిక జరగాలని ప్రజలు కోరుతున్నారు. దీనివలన ప్రజా హృదయం ద్యోతక మవుతుంది. కాబట్టి పోటీ చేయడం అసంబద్ధ విషయం కాదు.

ఇంతవరకు, నన్ను విరమించమని ఒక్క డెలిగేట్ కూడా కోరలేదు. నాకు తెలియకుండానే, అనుమతి లేకుండానే చాలా రాష్ట్రాలనుండి నన్ను సూచించారు. సోషలిస్టులు, నాన్ సోషలిస్టులు దేశంలో అనేక మంది నన్ను విరమించ వద్దంటున్నారు. కాబట్టి జనవరి 29 వ తేదీన, ఎన్నికల వలన నేను విరమించాలా వలదా అనేది తేలుతుంది."

ఇంతేగాదు: ఇంకా ఇలా చెప్పారు.

"అంతర్జాతీయ పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయి. ఫెడరేషన్‌పై పోరాటం తప్పదు. కాబట్టి వచ్చే సంవత్సరంలో మన జాతీయ చరిత్రలో అమోఘమైనది. నేసింకా సేవచేయాలని ప్రతినిధులు కోరితే నాకు నేను విరమించుకొనే హక్కేమున్నది?"

అని తాను విరమించుకోనని చెప్పాడు.

మితవాదుల ప్రకటన

జనవరి 24 వ తేదీన బార్డోలీ నుండి ఒక సంయుక్త ప్రకటన వెలువడింది. అందులో వల్లభభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్, జయరామ్‌దాస్ దౌలత్‌రాం, క్రిపాలినీ, శంకరరావ్ దివో, భూలాభాయి దేశాయిగార్లు-వర్కింగ్ కమిటీ సభ్యులు-సంతకం చేశారు. వీరందరూ



శరత్ బోసు

అధికారంలో ఉన్న - అధికారం చలాయించు తున్న-మితవాద ముఠా.

వారివాదన ఇది. "మాకు తెలిసినంత వరకు ఇంతవరకూ అధ్యక్షపదవి ఏకగ్రీవంగా ఎన్నుకోడం. సుభాసుబాబు ఒక క్రొత్త పద్ధతి మొదలెట్టాడు. ఆయన ఇలా అవలంబించుట యందు చూపిన జ్ఞానం, అనుభవంవల్లనే మంచిదో కాదో తెలుస్తుంది....

ప్రత్యేక పరిస్థితులలో తప్ప ఒకే అధ్యక్షుని రెండేండ్లు ఎన్నుకోరాదనే సిద్ధాంతం మంచిదని మా అభిప్రాయం....

అధ్యక్షపదవి ఒక చైర్‌మన్ లాంటిది. అంతేగాక, కాంగ్రెస్ అధ్యక్షుడు చట్టబద్ధుడైన ప్రభువువలె జాతియొక్క ఐక్యతకు, ఏకీ భావానికి చిహ్నం...." అని వ్రాసి సుభాస్‌బోస్ విరమించుకొని, ఎన్నాళ్ళనుండో దేశసేవ చేస్తున్న పట్టాభిని ఎన్నుకోమని పై ముఠా సలహా యిచ్చింది. తర్వాత జమన్‌లాల్ బజాజ్‌కూడ ఈ ప్రకటనకంగీకరించాడు.

పటేల్ ప్రభృతుల వాదం వింతగా ఉంది. సుభాసుబాబు రాకపోవడం ఇష్టం లేకపోతే గౌరవంగా పోటీ చేస్తున్నామని చెప్పుకోవాలి. కాని ఈ "సత్యం వద వాలాలు" అవసరమైతే అబద్ధాలకు కూడా దిగి విషయాలను మరిచిపోవడం ఆశ్చర్యం. అధ్యక్షుని ఎన్నిక ఎపుడూ ఏకగ్రీవము కానేకాదు. ఆచార్య నరేంద్రదేవ్ తెలిపినటుల పటేల్ 1929, 35 సంవత్సరాల సంగతి మరచిపోతున్నాడు. 1929 లో పటేల్ మహాశయుడే పోటీచేశాడు. గాంధి, నెహ్రూలు కూడ పోటీచేశారు. ఆసంవత్సరం గాంధిగారు గెల్చినా జహ్వార్‌లాల్‌కే పట్టంగట్టారు. 1935 లో కాబోలు జహ్వార్‌లాల్‌తో పట్టాభిగారు పోటీ చేశారు. తానూ 'సోషలిస్టు'నని ఒక ప్రకటన గావించారు. అయినా ఓడిపోయారు. ఇలా విషయాలుంటే, ఈ "సత్యంవదవాలాలు" తమ కనుకూలంగా పరిస్థితులను మరిచిపోయే శక్తి గల్గిఉన్నందుకు నిజంగా అభినందించాలి.

పైగా ఎత్తిపొడుపు. "అనుభవంవల్ల సుభాస్ బోసుకు తెలియవస్తుందిలే" అని బెదిరింపు. ఏమయిందా బెదరింపు? ఎవరు గెల్చారు? పటేలా? సుభాసా? ఎవరికి అనుభవం పాఠం నేర్పింది? పటేలుకా? సుభాసుకా? పలుకుబడి వుందని, అధికారంలో వున్నామని, ఇష్టం వచ్చినట్లు పల్కడానికీ-దురంహంకారానికీ తావు లేదని ప్రజలు పాఠం నేర్పారు! ఇకనైనా నేర్చుకోవాలి పటేల్ ప్రభృతులు!

ఇక అధ్యక్ష పదవిని, బ్రిటిష్ మానార్కీతో పోల్చడంకంటె నీచాతి నీచమైన పని మరొకటి లేదు. స్వాతంత్ర్య ప్రియులమైన మనం, రాజును కీలుబొమ్మ చేసుకొని దోపిడి చేసే బ్రిటిష్ మానార్కీతోనా మన అధ్యక్ష పదవిని పోల్చడం. బూర్జువా ప్రభుత్వమైనా, అమెరికన్ రిపబ్లిక్‌తో పోల్చితే దానిలో కొంత అర్థముండేది.

సుభాస్ రెండవ ప్రకటన

మితవాదుల ప్రకటన సుభాష్‌చేత మరో ప్రకటన వెల్వడేటట్లు చేసింది. వర్కింగు కమిటీ సభ్యులైయుండి ఒక అభ్యర్థికి పక్షపాతం చూపడం పనికిరాదని, అధ్యక్ష పదవికి పోటీ చేయుట మామూలేనని అధ్యక్షపదవిని చట్టబద్ధుడగు రాజుగారి హోదాతో పోల్చుట సరికాదని సుభాష్‌బాబు తెలియజేస్తూ ఇలా అన్నాడు.

"ఈ సంవత్సరం మితవాదిని కాంగ్రెస్ అధ్యక్షునిగా పెట్టడానికి ప్రయత్నించడంలో కారణం లేకపోలేదు. వచ్చే సంవత్సరం చాలా మంది మితవాదులు బ్రిటిష్ గవర్నమెంట్‌తో ఫెడరేషన్ విషయమై ఒడంబడిక చేసుకోబోతున్నారని, తలంచుతున్నారు. అందువల్ల తీవ్రవాదిని పెట్టుకోవడం వారికి ఇష్టం లేదు.... ప్రస్తుత పరిస్థితులలో ఫెడరేషన్ వ్యతిరేకులయిన వారినే అధ్యక్షునిగా ఎన్నుకోవాలి.... ఆచార్య నరేంద్రదేవ్ లాంటి తీవ్రఫెడరేషన్ వ్యతిరేకులను పెడితే నా అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించు కుంటాను."

ఈ విజ్ఞప్తితో బోస్ హృదయం, ఫెడరేషన్ పట్లగల అతని [illegible] స్పష్టమయింది. ఇదివరకే భూలాభాయి, సత్యమూర్తులు ఫెడరేషన్ విషయమై రాజీకబుర్లు చెప్పుతూ ఉండటం, సుభాస్‌బోస్ తానూ రాజీనామా ఇస్తానని కూడా బెదరించడం అందరెరిగిన విషయమే. ఇంతేగాక ఫెడరేషన్‌ను ప్రతిఘటించేందుకు సుభాస్‌బోస్ ఒక కార్యక్రమం ఇచ్చాడు. రాజీనికోరే ఈ మితవాదులకు అందుకనే సుభాస్ పనికిరాలేదు. అతడు కంటకం అయాడు. మితవాది అయిన పట్టాభికి పట్టం కట్టాలని ఎంచారు?



SUBHAS CHANDRA BOSE

కొందరు ప్రశ్నిస్తారు. హరిపుర తీర్మానమున్నదిగదా. పట్టాభి మాత్రం మితవాదియా? ఆయనా పదవీస్వీకరణ వ్యతిరేకవాదియేగదా! అని. హరిపుర తీర్మానం [illegible]సంగాదు. దాని ఆచరణ. బోస్ ముందుకడుగు వేస్తుంటే మితవాదులు వెనక్కిలాగారు. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక బాగానే ఉంది. [illegible] ఏమైనది. ప్రజా[illegible] అణచసాగారు మంత్రులు. [illegible] శాసనాన్ని విచ్చిన్న[illegible] సంగతి మరచిపోయి అమలుపరచాలనే గతిలోకి వచ్చారు ఈ తత్వానికర్థం?

పట్టాభి ఎంత పదవీవ్యతిరేకిఅయినా గాంధివాది. మితవాదులు పట్టుబట్టితే ఏమనలేడు. వారిచేతిలో కీలుబొమ్మ అనడానికి వేరే తార్కాణం ఎందుకు? ఈ వివాదంపైన తానొకప్రకటన స్వంతంగా చేయలేకపోయాడు. బార్డోలిపోయి మహాత్ముని అక్షతలు చల్లించుకొని అచటగాని స్టేట్‌మెంటు ఇవ్వలేని పట్టాభి యీ మితవాదులను ఎదిరించేది?

పటేల్ స్టేట్‌మెంటు

పట్టాభిగారి స్టేట్‌మెంటు జనవరి 25 వ తేదీన బార్డోలి నుండి వెలువడింది. ఆనాడే పటేల్ మరొక ప్రకటన గావించాడు. ఆ ప్రకటన సారాంశం "అధ్యక్షస్థానానికి మహాత్ముని సలహా ఉండేదని. ఈమధ్య లేకపోయినా, అతని సలహాను అడిగే వారట. గాంధిగారికి మౌలానా తాను కార్యభారం నిర్వహించలేనని తెల్పాడు. ఇక తిరిగి సుభాసును ఎన్నుకోవలసిన అవసరం లేదట. పైగా కొందరు వర్కింగు కమిటీ సభ్యులు, జవహర్లాల్‌తో సహా, మౌలానా మానితే పట్టాభి యొకడే ఉండవలెనని తలిచారట!

ఇక ఫెడరేషన్ విషయమై తామెవరం రాజీకి పాల్పడటం కోరడంలేదట! వర్కింగు కమిటీ అనుమతిలేనిదే అధ్యక్షుడు తానొక 'పాలసీ' నిర్ణయించడం పటేల్ అంగీకరించడము లేదట!" ఇంకా ప్రతినిధులను ఫలానివారికి ఓటివ్వాలని ప్రోత్సహించే హక్కున్నదని తెలియజేశాడు.

పట్టాభి స్టేట్‌మెంటు

తాను ఏయే పరిస్థితులలో మౌలానాకై విరమించుకొని, తర్వాత పోటీ చేసినది మొదటి భాగంలో తెల్పారు.

రెండవ భాగంలో తాను అధ్యక్ష పదవి కెన్నుకో బడుటకు తగిన హక్కులను తెల్పారు.

తర్వాత ఫెడరేషన్ విషయంలో తానూ తీవ్ర వ్యతిరేక వాదినని, హరిపుర కాంగ్రెస్ నుండి కొంతవరకు వర్కిందు కమిటీ సభ్యుడగుటచే కళ్ళాన్ని బిగించారు గాని లేకపోతే, తాను రాజ్యాంగ శాసన వ్యతిరేక ప్రచారం చేసే వాడినని తెల్పారు.

తనను ఎన్నుకొంటే సంస్థాన ప్రజలకు తాను జేసిన సేవకు గౌరవ మిచ్చినట్లు అని పట్టాభిగారు చెప్పారు అన్నిటి కంటె ముఖ్య విషయం ఏమిటంటే ఆంధ్రదేశంలో లాగా కాంగ్రెసును పవిత్రమొ నర్చడానికి ఇల్లు చక్కబెట్టుతానన్నారు."

పట్టాభిగారి ప్రకటనలో మాకేమీ క్రొత్త కల్పించడం లేదు. దాక్షిణాత్యులలో ఒకరుండాలని ముఖ్యంగా ఆంధ్రులు తన్ను కావాలని కోరారని ప్రకటించారు. ఆంధ్రుడు కావాలన్న అభిప్రాయం చాలాకాలంనుండి వున్నమాట నిజమే. కాని దాక్షిణాత్యులలో ఒకరు కావాలన్న మాటకు అంతవిలువ లేదు.


ఇలాంటి విషమ సమయంలో దేశాన్ని సామ్రాజ్య వ్యతిరేక పోరాటాన్ని ముందుకు నడిపించేవాడుకావాలి. వర్కింగుకమిటీకి అధ్యక్షుడు బద్ధుడయినా, వర్కింగుకమిటీని అధ్యక్షుడే సృష్టించుకోవాలన్న సంగతి పటేల్ మరచిపోయాడు. కాబట్టి ఇట్టి పరిస్థితులలో, పట్టాభి కంటే సుభాస్‌చంద్రబోసే తగినవాడని తీవ్రవాదుల అభిప్రాయం. సుభాస్ సోషలిస్టు కాకపోయినా అతన్ని కోరడంలో అదే ఉద్దేశ్యం. ఒకఆంధ్రులే కాదు. చాలరాష్ట్రాలవారింకా ఎన్నుకోబడలేదు. భారతదేశంలో అనేక రాష్ట్రాలున్నాయి. అనేక జాతులున్నాయి. ఇక కులాలకు లెక్కయే లేదు. ఆకులాలలో కూడ ఎన్నోవిభేదాలు. ఇక ప్రతి జాతీ, వర్ణమూ, రాష్ట్రమూ తామే అధ్యక్షులుగావాలని పట్టుబట్టతే మనస్వాతంత్ర్య సమరం సాగటం ఎలా?

సంస్థానాల విషయం. సంస్థానాల విషయంలో పట్టాభి అధ్యక్షుడై యుండి కూడా తగినసేవ చేయలేదనే మేమంటాం. కాంగ్రెసువారి నాన్ ఇంటర్వెన్షన్ పద్ధతి నవలంబించి, ప్రజా సంరంభాన్ని, ఉత్సాహాన్ని అరికట్టారు. పైగా రాజకోటలో పటేల్ తీసుకొన్న స్వాతంత్ర్యం పట్టాభి హైదరాబాద్‌లో తీసుకోలేకపోయాడు. సంస్థాన ప్రజల నిస్పృహ "వీరంతా మనకడ్డు రాకపోతేచాలు సహాయం చేయకపోతేమానె" అనే స్థితికి వచ్చింది. తానుపిళ్ళే వంటి సంస్థాన నాయకుడు "పట్టాభివంటి మిత్రులనుండి రక్షించండి!" అని అనవలసి వచ్చింది.

ఇక శుద్ధి సంస్కరణ. పట్టాభిగారు తీవ్రవాదుల వెళ్ళగొట్టాలని తలచారేగాని, నిజమైన కుళ్ళును తొలగించలేదు. ఇందుకు ఆంధ్రయే సాక్షాత్కారం.

శరత్ — పటేల్ ఉత్తర ప్రత్యుత్తరాలు

పటేల్—శరత్ బోసులమధ్య టెలిగ్రామ్స్ నడిచాయి. పటేల్ స్టేట్‌మెంటులో, సిద్ధాంత విభేదం కాదన్నాడు. కాని టెలిగ్రాంలో "విభేదం వ్యక్తులలోగాదు — సిద్ధాంతాలపైన" అని



పటేల్

అన్నాడు. ఒకదాని కొకటి పరస్పర విరుద్ధం మాట అలా ఉంచి రెండవదానిలో పూర్తిగా బోసు సిద్ధాంతం అంగీకరించనట్లు తేలింది. అంటే అది ఫెడరేషన్ విషయమేగదా! ఇంతేగాదు. పటేల్ మళ్ళా సుభాస్‌ను ఎన్నుకొంటే "దేశానికి హానికరం" అన్నాడు. ఇంతకంటె గర్హించవలసిన విషయం మరొకటిలేదు. దానికి జవాబు "పట్టాభి దేశాన్ని ఉద్రేకపఱచ లేడు" అని శరత్‌బోస్ ఇచ్చాడు. దీనికి ఉదాహరణ పైన చూపించాం. ఇందులో అసత్యమేమీలేదు.

జహ్వార్‌లాల్ కూడ సుభాస్‌ను విరమించుకోమని ఇచ్చిన ప్రకటనలో గూడ అధ్యక్షపదవి కంటకమైనదని, విసుగుదల చూపించాడు మితవాదులమీద విసుగుదలకూడ దానిలోఉంది. అయితే ఫెడరేషన్ విషయమై ఇంకా ఆయనకు మితవాదులలో నమ్మకం పోలేదు.

తీవ్రవాదుల ప్రకటన

కొందరిది సుభాష్ బాబు వేసిన ఎత్తుగడ, అని తలంచు తున్నారు. కానేకాదు. మొదటనే (అక్టోబర్‌లో) కమ్యూనిస్టులు బోసును సూచించారు. ఈనాడు, ఏక గ్రీవంగా కమ్యూనిస్టులు, రాయిస్టులు, సోషలిస్టులు తీవ్ర కాంగ్రెసు వాదులు చేసిన ప్రకటలే తార్కాణం. మన రాష్ట్రంలో వారి ప్రకటనల ప్రకటించ డానికి పత్రికలు శ్రద్ధ చూపం పోయినా, వారి ప్రకటనల వలన సుభాస్ ఎత్తుగాదని తేలుతుంది, ఇదితీవ్రవాదులతీవ్రమైనకోర్కె. సుభాస్‌బాబును సపోర్టు చేస్తూ ఈ క్రిందివారు ప్రకటించారు.

పి. సి. జోషీ	(కమ్యూనిస్టు)
యం. యన్. రాయ్.	(రాయిస్టు)
జయప్రకాశనారాయణ	(సోషలిస్టు)
ఆచార్య నరేంద్రదేవ్	(సోషలిస్టు)
స్వామి సహజానంద	(కిసాన్ సభ)
శార్దూల్ సింగ్	తీవ్ర కాంగ్రెసు వాదులు
రఫీ అహమ్మద్ కిద్వాయ్	తీవ్ర కాంగ్రెసు వాదులు

ఈ ప్రకటనలలో కొన్ని యిచట ఉదహరించదగినవి. కిద్వాయ్ యు. పి. రెవెన్యూమంత్రి ఇలా అన్నాడు.


"వర్కింగుకమిటీ అధ్యక్షునిచే సృష్టింపబడిన సంగతి పటేల్ తనకనుకూలంగాను మరచిపోతున్నాడు. సుభాస్, జహ్వార్‌లాల్ తమకు వ్యతిరేకులయినవారిని వర్కింగుకమిటీలో ఎన్నుకొనడం బలహీనత....

వారు శాసనాన్ని భగ్నంచేయడానికి నిలబడ్డారు. కాని భగ్నం చేయడం అంటే అమలు జరపడం అని మనం చూస్తున్నాం....బోసుకు వోటిస్తే ఫెడరేషన్‌ను తిరస్కరించడం, పట్టాభికిస్తే అంగీకరించడం."

డాక్టరు ఖరే ఇలా అన్నాడు. "నన్ను కాంగ్రెసు నుండి బయటఉంచినా, ఈ విషయంలో చాల మంది నా సలహా అడుగుచున్నారు.

సుభాస్ ఎక్కడ? పట్టాభి ఎక్కడ? మ్యునిసిపాలిటీలోను, డిస్ట్రిక్టుబోర్డులోను పట్టాభి కాంగ్రెసుకు జయంకూర్చలేకపోయాడు, రాష్ట్రమంతా కాంగ్రెసుకు జయం లభించినా. తన మ్యునిసిపాలిటీలో జస్టిసుపార్టీని ఎదుర్కొలేని పట్టాభి బ్రిటిషు సామ్రాజ్యమును ఎదుర్కొగలడా?"

ఇక తక్కిన వివాదాలెందుకు? అయిపోయిన పెళ్ళికి మేళాలెందుకు? సుభాష్ గెలిచాడు. ప్రజాస్వామ్యపద్ధతిని ప్రజలు కోరుతున్నారని తేలింది. ఫెడరేషన్ విషయమై తీవ్ర కార్యక్రమాన్ని కోరుతున్నారని తేలింది. ఇందుకు భారతదేశమంతా — ప్రజాస్వామ్య ప్రియులంతా సంతోషించాలి.



డా॥ పట్టాభి

ఓట్ల వివరములు

రాష్ట్రము	బోసు	పట్టాభి
అస్సాము	34	22
అజ్మీరు మార్వారా	20	6
ఆంధ్ర	28	181
ఉత్కళ	44	99
కర్నాటక	106	41
కేరళ	80	18
గుజరాత్	5	100
ఢిల్లీ	10	5
తమిళనాడు	110	102
పంజాబు	182	86
బర్మా	8	6
బీరారు	11	21
బీహారు	70	197
బెంగాలు	404	79
బొంబాయి	12	14
మహాకోసల	67	68
మహారాష్ట్ర	77	86
యునైటెడ్‌ప్రావిన్సెసు	269	185
సరిహద్దు రాష్ట్రం	18	23
సెంట్రల్ ప్రావిన్సెసు	12	17
సింధు	13	21
మొత్తం	1580	1377

సుభాష్‌బోసుకు 203 ఓట్లు ఎక్కువ.

నూతన ఆంధ్రరాష్ట్ర కార్యనిర్వాహక వర్గము

అధ్యక్షుడు : డాక్టరు పట్టాభిగారు
ఉపాధ్యక్షుడు : కె. కోటిరెడ్డిగారు
ప్రధాన కార్యదర్శి : గొట్టిపాటి బ్రహ్మయ్యగారు
జాయంటు కార్యదర్శులు : కళా వెంకట్రావుగారు, సంజీవి రెడ్డిగారు

ఎన్నుకోబడిరి. అఖిలభారత కాంగ్రెసు సంఘానికి 31 మందిని పోటీలేకుండ ఎన్నుకున్నారు. వారిలో సోషలిస్టు, కిసాను, అతివాద గ్రూపులకు చెందిన వారిపేర్లు : యన్. జి. రంగా, కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, పుచ్చలపల్లి సుందరయ్య, మద్దూరి అన్నపూర్ణయ్య, వెన్నెలకంటి రాఘవయ్య, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ గార్లు.

బొంబాయి కార్మిక చట్టానికి అసమ్మతి!

బెజవాడ

26 వ తేదీ స్వతంత్ర దినోత్సవము సందర్భమున బెజవాడలోని అన్ని ప్రెస్‌లలోను మధ్యాహ్నమునుంచి శలవుయిచ్చిరి. కాని "చిత్తరంజన్ ప్రెస్" యజమానులు సెలవు యీయ నిరాకరించిరి. ఆ పూట పనిమానివేసినవారందరిని పనిలోనుండి తొలగించెదమని కూడ బెదరించిరి. కాని ఆ ప్రెస్‌లో పనిచేయువారందరు కూడ ధైర్యముతో పనిమానివేసి స్వతంత్ర్య దినోత్సవమునందు పాల్గొనిరి. మరునాడు పనిలోనికి వెళ్ళునప్పుడు యజమానులు వారిపై యేవిధమైన చర్యతీసుకొన లేదు.

బొంబాయి కార్మిక చట్టము యెడల అసమ్మతి సభ

బెజవాడ 22-1-39 యం. యస్. యం. రైల్వే పనివారల సంఘము, ప్రెస్‌వర్కర్సు యూనియన్‌ల యాజమాన్యమున, బొంబాయి కార్మిక చట్టముయెడల నిరసన దినము జరుపబడెను. సాయంత్రము 4 గంటలకు ప్రెస్‌వర్కర్సు యూనియన్ ఆఫీసునుండి గొప్ప వూరేగింపు ఎర్రజండాలతో బయలుదేరి "బొంబాయి కార్మిక చట్టము నాశనం కావాలి" అనే నినాదాలతో వీదులన్ని తిరిగి రైల్వే మైదానమునకు వచ్చిరి అచ్చట గొప్ప బహిరంగ సభ జరిగెను.

ఆసభకు షేకు రహింతుల్లాగారు అధ్యక్షత వహించారు. తోట నరసయ్యగారు ఆర్. వి. సుబ్రహ్మణ్యంగారు, జీరి అప్పలస్వామిగారు, కె. యల్. నరసింహంగారు, బొంబాయి కార్మిక చట్టమునుగురించి విపులముగాచెప్పుచూ రైల్వేకార్మికులను ఎదుర్కొనుచున్న సమస్యలను తెలియజేశారు. ఈ క్రింది తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదించబడెను.

1. బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గము కార్మికుల ముఖ్యమైన హక్కులను భంగపరచుచూ, కార్మికోద్యమమునకు హానిజేయుటకు తీసుకొనివచ్చిన కార్మిక చట్టముయెడల యీ సభవారు అసమ్మతి తెలియజేయుచున్నారు.

2. బొంబాయి రాష్ట్రమంతటా నవంబరు 7 వ తేదీని కార్మికులు నిరసన సమ్మెచేసి, వారి అసమ్మతి తెలియజేసినా, ఆ చట్టమును మార్చనందుకు కాంగ్రెసు మంత్రివర్గముయొక్క చర్యలను ఖండించుచూ, ఆ చట్టమును అమలు జరపకుండా వుండవలెనని హెచ్చరించుచున్నాము.

3. శాంతియుతముగా సమ్మెచేయుచున్న కార్మికులమీద పోలీసులు లాఠీచార్జీలు, తుపాకులు కాల్చినందుకు పోలీసుల చర్యను ఖండించుచూ గాయపడినవారికి మాసానుభూతి తెలియచేయుచున్నాము.

4. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో సూచించినహక్కులను యిచ్చుచూ, వెంటనే మద్రాసు రాష్ట్రములో కార్మికశాసనము తీసుకొని రావాలని మద్రాసు కాంగ్రెసు ఎసెంబ్లీపార్టీవారిని యీ సభవారు కోరుచున్నారు.

5. రాబోవు కాంగ్రెసు మహాసభకు శ్రీయుత సుభాస్‌చంద్రబోసుగారిని ఎన్నుకొనవలెనని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ సభ్యులను హెచ్చరించుచున్నాము.

కార్మిక సమస్యలు

తాడేపల్లి

కృష్ణా సిమెంటు వర్కర్సు లేబర్ యూనియన్

సిమెంటు వర్కర్సు పనివారలు 29-1-'39 ఆదివారమునాడు మంగళగిరిలో శ్రీ పులుపుల శివయ్యగారి అధ్యక్షత క్రింద సమావేశమయి తమ సంఘానికి శ్రీ యస్. వి. యల్. నరసింహం బి. ఎ. బి. యల్. (గుంటూరు)గారు అధ్యక్షులుగను, మేకా కోటిరెడ్డి, బాబూరావు గార్లు ఉపాధ్యక్షులుగను పి. అమరేశ్వరరావు గారు ప్రధాన కార్యదర్శిగను, పులుపుల శివయ్య, కర్రా జానకిరామయ్యగార్లు సహాయ కార్యదర్శులుగను మరి కొంతమందిని కార్య నిర్వాహక సభ్యులుగను యెన్నుకొనిరి.

కృష్ణా సిమెంటు వర్కర్సు కార్మికుల పరిస్థితులు

బొంబాయి హెడ్‌ఆఫీసుకువెళ్ళి మ్యానేజరు డాక్టరు కార్లీగారు లేబరు పరిస్థితులను చక్కబెట్టుకొని వచ్చెదరని కార్మికులందరు వారి రాకకై వేచియుండిరి. ఆయన జనవరి 4 వ తేదీకి క్రిస్‌మస్ శెలవులు ముగించుకొని మద్రాసునుండి వచ్చినారు. 6 వ తారీఖున సాయంత్రము 5 గంటలకు 5 నిమిషములున్నదనగా దొరగారు మాట్లాడుతారని చెప్పి పనివారలందరిని టైమ్ ఆఫీసు వద్దకు పిలిచిరి. దొరగారి బదులు హఠాత్తుగా పోలీసువారు కొందరువచ్చి ఎలెక్ట్రికల్ ఇంజనీయరు గారైన R. R. అయ్యరుగారి వంటమనిషి, నారాయణ అను వానిని, చీఫ్ టైముకీపరు తమ్ముడు గోవింద నాయరు అనువారిని పిలుచుకొనివచ్చి శిక్కును చంపిందెవరో చూపమన్నారు. వారు జనములో అటూ యిటూ చూచుచున్నట్లు నటించి తుదకు రైల్వే సైడింగు పోర్‌మన్‌అయిన బాబురావును చూపించిరి. మరురోజు నుంచి బాబురావు మరి కొందరిమీద కేసులు పెట్టినారని వదంతి ఏర్పడినది. కార్లేగారు యీలోగా బొంబాయి కూడా పోయివచ్చినారు. తదుపరి యూనియన్ తరఫున కొందరు వారివద్దకు రాయభారము వెళ్ళి "కూలీలకు రేట్లు హెచ్చించెదరని వారు గంపెడాశతో వున్నారు. అందుకొరకు మీరువారికి వాగ్దత్తము చేసిన ప్రకారం యేమి శెలవిచ్చెదర"ని యడుగగా వెళ్లిన వారితో తీవ్రముగా మాట్లాడి యేమిచేయుటకు వీలులేదనియు; యిప్పుడు తామిచ్చుచున్న రేట్లు, సౌకర్యములు, చాల న్యాయసమ్మతముగా నున్నవనియు శెలవిచ్చినారు. అంతటితో తృప్తిజెందక జనవరి 14 వ తేదీనుండి గుమాస్తాలను మధ్యాహ్నము భోజనమునకుగాను మంగళగిరికి తీసికొని వచ్చు లారీ ట్రిప్పు ఆపివేసినారు. పనివారలకు కంటకులుగా నుండిన ఆఫీసు సూపరింటెండెంటు పంతకిగారినీ చీఫ్ టైమ్‌కీపరుగారైన గోపాల నాయరునూ వారి వారి స్థానములు సెలవుల తదనంతరము స్వీకరించి తమ కార్యక్రమము మరల ప్రారంభించినారు. పనివారలలో తగాదాల నేర్పాటు చేయుటకై కూలివారి కేమాత్రం జీతములను హెచ్చుచేయక 14 గురు మేస్త్రీలకు మట్టుకు యింతక్రితము 6 అణాలు, అర్ధరూపాయి తీస్తున్నవారికి అందరికి రు 0-12-0 రోజు రేటు చొ॥ హెచ్చు చేసినారు. దీనివలన కూలీలలో హెచ్చు అసంతృప్తి ప్రబలినది. ఫిబ్రవరి 1 వ తేదీన ముఖ్యులైన కొందరిని పనినుండి తీసివేసెదరని కూడ తీవ్రమైన వదంతి బయలుదేరినది. సెలవల తదనంతరము సహాయమునకు బదులు అధికారులు యీరీతిగా హింసను వుపయోగించు చున్నారు.

పందలపాక

నూలుమిల్లు కార్మికుల ఇబ్బందులు

పందలపాకలో గల నూలుమిల్లులలో రమారమి 1000 మంది కూలీలు పనిచేయుచున్నారు. వీరు తయారుచేసిన నూలును యజమానులు తూచి పౌను 1కి 0-0-3 పైసల చొ॥యిస్తారు. యీ నూలు తూకం వేసేటప్పుడు కూలీలను కాటాదగ్గరకు రానీయరు కూలి యిచ్చేటప్పుడు కూడ యజమానులు తమ యిష్టము వచ్చినట్లే వర్తిస్తారు.

దేవుని చందాలు.

యీవిధంగా ముట్టే కూలిలో నుండికూడా దేవుని పేరిట రూపాయికి కానీ కూలీలవద్ద నుండి యజమానులు వసూలు చేస్తారు. యీ డబ్బు ఏలా ఖర్చు అవుతున్నదీ కూలీలకేమీ తెలియదు. యీ విధమయిన అన్యాయపు వసూళ్లు మానివేసి యింతవరకూ వసూలయిన కానులను కూలీలకు తిరిగి యిచ్చివేయవలసినదని ఫ్యాక్టరీయిన్స్పెక్టరుగారు యజమానులకు నోటీసు పంపితే, కూలీలకు డబ్బులివ్వకుండానే యిచ్చినట్లు వారిచేత సంతకాలు చేయించుచున్నారు. సంతకాలు చేయకపోతే కార్మికులను పనిలోనుండి తొలగిస్తామని బెదరించారు.

జీతాలు

యిదివరలో నెల 1కి 18 రూపాయలు జీతం పుచ్చుకొంటూ ఎక్కువసర్వీసుగల కార్మికులకు యిప్పుడు రోజు 1 కి 0-4-6 చొ॥న యివ్వబోగా, యిదిచాలా అక్రమం అని వారు జీతాలు పుచ్చుకోలేదు.

రామచంద్రామిల్లులో ఒక స్త్రీ కూలీ తన కుమారునికి జబ్బుచేయుటచే పనికి రాలేకపోయినందున ఆమెకు వారంరోజుల కూలిని యజమానులు యివ్వలేదు. ఒక కూలి ఒక పూట పనిచేసి ఏకారణముచేతనైనా రెండవ పూట రాలేకపోతే ఆరోజంతా కూలీకి అప్సెంటు వేస్తున్నారు. గర్భిణీ స్త్రీలచేత 8 మాసముల వరకు పనిచేయిస్తున్నారు. ప్రసవ సమయంలో కూలియివ్వరు. పురుడువెళ్ళిన తర్వాత పనిలోకి రానివ్వరు. ఎక్కువ పనిచేసినా కూలి తక్కువే, అదయినా సరిగా యివ్వరు.

ప్రమాదాలు

రామచంద్రా మిల్లులో యీమధ్య మేడపాటి లక్ష్మారెడ్డి (30 సంవత్సరముల వయస్సు) అను ఒక కార్మికునకు చేతి వ్రేలుపోయింది. చేతికి వెనుకభాగమున చర్మంపోయి లొట్టబడినది. యిలా ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికు యజమానులు ఏమీ కాంపెన్సేషన్ యివ్వడం లేదు.

సవరణ

గత సంచికలో కాకినాడ వార్తలలో "జూట్ ప్రెస్‌లో బి. యల్. నారాయణగారనే కార్మికుడు మరణించె"నని ప్రకటించబడింది. ఇది సరికాదు. "బి. యల్. నారాయణగారి జూట్ ప్రెస్‌లో కార్మికుడు మరణించెను" అని వుండాలి.

ఈ ప్రమాదమునకు చింతించుచు బి. యల్. నారాయణగారికి మా క్షమాపణ తెలియజేయుచున్నాము.

—సంపాదకుడు.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ

[మా విలేఖరి]

జనవరి 28, 29 తేదీలలో బెజవాడలో జరిగిన 15 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ ఆచార్య రంగా గారి అధ్యక్షతక్రింద అతివైభవంగా జరిగింది. మొదటి రోజు ఉదయం 8-30 గంటలకు షుమారు 500 మంది విద్యార్థులు సభాధ్యక్షులైన శ్రీ రంగాగారితో రాష్ట్ర విద్యార్థి సంఘ కార్యాలయం వద్దనుండి ఊరేగింపుగా బయలుదేరి, "శాంతి, అభివృద్ధి, స్వేచ్ఛ" అని వ్రాయబడిన విద్యార్థి జండాలతోను, జాతీయ పతాకాలతోను వీరంతా బెజవాడ పుర వీధులలో నడుస్తోంటే, అదొక పెద్ద పటాలము మాదిరిగా కనబడింది. "డిటెన్షన్ పద్ధతి నశించాలి!" "బానిస విద్యా విధానం నశించాలి!" "స్వతంత్ర భారత్ కీ జై!" "విద్యార్థి సంఘాలకు జై!" "సామ్రాజ్య వాదం నశించాలి!" "విప్లవం వర్ధిల్లాలి!" మొదలయిన నినాదాలతో బెజవాడ పట్టణం అంతా రెండు గంటలసేపు మారుమ్రోగింది. రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎక్కి ఊరేగింపు నడచి వస్తూంటే, యీ చివర నుంచి ఆ చివర వరకూ ఒకే జలప్రవాహం ప్రవహిస్తూన్నట్టు తోచింది. "ఫెడరల్ రాజ్యాంగమును" అని ఒక విద్యార్థి అరిచాడు. వెంటనే యితర విద్యార్థులంతా, "పాతెయ్యాలి!" అని అందుకున్నప్పుడు ఓవర్ బ్రిడ్జి అంతా మారుమ్రోగి యిటూ అటూ ఊగింది. ఈ విధంగా సమావేశానికి వచ్చిన ప్రతినిధులు, ప్రేక్షకులు ఊరేగింపులో పాల్గొని, బెజవాడ దృష్టిని పూర్తిగా ఆకర్షించారు.

మహాసభ

మధ్యాహ్నం 1 గంటకు దుర్గా కళా మందిరంలో మహాసభ ప్రారంభమయింది. సుమారు వేయిమంది విద్యార్థులు హాజరు అయారు. ఆంధ్ర దేశ మంతటికీ ఎక్కువ విశాలవంతమైన యీ కళామందిరం ప్రేక్షకులతో కిటకిటలాడిపోయింది. ఒకరుగాని, యిద్దరుగాని పోలీసు రిపోర్టర్లు చాలకనో—లేక బెజవాడలో కొత్తగా స్థాపించబడిన సి. ఐ. డి. శాఖకు చేతినిండా పని లేకనో—నలుగురు పోలీసు రిపోర్టర్లు వచ్చి ముందు కూర్చున్నారు, తమ నోటు బుక్కులతో. "కాంగ్రెసు జయభేరి—ధణధణా మ్రోగింది!" అనే గేయమూ, "సమ్మెవ్వరాపగల రీవేళ!" అనే గేయమూ రైతాంగ గాయకుడైన కామ్రేడ్ అప్పారావు సభా ప్రారంభంలో ఉద్రేక పూరితంగా పాడుతోంటే, ప్రేక్షకులు "విప్లవం వర్ధిల్లాలి!", "సామ్రాజ్యవాదం నశించాలి!" అనే నినాదాలతో స్వీకరించారు.

పిమ్మట జాస్తి నారాయణరావు గారు క్లుప్తముగా తమ ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసము ముగించారు. మహాసభకు ప్రారంభోత్సవము గావిస్తూ, యస్. వి. యల్. నరసింహం, బి. ఏ., బి. యల్. గారు సామ్రాజ్యవాదులచే తయారుచేయబడ్డ నేటి మన బానిస విద్యా విధానంలో విద్యార్థుల పౌరసత్వపు హక్కులు ఏవిధంగా అరికట్టబడుతున్నాయో వివరించారు.

పిమ్మట, మహాసభకు శ్రీ కాశేశ్వరరావుగారు, డాక్టరు పట్టాభిగారు, సత్యమూర్తి, బాట్లివాలా, సరోజనీ నాయుడు, విజయలక్ష్మి పండిట్, నారిమన్, బెజవాడ హైస్కూలు హెడ్మాస్టరుగారు పంపిన సందేశాలను బసవపున్నయ్యగారు చదివారు. తరువాత రాష్ట్ర కార్యదర్శి బసవపున్నయ్యగారు తమ సాంవత్సరికరిపోర్టును చదివి వినిపించారు. వేర్వేరు జిల్లాలలో జరిగిన సమ్మెలు, వాటి కారణాలు, వాటికి పూర్వము రాష్ట్ర సంఘము మదరాసు ప్రభుత్వానికి, కాంగ్రెసుకమిటీలకు పంపిన మెమొరాండములు, తీసుకువెళ్ళిన డెప్యుటేషన్లు, మంతెనవారిపాలెంలో నిర్వహించబడిన ఆర్థిక రాజకీయ పాఠశాల మొదలయిన అంశాలను గురించి కార్యదర్శిగారు విపులముగా తెలియ జేశారు. విద్యార్థి సంఘాలకూ—యితరసామ్రాజ్య వ్యతిరేక సంస్థలకూ మధ్య ఉండవలసిన సంబంధాన్ని కూడా చర్చించారు. విద్యార్థుల కనీసపు కోర్కెలయెడల కాంగ్రెసు మంత్రి వర్గము చూపుతూన్న ప్రతికూల వైఖరిని వారు ఖండిస్తూంటే, విద్యార్థులలో "సిగ్గు, సిగ్గు" అని కేకలు.

అధ్యక్షోపన్యాసం

అధ్యక్షులైన ఆచార్య రంగాగారు సుమారు గంటన్నర సేపు నేటి విద్యా విధానాన్ని ఖండిస్తూ, విద్యార్థుల కర్తవ్యాన్ని తెలియజేస్తూ, ఉపన్యసించారు. 1919 లో బయల్దేరిన జాతీయోద్యమంలో విద్యార్థులు విరివిగా పాల్గొనక పోవడానికి కారణం, అప్పటి నాయకులు విద్యార్థుల సమస్యల యెడల మూకీభావం వహించడమే నన్నారు. పూర్వపు అనుభవాన్ని బట్టి యిప్పుడయినా మన నాయకులు విద్యార్థుల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు. త్వరలోనే రాబోయే స్వాతంత్ర్య యుద్ధంలో విద్యార్థుల్నే కాకుండా చంటిపిల్లల్నికూడా ఆహుతి చెయ్యాలని రంగాగారు చెప్పినప్పుడు హర్ష ధ్వనులు చెలరేగాయి. భారత దేశంలో ప్రజానీకము అనుభవిస్తూన్న దుర్భర దారిద్ర్యాన్ని కన్నుల యెదుట బెట్టినట్లు వర్ణిస్తూ, పట్టణాల్లో విద్యార్థుల విలాస జీవితాన్ని అధ్యక్షుడు తీవ్రంగా ఖండించినప్పుడు ప్రేక్షకు లెవరూ కిక్కురుమనలేదు. ప్రజలకు సంబంధించిన విద్య నేడు విద్యాలయాలలో నేర్పబడ్డం లేదన్నారు. అది జరగాలంటే విద్యార్థులు జాతీయోద్యమంలో పాల్గొని తీరాలి అన్నారు. ఎందువల్ల నంటే, విదేశ పరిపాలన నశిస్తేనేగాని విద్యావిధానం పూర్తిగా మారదు.

తరువాత రంగాగారు నిజమైన డిసిప్లిన్ ఏలా ఉండాలో వివరించారు. 1936 లో కొత్తపట్నములో నిర్వహించబడిన ఆర్థిక—రాజకీయ పాఠశాలలో విద్యార్థులకూ—ఉపాధ్యాయులకూ మధ్య తనకు కనపడిన డిసిప్లినే నిజమైన డిసిప్లిన్ అన్నారు. కొత్తపట్నము తాను ఉపన్యాసకుడుగా వెళ్ళినప్పుడు అక్కడి విద్యార్థులు సల్పిన విమర్శనలు, చర్చలు ఎంత తీవ్ర స్వభావము గలిగి యున్నప్పటికీ, అక్కడ వారు చూపిన డిసిప్లిన్ తనకు ఆశ్చర్యం కలిగించిం దన్నారు. ఆ పాఠశాలను రెడ్డి మంత్రివర్గం నిషేధించినప్పుడు, విద్యార్థులు—ఉపాధ్యాయులు నిషేధాజ్ఞను ధిక్కరించి, లాఠీలకు, ఎరస్టులకు గురికావడం వర్ణించినప్పుడు హాలు అంతా చప్పట్లతో మారుమ్రోగింది. అదే విధముగా, మంతెనవారిపాలెం ఆర్థిక రాజకీయ పాఠశాలకు యెట్టి డిసిప్లినరీ రూల్సు, సెనేట్ రెగ్యులేషన్లు, డి. ఓ. లను రుక్కుల అర్థ్లు లేక పోయినా విద్యార్థులలోను, ఉపాధ్యాయులలోను కనబడిన అన్యోన్య సహకారము ప్రశంసనీయ మన్నారు. సాధారణంగా విద్యార్థులు గత్యంతరం లేనప్పుడే సమ్మెలు చేస్తున్నారని రంగాగారు చెప్పారు. వాటిని ఖండించడము కాంగ్రెసు నాయకులకు తగని పని అని ఖండించారు. డిటెన్షన్ల పద్ధతిని నిర్మూలించడమే కాకుండా విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో 100 కి నూర్గు మందిని ప్యాసు చేసే పద్ధతి వచ్చే వరకూ పోరాటం సాగించకపోతే మగవాళ్లు కారని పలికినప్పుడు విద్యార్థినులు ఏమనుకున్నారో తెలియదు కాని, విద్యార్థులంతా మాత్రం చప్పట్ల వర్షంతో స్వీకరించారు. కులాసాగా, కూర్చొని కారా కిళ్లీలు నములుతూ నోట్సు తీసుకొంటూన్న పోలీసు రిపోర్టర్లు సహితము పకపకనవ్వారు.

రంగాగారు తమ అధ్యక్షోపన్యాసాన్ని ముగిస్తూ, భారతీయులు సంపూర్ణ స్వరాజ్యాన్ని పొందుటకు యిదే సరియైన అవకాశము అని నిరూపించారు. ఫెడరేషన్ ఎదుర్కొనడానికి రేపు రాబోయే బ్రహ్మాండమయిన ప్రజా పోరాటంలో విద్యార్థులు విరివిగా పాల్గొనాలని హెచ్చరించారు. కరతాళ ధ్వనులతో సభ ముగిసింది.

విషయ నిర్ణయ సభ

ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న యించు మించు అన్ని జిల్లాలనుంచి సుమారు 100 మంది డెలిగేట్లు సాయంత్రము 3-30 గంటలకు రామమోహన్ లైబ్రరీలో విషయ నిర్ణయ సభగా సమావేశమై, అనేక తీర్మానాలు గావించారు. వాటిలో ప్రధానమైనవి యివి:—

తీర్మానాలు

ఫెడరేషన్

1. ప్రతిదేశము తన పరిపాలనా విధానాన్ని తానే నిర్ణయించుకొనే హక్కును కలిగి యుండాలి. యిట్టి హక్కును త్రోసిపుచ్చి, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకముగా, బ్రిటిష్ ప్రభుత్వం మనపై బలవంతంగా రుద్దనున్న 1935 వ సంవత్సరపు ఇండియా ప్రభుత్వ చట్టము, అందు ప్రత్యేకముగా ఫెడరల్ విధానాన్ని, విశాల భారత దేశ మంతయు పార్టీ, కుల మత విభేదాలు, సంస్థానాలు—రాష్ట్రాలు, అనే తేడా లేకుండా స్వాతంత్ర్యాన్ని కాంక్షించే ప్రతి వ్యక్తీ ఎదుర్కోవాలని యీ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించుచున్నది.

క్రమమైన రీతిని ఎన్నుకొనబడిన ప్రజా ప్రతినిధులతో గూడిన కాన్‌స్టిట్యూయెంట్ ఎసంబ్లీచే తయారు చేయబడి ఆమోదించబడిన రాజ్యాంగవిధానమే భారత దేశ శ్రేయస్సుకు పనికివచ్చునని యీ సభవారు నమ్ముచున్నారు.

ఫెడరేషనును పూర్తిగా వ్యతిరేకించవలెనను కాంగ్రెసు తీర్మానం ఉండగానే, కొంతమంది కాంగ్రెస్ నాయకులు కొన్నిమార్పులతో ఫెడరేషన్‌ను అంగీకరించుతామని చేయు ప్రచారము యెడల ఈ సభవారు తమ తీవ్ర అసమ్మతిని ప్రకటించుచున్నారు.

(మిగతా 20 వ పేజీలో)

తూ॥ గో॥ జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సాంవత్సరిక సమావేశము.

9—2—39 తేదీ గురువారం ఉదయం 8 గంటలకు తుని తాలూకా తొండంగి గ్రామంలో పై పార్టీ కార్య సంఘ సమావేశము జరుగును.

పై పార్టీ సాంవత్సరిక సమావేశము. 10—2—39 తేదీ శనివారం లగాయితు. 2 లేక 3 రోజులు పై స్థలములోనే జరుగును.

10—11—38 కి పూర్వము పార్టీలో సభ్యులుగ నున్నవారే సమావేశములో పాల్గొన నర్హులు. ప్రొబేషన్‌లో నున్న పార్టీ సభ్యులు సమావేశమునకు ప్రేక్షకులుగా హాజరు కావచ్చును. ప్రతినిధి రుసుము ఎనిమిది అణాలు.

1—2—39 తేదీలోగా సభ్యులు తమ కార్య నివేదికలను పార్టీ ఆఫీసు. రాజమండ్రికి అందజేయవలెను.

5—2—39 లోపుగా పార్టీ సభ్యులు తాము ప్రవేశ పెట్టదలంచిన తీర్మానములను పార్టీ ఆఫీసుకు పంపించవలయును.

పి. అ నం తం,
కార్యదర్శి.
రాజమండ్రి. 23-1-39.

* * *

పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ వార్షిక సమావేశము.

ఫిబ్రవరి 4, 5 తేదీలలో ప॥ గో॥ జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ వార్షిక సమావేశము జరుగును. సమావేశము 4 వ తేదీ మధ్యాహ్నం 2½ గంటలకు ప్రారంభమగును. సమావేశమునకు సభ్యు లెల్లరు ప్రతినిధులు గాన ఎల్లరు రాగోరుచున్నాను. సమావేశము తణుకులో యర్రమిల్లి రామనాథం గారి మేడ మీద జరుగును.

4 వ తేదీ ఉదయం 10 గంటలకు అక్కడనే మన జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యవర్గ సమావేశము జరుగును గాన కార్య నిర్వాహక వర్గ సభ్యు లందరు రాగోరుచున్నాను.

చర్చనీయాంశములు.

1. పార్టీ నివేదిక.
2. మహాసభలో చర్చించవలసిన తీర్మానములను గూర్చి.
3. పార్టీ నిర్మాణ సమస్య.
4. ఆర్థిక స్థితి.
5. కార్యదర్శిచే పెట్టబడు ఇతర తీర్మానములు.

ఇట్లు
ఉద్దరాజు రామం.
ప॥ గో॥ జి॥ కాం॥ సో॥ పార్టీ కార్యదర్శి

* * *

మ హి ళా సం ఘ ం.

24-1-39 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జిన్నూరు మహిళా సంఘ సర్వ సాధారణ సమావేశం అల్లూరి అన్నపూర్ణాదేవి (జిల్లా బోర్డు మెంబరు) గారి అధ్యక్షత క్రింద సమావేశమయ్యెను.

సభలో అల్లూరి అన్నపూర్ణాదేవిగారు స్త్రీ సంఘ ఆవశ్యకతను గురించి ఆచరించవలసిన కార్యక్రమంను గురించి సంఘములో భేదించవలసిన దురాచారములను గురించి విపులముగా మృదు మధుర శైలిలో ఉపన్యసించిరి.

తదుపరి సభలో సుభాసు చంద్ర బోసుగారినే వచ్చే సంవత్సరము అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నుకోవలయుననియు, పాలకొల్లులో సబిన్‌స్పెక్టరు ఒక స్త్రీని నిరంకుశముగా కొట్టుటను ఖండించి అతని మీద చర్య తీసుకోవలసినదిగా ప్రభుత్వమును కోరుతూ తీర్మానించిరి. అనంతరము వచ్చే సంవత్సరమునకు కార్యనిర్వాహక సభ్యులు ఈ క్రింది విధమున ఏకగ్రీవముగా ఎన్నుకోబడింది.

ఉద్దరాజు బంగారమ్మగారు, అధ్యక్షులు. యిటాకుల సూర్యకాంతమ్మగారు, కార్యదర్శి. భూపతిరాజు వెంకమ్మ, కోసూరి సత్యవతిదేవి, అల్లూరి అన్నపూర్ణాదేవి గారలను కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నుకోబడిరి.

జిన్నూరు, 25—1—39 } (ఒక విలేఖరి)

గమనించండి

* * *

బందరు తాలూకా రైతుసంఘం

ది 25—1—39 వ తేదీ బుధవారం 4 గంటలకు చెన్నూరు గ్రామ గ్రంథాలయ భవనములో బందరు తాలూకా రైతుసంఘ కార్యనిర్వాహక వర్గ ఎన్నికలు జరిగి యీ క్రిందివారు ఏకగ్రీవముగా ఎన్నుకోబడిరి.

శ్రీయుత యెర్రశెట్టి కృష్ణమూర్తిగారు
అధ్యక్షులు

శ్రీయుత చిట్టా సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.
కార్యదర్శి

శ్రీయుత మండవ వెంకట్రామయ్య, నందమూరు సుబ్బారావు, మోటేపల్లి పకీరయ్య, సమ్మెట వీర రాఘవస్వామి, బల్లిపర్తి వెంకట చలపతిరావు, గాజుల వెంకయ్య, కొండ తిరుపతిరాజుగార్లు కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా ఎన్నుకోబడిరి.

దోకిపర్రు 27-1-39 } పామిరెడ్డి వెంకట సుబ్బారావు రెడ్డి
ఆర్గనైజింగు కార్యదర్శి
కృష్ణా జిల్లా రైతు సంఘం.

* * *

తిరుగుబాటు నాటకము

కృష్ణాజిల్లా యలమర్రుగ్రామంలో నవయుగ నాట్య మండలివారు శ్రీ మునిమాణిక్యం గారిచే రచింపబడి ఆదర్శ గ్రంథ మండలి వారిచే ప్రచురింపబడిన తిరుగుబాటు నాటకాన్ని జనవరి 15 వ తేదీన ప్రదర్శించారు. నాటకంలో మతం మైకంతో చేసే అన్యాయాలు, దేవుని పేరుతో చేసే మోసమూ, పెత్తందారుల నిరంకుశత్వమూ, షాహుకార్ల దురహంకారము కళ్ళకు కట్టినట్లు చూపబడ్డాయి. కర్షక కార్మికుల కోరికపై నాట్య మండలివారు యలమర్రులోనే మరల 23 వ తేదీని తిరుగుబాటును ప్రదర్శించారు. నవయుగ నాట్యమండలి వారు ఫిబ్రవరిలో జిల్లాలోని పెద్ద గ్రామములందు ప్రదర్శనములు ఏర్పాటు చేయ నిశ్చయించుకొన్నారు. ఇట్టి నాటకాలు కర్షక కార్మికులలో అత్యద్భుతమైన చైతన్యం కల్గిస్తాయి అని అనటంలో సందేహంలేదు. నవయుగ నాట్యమండలివారు నూతన ఆదర్శంతో ఇట్టి నాటకముల ప్రదర్శనమునకు నడుముకట్టి ప్రజాసేవ చేయుట ఎంతయు మెచ్చదగినదై యున్నది.

(ఒక విలేఖరి)

* * *

పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెసు సంఘ సమావేశము

20—1—39 వ తేదీన తణుకులో జిల్లా కాంగ్రెసు సంఘ సమావేశము శ్రీయుత ముదుగంటి జగ్గన్నశాస్త్రి గారి అధ్యక్షతను సమావేశమయ్యెను.

1. మద్రాసు కోర్టుల మంత్రి రామన్‌మీనన్‌గారి అకాల మరణమునకు సానుభూతిని తెల్పుచూ తీర్మానించ బడెను.

2. మన జిల్లాలో కాంగ్రెసు సేవకులున్నూ, యువకులున్నూ, గత సంవత్సరం మన జిల్లా కాంగ్రెసు సంఘ రధ్యక్ష కార్యదర్శులున్నూ, అగు శ్రీయుతులు ఆల్లూరి సత్యనారాయణగార్లపైన రాష్ట్ర సంఘమువారు విధించిన ఆంక్షను వెంటనే తొలగించవలసినదిగా ఈ సభవారు రాష్ట్ర సంఘమువారిని కోరుచున్నారు.

3. త్రిపుర కాంగ్రెసు ఎన్నికల సందర్భమున రాష్ట్ర సంఘములు నియమించినటువంటిన్ని జిల్లా ఎన్నికల ఉపసంఘ సధ్యక్షులును అగు ముదుగంటి జగ్గన్నశాస్త్రి గారి ఆజ్ఞలకు వ్యతిరేకముగా చించినాడ, దగ్గులూరు, చిట్టవరం పోలింగులలో పేరలల్ ఎన్నికలు జరిపిన బాపిరాజుగారి చర్యలను ఖండించుచు తగిన విచారణ చేసి తగు చర్య తీసుకొనవలసినదిగా యీ సభవారు రాష్ట్ర సంఘమువారిని కోరుచున్నారు.

(స్వకీయ విలేఖరి)

* * *

నూతన పుస్తక భాండాగార స్థాపనము

రాజోలు తాలూకా మోరి గ్రామంలో శ్రీమంతులగు జాన శంకరయ్యగారు తమ జనక తండ్రి గారి జ్ఞాపకార్థము ఈరోజున (23-1-30) "శ్రీ నాగయ్య పుస్తక భాండాగారము"ను స్థాపించిరి. విఘ్నేశ్వరపూజ. సరస్వతీ పూజలు జరిగించిన పిమ్మట సుమారు రెండువేల పుస్తకములతో భాండాగారము స్థాపింపబడినది. ఈ సందర్భమున మ॥ రా॥ రా॥ శ్రీ గోపరాజు వేంకటాచలపతిరావుగారి అధ్యక్షత క్రింద సభ సమావేశ మయినట. సుమారు 100 మంది ముఖ్య పౌరులు హాజరయిరి. అధ్యక్షుని యుపన్యాసాంతమున, శ్రీ రుద్రరాజు వెంకట రామరాజు, చింతా శివాచార్యులు గార్లు ఉపన్యసించిరి. నిబంధన లంగీకరింపబడిన పిమ్మట జాన శంకరయ్యగారధ్యక్షులుగను, గోపరాజు వేంకటాచలపతిరావుగా రుపాధ్యక్షులుగను, కాటపర్తి వీరభద్రానంద శర్మగారు కార్యదర్శిగను, చింతా వీరభద్రయ్య, రుద్రరాజు గార్లు కార్య నిర్వాహక వర్గ సభ్యులుగను ఎన్నుకొనబడిన పిమ్మట సభ ముగించబడెను. సభ్యులకు ఫలహారము లొసంగబడెను.

కాటపర్తి వీరభద్రానందశర్మ
కార్యదర్శి

* * *

బెజవాడ ప్రెస్ వర్కర్సు యూనియన్

బహిరంగ సభ

27-1-39 తేదీ సాయంత్రం 6 గంటలకు కామ్రేడ్ మున్నంగి మల్లిఖార్జునరెడ్డి (ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ సహాయ కార్యదర్శి) అధ్యక్షత క్రింద తిలక్ పేట చౌకులో బహిరంగ సభ జరుపబడెను.

హో అందు కో ప్రెస్ కార్మికుల పట్ల, మద్రాసు పోలీసు దుండగీడుల పట్ల నిరశన తెలుపుతూ కార్మిక నాయకులు ఉపన్యసించిరి. ఊరేగింపు జరిగినది.

తీ ర్మా న ము

మద్రాసు పోలీసు అధికారులు "హో అందు కో" పనివారు సమ్మె చేయుచున్నప్పుడు 39 మందిని అరెస్టు చేసినందులకు పోలీసుల చర్యలను నిరశించుచూ అరెస్టు చేసిన ప్రెస్ కార్మికులను వెంటనే విడుదల జేయవలయుననియు, కామ్రేడ్ యస్. సోమేశ్వరరావుగారిని వెంటనే విడుదల చేయవలెనని మద్రాసు కాంగ్రెసు మంత్రి వర్గమువారిని యీ సభవారు కోరుచున్నారు.

నిజాంపట్నం ప్రాంతపు పల్లెకారుల దుస్థితి

ఫారెస్టు, ఫిషరీ ఆఫీసర్ల అక్రమాలు

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ., బి. ఎల్.

లంచగొండితనం. నిర్మూలనా శాసనం అత్యవసరము.

జమీందారీ రైతు రక్షణ వారంలో ఈ నెల 17 వ తేదీన రేపల్లె తాలూకా నిజాం పట్నం వెళ్ళుట తటస్థించినది. అప్పుడు నిజాం పట్నం, నిజాం పట్నమునకు దగ్గర ఊళ్ళలోని కొన్నివేలమంది పల్లెకార్ల యొక్క పరిస్థితులు వారిలో కొంతమంది పెద్దలు నాతో చెప్పారు. వారు చెప్పిన విషయములు చాల ఘోరముగా ఉండుట వల్ల, ఇంకా కొంచెం ఎంక్వైరీకూడా చేశాను. కళ్ళారా చూచిన విషయములు యిక్కడ తెలియబరుస్తున్నాను.

ఒక్క నిజాం పట్నంలోనే దాదాపు 3000 మంది పల్లెకార్లున్నారు. వీరందరు అగ్నికుల క్షత్రియు లని పిలువబడుచున్నారు. సముద్రము ప్రక్కనే వరుసగా నిజాం పట్నం చుట్టూ వీరి ఊళ్ళు చాలా గలవు. వీరి జీవితాలను గురించి అందరు తెలుసుకొనుట చాల అవసరము.

నిజాం పట్నంలోని 3000 మందిలో నూటికి 90 వంతులు వారికి భూమి; వ్యవసాయములతో సంబంధం లేదు. ఎల్లప్పుడు సముద్రంమీద, ఉప్పుటేర్లమీద చేపలు పట్టుకొని నివసించవలసినదే. కట్టుకొనుటకు గుడ్డలు కూడ లేక, గట్టిగా రెండు పూటలు గంజి కూడ లేకుండా, గూళ్ళలాంటి గుడిసెలలో నివసించుచున్నారు. నేను వెళ్ళిన రోజున చలి జాస్తిగా ఉండుట వలన, రెక్కలు ముడుచుకొనిన పక్షుల్లాగ చుట్టూ చేరారందరు.

ఇటువంటి బీదవాళ్ళ మీద ఫారెస్టు, ఫిషరీ ఆఫీసర్ల దుండగాలు చూడండి.

ఫారెస్టు డిపార్టుమెంటు—లంచగొండితనము.

(1) నిజాం పట్నానికి ఒకఫర్లాంగు దూరములో పలే ఫారెస్టు డిపార్టుమెంటుకు చెందిన అడవి ఉన్నది. దీని చుట్టు ఏ ఆవరణ లేకపోవుటవలన, పల్లెకార్ల గొడ్లు మేత కొరకు అడవుల్లోకి పోతూ ఉంటవి. గొడ్లు మేయుటకై పన్ను పుల్లరి అడవుల డిపార్టుమెంటు విధిస్తుంది. గొడ్డొకటింటికి ఒక రూపాయి చొప్పున. ఈ రూపాయి చెల్లించినట్లుగా అధికారులు ఇచ్చేరశీదు ఎప్పుడన్నా గొడ్లకాపరే మరచిపోయి, ఏ సమయములోనైనా చూపించ లేకపోతే, గొడ్డు ఒకటింటికి 8 అణాల చొ॥ లంచం తీసుకొని అడవిలోనికి పోనిస్తారు. మామూలుగా రసీదు చూపించలేకపోతే, బందిలి దొడ్డిలో పెట్టాలి. బందిలి దొడ్డిని గూడ ఉపయోగిస్తున్నట్లు డిపార్టుమెంటువారికి చూపించుటకు అప్పుడప్పుడు గొడ్లను బందిలి దొడ్లోకి తోలుతారు. దొడ్డినుంచి విడిపించుకొనుటకు, 4 రూపాయలు మొదలు 6 రూపాయలవరకు చెల్లించాలట! యింత ఎక్కువ అయిన ఫీజులు, అధికార్ల లంచగొండితనము పోవాలని అందరు గగ్గోలు పెట్టారు.

(2) ఈ బీద జనం కట్టెలు కొనుక్కోటం చాల దుర్లభమయిన విషయం. ఇతర భాగ్యవంతుల పలె, నాన్‌రిజర్వు అడవిలోనుంచి పుడకలు ఉచితంగా తెచ్చుకోవచ్చుగాని, నిజాం పట్నం అడవులలో నాన్‌రిజర్వు అడవులు అరుదు. ఈ స్థితి చూచి, అడవి ఆఫీసర్లు ఊరి మొత్తంమీద 60, 70 రూపాయలు వసూలుచేసి, వారమునకు ఒక పర్యాయము ఒక మోపు పుల్లలను అడవిలోనుండి తీసుకువెళ్ళ నిస్తున్నారు. ఈ చెల్లించిన మొత్తమునకు రశీదు లివ్వకపోవుటవల్ల, ఈడబ్బంతా ఆఫీసర్ల జేబుల్లోకి పోతున్నదన్నమాట! ఇంతేకాదు! పై ఏర్పాటు ప్రకారం పుల్లలు తెచ్చుకొంటున్నపుడు, తరచుగా ఆపి, ఆఫీసర్లు 8 అణాలనుంచి రూపాయి వరకు జరిమానా విధిస్తారట! దీనికి రసీదులు లేవు. ఈ కారణంవల్ల ఈ వేలమంది బీద ప్రజలకు ఉపయోగమగునట్లు కొంత అడవిని నాన్‌రిజర్వు చేయిస్తే మరి కష్టం తీరుతుంది.

(3) అడవిలోని "మాడ" చెట్టుయొక్క ఆకు గొడ్లకు మేతగా ఉపయోగిస్తుంది. ఇదివరలో యీ ఆకును "చిక్కం" ఒకటింటికి కాని చొప్పున అమ్మేవారు. ఇప్పుడు చిక్కం అణా చొప్పున విధిస్తున్నారు. వేరే మేత తెచ్చుకొనుటకు వీలులేక, ఈఅణా రేటును భరించిలేక, ఇబ్బంది పడుతున్నారు అందరు.

వీరి కష్టాలు: ఫిషరీ డిపార్టుమెంటు.

(1) ఈ బీద ప్రజలు చేపలు పట్టుటకు కాలవలలో పన్నితే, ఇతర ప్రజలు, ముఖ్యంగా క్రిష్టియన్లు సంఖ్యాబలమెక్కువగుటవల్ల, ఈ వలలను అడ్డుగొట్టి, సగంపైగా పడ్డ చేపలను లాగివేయుచున్నారు. స్వేచ్ఛగా నీటి పారుదల గల కాలవలలో చేపలు పట్టుకునే హక్కు అందరికి ఉన్నప్పుడు, ఈ అడ్డుగొట్టటం చూచి డిపార్టుమెంటువారు తటస్థంగా ఉండుట ఆశ్చర్యంగా ఉన్నదని చెప్పినారు.

(2) సముద్రంమీదికి వెళ్ళునపుడు చేపలను క్యూర్ చేయుటకై ప్రతి చోటులోను కొంత ఉప్పును తీసుకు వెళ్ళుట అవసరం. సముద్రం మీదికి ఈ విధముగా ఉప్పును తీసుకొని వెళ్తున్నందుకు చోటు ఒక్కటికి 1 రూపాయి చొప్పున ఫిషరీ డిపార్టుమెంటు అధికార్లు వసూలు చేస్తున్నారు. దీనికి రసీదులు లేవు. నిస్సందేహంగా లంచగొండి తనం క్రిందకే వస్తుంది.

పైన వ్రాయబడినవన్నీ వాళ్ళ కష్టాలలో కొన్ని. సాధారణంగా జీవితావసరములకుగాని, ఏ పన్ను కట్టుటకుగాని, ఆఫీసర్లకు లంచమిచ్చి తృప్తి పరచుటకు గాని, బందిలి దొడ్డిలోనుంచి గొడ్డును బయటకు తెచ్చుకొనుటకుగాని, అప్పు కొరకు నిజాం పట్నం షాహుకారు దగ్గరకు వెళ్తే, అతడు నిర్దయతో హెచ్చు వడ్డీలకు (కొన్ని కేసులలో నూటికి నెలకు రు. 6—4—0 చొప్పున కూడ) అప్పు నిస్తాడు. వడ్డీ తీరకపోగా అసలు అలాగే మిగిలి ఉంటాయి సంవత్సరాల పర్యంతరం. నిరంతరం అప్పు జీవితమై పోయింది ఈ పల్లెకారుని విషయం.

ఇటువంటి పరిస్థితులలో, నిజాం పట్నంకు ఒక మైలులోగా కొన్ని వందల ఎకరంభూమి ఉన్నందువలన, అందులో కొంత భాగం జిరాయతీకి, ఇళ్లు కట్టుకొనుటకు గ్రాంటు చేయమని ఇదివరలో ప్రభుత్వమునకు పిటీషన్లు పెట్టారట. జవాబులు లేవు. నివసించటానికి సరియైన ఇళ్ళు లేక, సముద్రము మీద భద్రతలేని జీవితాలని గడుపుతూ, ఆఫీసర్ల లంచగొండితనానికి, షాహుకార్ల వడ్డీపిపాసకు గురిఅగుతూ రోజు రోజుకు అధోగతికి వస్తున్నారు. కొన్నివేల మంది కష్టజీవులయిన పల్లెకార్లు యీ ప్రాంతములో. అగ్నికుల క్షత్రియులని పిలుచుకొనే వీరిలోనుంచి అసంతృప్తి అనే అగ్ని కొద్దికాలంలోనే బయలుదేరుతుందంటే ఆశ్చర్యం లేదు.

దీనికి అప్పుడప్పుడు ఎవరు జవాబుదారీ అవుతారో! ఇప్పుడుమట్టుకు వారి అర్థికపరిస్థితులే మూల కారణమవుతుందని అనుకోవాలి. లంచగొండితనం, దోపిడి, కాంగ్రెసు మంత్రు లున్నప్పుడే, హద్దు లేకుండా, యీ విధంగా సాగుతున్నదంటే, కాంగ్రెసు మంత్రివర్గము లంచగొండితనం నిర్మూల శాసనం గూడ శాసనసభలో త్వరగా ప్రవేశపెట్టాలని అందరూ కోరాలి. ఆఫీసర్లకు తగినంత లంచమిస్తే, అడవులన్నీ స్వాధీనమే చేసుకోవచ్చునని ఒకముక్క చెప్పారు ఈ వేలమంది బీద జనం ఏక కంఠంతో.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

నెలకు 20 అం॥ లోపల అంగుళానికి	రూ. 0—6—0
,, 20" అం॥ పైన ,,	0—4—0
,, 100" అం॥ పైన ,,	0—3—0
పేజీ	రు 10—0—0 లు
½ పేజీ	6—0—0 లు
¼ పేజీ	3—0—0 లు

షరా:—ఈ రేట్లుపైన కమిషన్‌లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు. 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

చందాదారులను చేర్పించాలి!

జనవరిలో ఈ క్రింది విధంగా జేర్పించాలని క్రొత్తగా మరో లిస్టు ఇచ్చినాం. ఈ "కోటా"ను పూర్తి అయేటట్లు పార్టీ సభ్యులు, సోషలిస్టు అభిమానులు, ప్రజాసామాన్యము పని చేస్తారని ఆశిస్తున్నాం. ముఖ్యంగా పార్టీసభ్యులు తీవ్రంగా పనిచేసి కోటా పూర్తిచేస్తారని నమ్ముతున్నాం.

	జనవరి నెల కోటా	చేర్పించినది.
విశాఖపట్టణం	5	5
తూ. గోదావరి	30	11
ప. గోదావరి	50	14
కృష్ణా జిల్లా	50	63
గుంటూరు	30	29
నెల్లూరు	20	11
రాయలసీమ	10	7
ఇతర స్థలాల్లు	5	4
	200	144

బర్మా ప్రజల స్వాతంత్ర్య పోరాటం

విద్యార్థులే పోరాటానికి నాయకత్వం వహించారు

కామ్రేడ్ చంద్రం

భారత దేశానికి నూతన రాజ్యాంగ విధానం ప్రసాదించినపుడే, బర్మాను వేరుచేసి ప్రత్యేక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు చైతన్యం పొందుచున్న భారత దేశంతో బర్మా కలసివుండుట నష్టమనుకొన్నారు. నూనె గనులు, కలప ఫ్యాక్టరీలలో పెట్టిన బ్రిటీషు పెట్టుబడిని కాపాడుకోటానికి బర్మా వేరుగా వుండుట మంచిదనుకొన్నారు. కాని చరిత్రలో దోపిడిగాండ్రు తమకు భద్రమని ఏర్పాటుచేసికొన్న ఉక్కు చట్రాలను పెకల్చుకొని పీడితుల ఆర్తనాదం లెక్కలేనన్ని సార్లు బయల్వెడలాయి. ఎన్నో సార్లు తొక్కివేయబడిన ప్రజలు తలెత్తి తమ సంకెళ్ళను త్రెంచుకొనే ప్రయత్నాలలో జయం పొందారు.

1933 లో 'తారావడీ' విప్లవం, అణచివేయ బడినది. బ్రిటీషు ప్రభుత్వం తన వునికి ఖాయమని తలంచింది. 1935 ఇండియా ఆక్టుతోపాటు ప్యాసు చేయబడిన, గవర్నమెంటు ఆప్ బర్మా శాసనమును జాతీయ విద్రోహులు అమలు జరపపూనుకొన్నారు. డాక్టరు, బా-మా, (ప్రధాన మంత్రి) అతని అనుచరులు బ్రిటీషు ప్రభుత్వ శాసనాన్ని కొనసాగిస్తున్నారు. దోబామా అస్సాయన్ (బర్మా బర్మీయులకే సంఘం) చట్టాన్ని భగ్నం చేయడానికి. ప్రజా సామాన్యంలో కార్మికులు, రైతులలో పని చేస్తూంది. ఇంకా నిర్మాణ యుక్తంగా ప్రజా పోరాటం సాగించబడక పోయినా, అందులకు ప్రాతిపదిక యేర్పడింది.

నాల్గు నెలలనాడు పత్రికలలో విపరీతంగా ఘోషింపబడిన బర్మా కొట్లాటలు అనంతరం, బర్మా ప్రభుత్వం మత కలహాలను అణచడానికనే నెపంతో క్రిమినల్ లా సవరణ చట్టం ప్యాసు చేసింది. 144 సెక్షను ప్రయోగించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగింపబడే సత్రమాందోళనకూడా అణచివేయడానికి పూనుకుంది. సామాన్య పౌరసత్వ హక్కులనే అరికట్ట సాగింది.

నిరుద్యోగుల యాత్ర

బర్మా ఆయిల్ కంపెనీవారి యూనాన్‌యంగ్ నూనె గనులలో పనినుండి తొలగింపబడినకార్మికులు 4 వందల మైళ్ళ ప్రయాణం కాలి నడకను సాగించారు. తాటన్, పెగు జిల్లాల రైతులు 2 వందలమైళ్ళునడచి రంగూన్ చేరారు. వీరు మొత్తం 2 వేల మంది 8 వ తేదీ రంగూన్ చేరునప్పటికి ప్రజలు ఎదురేగి స్వాగతమిచ్చారు. బాలబాలికలు, కాలేజి విద్యార్థులు, బర్మా వాలంటీరుదళాలవారందరు స్వాగతంలో పాల్గొన్నారు.

నాల్గు నెలల క్రితం ఒండొరులపై కత్తులు దూసిన బర్మీయులు, భారతీయులు నేడు అందరికి ప్రధానమైన పోరాటాన్ని కొనసాగించడానికి కృతనిశ్చయులై చేయీ చేయీ కలిపి సోదరుల వలె నడచారు. వారు భారత జాతీయ పతాకమగు మూడురంగుల జండా, కొడవలి సుత్తి హత్తిన ఎర్ర జెండా, బర్మావారి నెమలి జెండాలు ధరించారు.

విద్యార్థుల సమ్మె

ఈ యాత్ర నాయకులను ప్రభుత్వం మార్గములోనే అరెస్టు చేసి జైలు కంపింది. యాత్రాదళము 144 వ సెక్షను ప్రయోగించింది. ఈ నాయకుల స్థానాన్ని అఖిలబర్మారంగూన్ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులుపూర్తి చేసారు. వారు కూడా జైలుకు పంపబడ్డారు. దానిపై విద్యార్థులు శాసనోల్లంఘనం ప్రారంభించారు. విద్యార్థి సమ్మె ప్రకటించబడింది. ప్రభుత్వ కార్యాలయాలను విద్యార్థులు పికెటింగు చేయ ప్రారంభించారు. దానితోపాటు ప్రభుత్వ నిర్బంధ విధానము ప్రారంభమయింది. పికెటింగు చేయువారిపై లాఠీచార్జీలు సాగాయి కాలేజీ బాలికలపై యూరపియన్ సార్జంట్లు ల్యాఠీచార్జి చేశారు. అడ్డుపడిన విద్యార్థి అంగ్-క్యా దెబ్బలకు మరణించాడు. యీ ఘోర దృశ్యాలన్నీ ప్రకటించిన వార్తాపత్రికలు నిషేధింపబడి, స్వాధీనంచేసుకోబడ్డాయి.

హంగర్ మార్చర్లు (నిరుద్యోగ యాత్రా దళము) రంగూను చేరుటతోడనే అంగ్-క్యా స్మారక చిహ్నానికి ప్రణతులు చెల్లించారు. వీరితో సీరియమ్ బర్మా ఆయిల్ కంపెనీ కార్మికులు, రంగూనులో రైతుమహాసభకు వచ్చిన రైతులు కలసారు. మొత్తము 4 వేల మంది, థాటన్ మున్సిపాలిటీ అధ్యక్షుడు థాకిన్ నాయకత్వాన ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు క్రమముగా, శాంతంగా సాగింది. యాత్రికులందరు ఘ్యాడగాన్ పెగోడా (బౌద్ధ దేవాలయం) ఆవరణలో వున్న ధర్మసత్రాలలో బస చేసారు.

వేలకొలది వున్న యాత్రికులకు రంగూన్ వాస్తవ్యులు ఆహారం సప్లయి చేస్తున్నారు. ప్రతి గృహస్థు తన తాహతును బట్టి ప్రతి ఉదయం అన్నము, కూర చేపలతో కూడిన ఆహారపు పొట్లాలను వీరికి పంపుతుంటారు. ప్రొద్దున్నే వందలకొలది స్త్రీలు ఆహారపు పొట్లాలు పుచ్చుకొని పెగోడాకు వచ్చి యిచ్చి పోతూవుంటారు. ఈవిధంగా వేలకొలది సమ్మెదారులు పోషింపబడుతున్నారు.

జనరల్ స్ట్రైక్

ప్రభుత్వం అన్ని కేంద్రాల్లోను సాయుధ పోలీసులను, తెల్ల సైనికులను కాపలా పెట్టింది. మింగ్లాడన్ కంటోన్‌మెంటు నుండి ఒక యూరోపియన్ సైనిక దళాన్ని రప్పించింది. మ్యాజిస్ట్రేటు లందరిని తయారీలో పెట్టింది.

బర్మా బస్సు యజమానులు, కార్మికులుకూడ ప్రభుత్వానికి ఆక్షేపణ తెలుపుతూ సమ్మె చేశారు. ఆర్. యి. టి. కంపెనీవారి బస్సు డ్రైయివర్లు హెచ్చు కూలి, జీతముపై సెలవు కోరుతూ సమ్మె చేశారు. దీనితో పట్టణములోని దాదాపు రాకపోకలన్నీ నిలచిపోయాయి. ఆంగ్లో హైందవ డ్రైయివర్లున్న బస్సు ఎపుడయినా ఒకటి కన్పిస్తుంది. అవీ సాయుధ పోలీసుల రక్షణతో మాత్రమే ఎగురుతూ వున్నాయి.

బర్మా దేశము అన్ని ప్రాంతాలలో స్కూళ్లు పికెటింగు చేయబడ్డాయి. విద్యార్థులు హాజరు గాక పోవుట ఎక్కువ భాగం స్కూళ్లు మూసివేయ బడ్డాయి. స్కూళ్ళలో ఉపాధ్యాయులే చాలమంది పికెటింగు ప్రోత్సాహిస్తున్నారు. ప్రభుత్వం అటుల చేయరాదని బెదరించినా లెక్క చేయుటలేదు. ప్రభుత్వ ఉద్యోగులే చాలమంది యీ ఉద్యమంతో సానుభూతి కలిగి వున్నారు. ఈ సంవత్సరం విశ్వ విద్యాలయం మార్చిలోనూ, జూన్‌లోనూ రెండు పరీక్షలు పెట్టదలచినట్లు తెలియవస్తూంది. ఇటుల 1936 లో ఒకసారి మాత్రం అప్పటి సమ్మెమూలాన రెండుసార్లు పరీక్ష పెట్టింది.

ఫ్యాక్టరీ కార్మికులు

ఈ సమ్మెలో ఫ్యాక్టరీ కార్మికులు కూడ జేరారు. 5 వేలమంది డాక్ కార్మికులు, అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ కార్మికులు (ఇందులో ఎక్కువమంది స్త్రీలు) సమ్మెలో చేరారు. కాని ఈ సమ్మె లన్నిటిలో ప్రధానమైన ఆర్గనైజేషను లేకపోవుట మొత్తం సమ్మెదారులు 6 వేల మంది పెగోడాలో ఇపుడు ఉంటున్నారు.

ప్రభుత్వ నిర్బంధ విధానం

ప్రభుత్వం యీ ప్రజా ఉద్యమాన్ని నిర్బంధ విధానంతో అణచివేయ ప్రారంభించింది. పత్రికా కార్యాలయాలు సోదా చేయబడినాయి. పోలీసుల దౌర్జన్యాలపై వ్యాసాలు, చిత్రాలు ప్రకటించిన పత్రికలు జప్తు చేయబడ్డాయి. దో-బామా పార్టీ పత్రిక "సన్" ఆపుచేయబడింది. కొన్ని పత్రికలకు ధరావతులు కోరబడ్డాయి.

దో-బామా పార్టీ కార్య సంఘ సభ్యులందరిని ప్రభుత్వము అరెస్టు చేసింది. వారిపై శాసన నిర్మితమైన ప్రభుత్వాన్ని దౌర్జన్యంగా పడదోయ సంకల్పించారని ఆరోపించబడింది. సైనికులు రంగూను పట్టణ బజారులో గస్తీ తిరుగుతున్నారు. రంగూనుకు బయటి నుండి వచ్చు మార్గాలన్నీ అరికట్ట బడ్డాయి. రోజూ వర్కర్లు అరెస్టు చేయబడుతున్నాయి.

బర్మా ప్రజలలో చైతన్య కలిగింది. ఇక ఆర్గనైజేషను కావాలి. సంయుక్త జాతీయ సంఘటనకు కార్యక్రమం కావాలి

బ్రిటీషు సామ్రాజ్య వాదులు ఆశించినటుల యిండియా నుండి బర్మాను విడదీయుటచే సంతృప్తి జెందలేదు బర్మా దేశీయులు. చైతన్యం పొందిన ప్రజా సామాన్యం బర్మా స్వాతంత్ర్యం కొరకు, బ్రిటీషు సామ్రాజ్యంతో సంబంధములేని స్వాతంత్ర్యము సంపాదించుట కొరకు పోరాటం ప్రారంభించారు. బ్రిటీషు దోపిడి విధానంనుండి విముక్తి పొందుటకు భారతీయులతో కలసి పోరాడుతారు.

గొరిల్లాలే చైనాకు జయం చేకూరుస్తున్నారు!

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

మనం వార్తా పత్రికలలో చదువుతూ జపానుసైన్యాలుచైనాలో చాలభాగాన్ని ఆక్రమించాయని దురభిప్రాయం పడుతున్నాం. జపాను సైన్యాలు పెద్ద పెద్ద పట్నాలను జయించుతూ రైల్వేలైనులను ఆక్రమించుతూ, ఒకొక్క పట్నానికి కొద్దిమంది సైనికులను వదలిపెట్టుతూ పోతూవున్నవి. అనామతు గవర్నమెంటులనుగూడ ఏర్పరచు చున్నవి. కాని పల్లెటూళ్లన్నీ స్వతంత్రంగానేఉన్నవి. అనామతుగవర్నమెంటు లక్రిందకు రాలేదు.

8 వ రూటార్మీకిచెందిన గొరిల్లాలు ఆప్రదేశములలో రిపబ్లిక్కులను స్థాపించుచూ జపాను యొక్క పరిపాలనను రైల్వేలైనులను, పట్నాలను దాటిరానీయకుండా చేస్తున్నారు. రాత్రిపూట రైలు పట్టాలను తెగగొట్టి, రైలుబళ్లను కొల్లగొట్టుట, తక్కువ జపాను సైనికులున్న పట్నాలను వశపరచుకొని, జపాను సైనికులను చంపుట మొదలగు పనులను చేయుచున్నారు. ఇదివరకు 40 సైనికులచే కాపాడబడుచున్న పట్నాలు ఇప్పుడు 2000 జపానుసైనికులచే కాపాడబడవలసి వస్తున్నది. ఈ విధంగా చాలమంది జపానుసైనికుల యుద్ధరంగములోనికి రానీయకుండా గోరిల్లా సైనికులు చేస్తున్నారు.

బోర్డరు గవర్నమెంటు

1938 జనవరి నెలలో జపాను సేనలవెనుక ఉత్తరచైనాలో తూర్పుననున్న షాన్సీ, ఛాహార్ హోపే రాష్ట్రాలతోగూడిన బోర్డరు రిపబ్లిక్కు 8 వ రూటార్మీచే స్థాపింపబడినది. ఈ ప్రభుత్వం క్రింద 1 కోటి 40 లక్షల ప్రజలు ఉన్నారు. ఈగవర్నమెంటుకుఅధ్యక్షుడు 'నీజంగుచేను' అను ఎలెక్ట్రికు ఇంజనీరు. దీనిని రక్షించడానికి 5 లక్షల ప్రజాసంరంక్షక సైన్యం ఉంది. దీనిలో నాల్గవభాగమునకు మాత్రం తుపాకులున్నవి. తక్కిన వారందరికి జపాను సేనలను కొల్లగొట్టి తుపాకులను నెమ్మది నెమ్మదిగా సంపాదించుచున్నారు. ఈ రాజ్యంలో పోస్టాఫీసులు, రేడియోలు వార్తా పత్రికలు, స్కూళ్లు, హాస్పిటలులు చాలాఏర్పరుపబడినవి. ప్రజలకు, స్వరక్షణోపాయాలు నేర్పబడుచున్నవి, అవిద్యరూపు మాప బడుతోంది. ఈ రాజ్యం జపానుసేనల మధ్యనున్న చైనా ప్రజలస్వర్గం అని చెప్పవచ్చును.

ఈ గవర్నమెంటును ఏర్పరచింది కమ్యూనిస్టు గొరిల్లాలైనప్పటికీవారుసోవియటు ప్రభుత్వాన్ని స్థాపించలేదు. కొమింటాంగుతో చేసుకొన్న ఒడంబడిక ప్రకారమే నడచుచున్నారు. జాతీయైక్య సంఘటన పాలసీని తూ,చా తప్పకుండ అవలంభించుచున్నారు. అప్పులమీద మారుటోరియం ప్రకటించారు. పొలం కట్టుబళ్ళను తగ్గించారు. అక్కడనుండి పారిపోయిన జమీందార్ల భూములను బీద రైతులకు పంచి ఇచ్చారు. ఆ ప్రదేశాలనుండి ప్రత్తి, పొగాకు విరివిగా ఇదివరకు జపానుకు సప్లయి అవుతుండేది. ఆ పంటలకు బదులుగా తినుబండారములను పండించునట్లు చేశారు. ఇంతేగాక జపానువారికి పనికివచ్చే పదార్థాలను పోనీయడంలేదు. జపాను వస్తువులను కొనకుండా చేశారు. ప్రత్యేకంగా బాంకునుపెట్టి కరెంసీ నోట్లునువేసి, జపానుచే ఏర్పరుపబడిన అనామతు ఫెడరల్ గవర్నమెంటుయొక్క కరెంసీని చలామణి కాకుండా చేశారు. ఈ గవర్నమెంటు బాధను భరించలేక జపానువారు 80 వేల సైన్యాలను ఈ గవర్నమెంటును అణచుటకు పంపారు. ఈ సైన్యం దారిలో చాల కష్టాలుపడి, చాల సైన్యమును కోల్పోయి చివరకు గవర్నమెంటుకు ముఖ్య పట్టణమైన 'వూచైషాను'ను 7000 సైన్యాన్ని నష్టపరచుకొని వశము చేసుకొన్నారు. కాని గొరిల్లా సైన్యాలు ఇళ్లు పంటలు మొదలయినవాటిని నాశనం చేసి తమ గవర్నమెంటును ఇంకొక చోటుకు మార్చారు. అందువలన జపాను సైన్యాలు తమకు కావలసిన పదార్థములనన్నిటినీ చాల దూరమునుండి తెప్పించుకోవలసి వచ్చింది. చివరకు విసిగి తమ పనిని చాలించి తిరిగి వచ్చివేసినవి. గొరిల్లాల నణచివేశామని డంబాలు కొట్టుతున్నాయి. కాని గొరిల్లాలు తమ గవర్నమెంటును సాగించుచున్నట్లు, జపానువారిని మరల వేధించుచున్నట్లు వార్తా పత్రికలు వ్రాస్తూనే ఉన్నవి.

8 వ రూటార్మీ గెలుపొందుటకు కారణాలు

8 వ రూటార్మీ జయంపొందటానికి కారణము బూర్జువా సైన్యాల యుద్ధ పద్ధతులకూ, గొరిల్లా యుద్ధ పద్ధతులకూ భేదముండుటయేగాక, రెండు సైన్యాల లోపలి నిర్మాణము, ప్రజలతోటి సంబంధము మొదలైన వాటిలో పరస్పర విరుద్ధము ఉండుటగూడ కారణం.

8 వ రూటు ఆర్మీలో ఆఫీసర్లకూ సైనికులకు దుస్తులలోగాని, భోజనముగాని, ఇతర సౌకర్యములోగాని ఎట్టి భేదంలేదు. ఆఫీసర్లు సామాన్య సైనికుని మర్యాదయైన 'కామ్రేడ్' అనే పదముతో పిలువాలి. సైనికులుకూడా ఆఫీసర్లను కామ్రేడ్ అని పిలుస్తారు. అందువలన ఆఫీసర్ల యందు సైనికులు ప్రేమతో మెలగుతారు. బూర్జువా ప్రభుత్వ సైన్యములలో సైనికునకు ఆఫీసర్లకన్న చవుక దుస్తులు, భోజనం ఉండును. ఆఫీసర్లకు అన్నిభోగాలు ఉండును పైగా ఆఫీసర్లు సైనికులను నీచ పదములలో సంబోధించి తిట్టుతారు. ఒక్కమాటతో చెప్పవలెనన్న కూలీకి మిల్లుయజమానికి ఉన్న సంబంధం ఆఫీసరునకు సైనికునకు మధ్య ప్రతిబింబించిన దని చెప్పవచ్చు. అందువలన సైనికులకు ఆఫీసర్ల యెడ ప్రేమభావము ఉండదు.

ప్రజలకు 8వ రూటార్మీకి అవినాభావ సంబంధం ఉంటుంది. గొరిల్లా సైనికులు ప్రజలను నిర్బంధ పెట్టరు, కొల్లగొట్టరు, దూషించరు. ఎవరైనా అలా చేస్తే వారికి తుపాకితో కాల్చి చంపడమే శిక్ష. పూర్వపు సోవియటు చైనాకు అధ్యక్షుడూ, ఇప్పుడు రాష్ట్రగవర్నరు, ఆయిన కమ్యూనిస్టు మావోసెయాంగ్ మిలిటరీ కళాశాలలో మట్లాడుతూ ఈవిధంగా చెప్పాడు. "రైతులవద్దనుంచి ఒక్క బంగాళాదుంప ముక్కైనా తీసుకొనగూడదు. ఎందుకనగా నీవుఒక్క ముక్క తీసుకుంటే ఎక్కువ తీసుకోకుండా ఉండలేవు" అంతేగాక ప్రజలకు రాజకీయచైతన్యం వచ్చేలా చేస్తారు, వారికి మిలిటరీ శిక్షణఇస్తారు. వారిని ప్రజాసంఘాలుగా ఏర్పరుస్తారు. జాతీయ ద్రోహులను, ప్రజలను పీడించేవారిని అణచుతారు. అందువలన ప్రజలకు 8 వ రూటార్మీ అంటే ప్రేమ. వారు గొరిల్లాకు వార్తలను జేరవేస్తారు. గొరిల్లాలు దాగుకొన్నచోట్లు జపాను సైన్యాలకు ఎంతబాధించినా చెప్పరు. కాని జపానుసేనల ఆచోకీ అంతా గొరిల్లాకు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు. భోజనసౌకర్యాలు చేస్తారు, సైన్యంలో ఖాళీ అయినచోట్లు భర్తీ చేస్తారు, దెబ్బలు తగిలిన వారికి శుశ్రూషచేస్తారు. జపాను సైన్యాలను వెనుకతట్టుగావచ్చి ఎదిర్చి విసిగించుతూ గొరిల్లాలకు సహాయంచేస్తారు.

బూర్జువా ప్రభుత్వసైన్యాలు ప్రజలను కొల్లగొట్టుట అవమానంచేయుట ప్రజలకు వ్యతిరేకంగా దోపిడిగాండ్రకు సహాయంచేయుట వలన ఆసైన్యాలకు ప్రజల సహాయము సానుభూతి ఏమాత్రం ఉండదు.

8వ రూటార్మీలో ప్రతిసైనికుడూ రాజకీయ విషయములను గూర్చి తెలుసుకొంటాడు. నిత్యమూ వార్తా పత్రికలను చదువుతాడు. తాను ఎందుకు పోట్లాడుతున్నాడో, ఎవరికొరకు పోట్లాడుతున్నాడో తెలుసుకొని ఉత్సాహంతో పోరాడుతాడు. ప్రతిరోజూ 2 గంటలు రాజకీయములను కూర్చిన క్లాసులు ఉంటవి. యుద్ధసమయ మందుగూడా వీలున్నప్పుడు రాజకీయాలను చెబుతారు.

8 వ రూటార్మీలో ఒక పొలిటికల్ డిపార్టుమెంటు ఉంటుంది. దానిలో అయిదు భాగాలుగా ఉన్నవి.

(1) ఆర్మీయొక్క నిర్మాణమునుగూర్చి జాగ్రత్త తీసుకొనేది (2) విద్యను గూర్చినది (3) ప్రజా ఉద్యమానికి సంబంధించినది (4) విరోధి సైన్యాల విషయములను గూర్చి తెలుసుకొనునది (5) జాతీయ విద్రోహులను కనుక్కొని వారిని అణచునది.

ప్రతి కంపెనీకి ఒక పొలిటికల్ డైరెక్టరుంటాడు. ఇతడు కంపెనీ అడిగినప్పుడు రాజకీయాలను గూర్చి చెబుతాడు. చర్చించుతాడు. యుద్ధమునకు పూర్వము ఆఫీసర్లను పిలచి రాబోవు యుద్ధంయొక్క ప్రాముఖ్యతను గూర్చి చెబుతాడు, ఆఫీసర్లుపోయి సైనికులకు ఈ విషయాలు తెలుపుతారు. ఈ విధంగా రాబోవు యుద్ధంయొక్క ప్రాముఖ్యత సైనికులకుగూడ తెలుస్తుంట. 8 వ రూటు ఆర్మీలో రాజకీయాలేగాక నాగరికతాభివృద్ధికిగూడ చాల అవకాశాలు ఉన్నవి. అందులో ఆటల క్లబ్బులు, సంగీత, నాటక, వార్తా పత్రిక సమాజాలు ఉంటవి.

8 వ రూటార్మీ ఇతర బూర్జువా సైన్యాలవలె యుద్ధములో పట్టుకొనబడిన శత్రు సైనికులను చంపదు. వారికి నిజ విషయాలు చెప్పుతారు. వారిని మర్యాదగా జూస్తారు. వారి మనస్సు మారితే మత

(మిగతా 22 వ పేజీలో)

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహా సభ

(15 వ పేజీ తరువాయి)

జనరల్ స్ట్రయికు

2. విద్యార్థుల ప్రధాన కష్ట నిష్ఠురములను తొల గించుకొనుటకై రాష్ట్రి మంతటా జనరల్ స్ట్రైకును నిర్వహించుటకు వివిధ పరిస్థితులను పరిశీలించి, కార్య నిర్వాహకవర్గమునకు సలహానిచ్చుటకును, ప్రభుత్వము నకు-తదితర అధికారులకు విద్యార్థుల అవసరములను నివేదించి తగు ప్రచారము చేయుటకు, యీ సభవారు యీ క్రింది ఉపసంఘమును నియమించుచున్నారు:

1. కొట్రగడ్డ రాజగోపాలరావు
2. జి. నరహరి
3. పి. రామకోటీశ్వరరావు
4. యం. రాఘవేంద్రరావు
5. పి. వెంకటేశ్వరరావు

(వీరు గాక మరొక యిద్దరిని కోఆప్టు చేసుకొను టకు అధికార మివ్వబడెను)

జనరల్ స్ట్రయికును డిటెన్షన్ పద్ధతి, విద్యార్థి ఫెడ రేషన్‌ను గుర్తించుట, రోజుకు ఒక పరీక్ష పత్రమునే పెట్టుట, వీటి మీద ఆందోళన జరుపవలెనని తీర్మానిం చుచు సమయానుకూలముగ ఒకటి లేక రెండు ముఖ్య మైన కోర్కెలను చేర్చు హక్కును ఈ సభ వారు కార్యనిర్వాహక వర్గమున కిచ్చుచు, యీ క్రింది సూచ నలను పాటింపవలెనని కోరుచున్నారు:

(ఎ) సభలను జరిపియు, కరపత్రములను ప్రచు రించియు, విద్యార్థుల హక్కు ప్రాధాన్యతను అందరికిని తెలియజేయుట.

(బి) ప్రాథమిక సంఘములను సరియైన పరిస్థితు లలో ఉంచుటకు 'ఎన్‌రోల్‌మెంటు వారము'ను సాధ్య మైనంత త్వరలో ఏర్పరుచుట.

(సి) ఇన్‌ఫర్మేషన్ బ్యూరో ఒక దాని స్థాపిం చుట.

(డి) సమ్మెల అవసరమును గురించి విరివిగా ప్రచారము చేయుట.

ప్రాథమిక హక్కులు

3. విద్యార్థుల యీ క్రింది ప్రాథమిక హక్కు లను నెరవేర్చవలసినదిగా మదరాసు ప్రభుత్వమువారిని విశ్వ విద్యాలయాధికారులను యీ సభవారు కోరు చున్నారు:

ఆంధ్రరాష్ట్రి విద్యార్థి ఫెడరేషన్‌కు అనుబంధిం ప బడిన విద్యార్థి సంఘములను గుర్తించుట; జీతాలు, పరీక్ష రుసుములు తగ్గించుట; అభివృద్ధి కరమయిన టెక్స్టు బుక్కులను ప్రచురించి, లాభములు పొంద కుండా తగ్గింపు ధరలకు విద్యార్థులకు సప్లయిచేయుట; పరీక్షలలో రోజుకు ఒకే పరీక్ష పత్రము; ఆంధ్రి విశ్వ విద్యాలయమువారిచే కొత్తగా ప్రవేశపెట్టబడిన ఆర్డినెన్సు లను తీసివేయుట: పబ్లిక్ పరీక్షలలో నూటికి కనీసము 75 మందిని ప్యాసు చేయుట: రిజిస్ట్రేషన్ రుసుము లేకుండానే విశ్వ విద్యాలయ పట్టభద్రులందరికీ సెనేటు ఎన్నికలలో వోటింగు హక్కు; ఎప్రెంటిస్ రుసుము ('లా' చదివినవారికి)ను రద్దు చేయుట: యుద్ధములలో నిర్బంధంగా పాల్గొనే షరతు లేకుండా, కోరిన హై స్కూలు విద్యార్థులకు ఉచిత వ్యాయామ శిక్షణ, కాలేజి విద్యార్థులకు సైనిక శిక్షణ యివ్వవలెను; స్కూలు ఫైనల్ పైపు రైటింగ్ పరీక్షను లోవర్ గ్రేడ్ పరీక్షతో సమానంగా గుర్తించుట: ప్రతి హై స్కూలులోను స్కూల్ ఫైనల్ పరీక్షల సెంటరును ఏర్పరచుట; డిటెన్షన్ పద్ధతిని తొలగించుట: టెక్స్టు బుక్కులను, ఉపాధ్యాయులను పదే, పదే మార్చ కుండుట; సెనేట్‌లో ఆంధ్రరాష్ట్రి విద్యార్థి ఫెడరేషన్ వారికి కూడ ఒక సీటు ప్రత్యేకించుట: ప్రవేశ పత్రము లలో ఉన్న కులము-మతము తెలియజేయు "కాలం"ను తీసివేయుట: స్కూలు ఫైనల్‌లో వయస్సు నియ మమును రద్దు చేయుట; యస్. యస్. ఎల్. సి., యితర తరగతులలోను, అనుమానము కలిగినప్పుడు పరీక్షా పత్రములను తిరిగి దిద్దించు ఏర్పాటు చేయుట

సమ్మెలు

4. గత రెండు సంవత్సరములనుంచీ రాష్ట్రమందు జరుగుతూన్న విద్యార్థి సమ్మెలు కొందరు ప్రజలచే అన వసరముగ విమర్శింపబడి, పెక్కు అపోహలకు కారణ మైనవి. కాని, నిర్వీర్యము, కేవలం నిరుపయోగము, అయిన నేటి బానిస విద్యావిధానము నెదుర్కొనుటకే ఈ సమ్మెలు చేయబడినవి. కావున ప్రాథమిక హక్కుల కొరకు విద్యాధికారుల నిరంకుశ చర్యలకు వెనుదీయక జయప్రదంగా సమ్మెలు జరిపిన రాష్ట్రిమునందలి విద్యా ర్థులను ఈ సభవారు అభినందించుచున్నారు.

విద్యార్థుల సహజ వికాసమునకు అడ్డు లేనంత వరకు వారికీ—ఉపాధ్యాయులకు సంఘర్షణ ఏమియు లేదు. తమ హక్కులను పొందుటకు విద్యార్థులు చట్ట సమ్మతమైన పద్ధతు లన్నిటి ద్వారా, అంటే రాయబా రములు మొదలైన విధముల ప్రయత్నించి, కోర్కెలు నెరవేర్చబడనియెడల సమ్మెను తుది ఆయుధముగా ఉపయోగించవలెను. సమ్మెలు చేయు ముందు విద్యా ర్థులు సభలద్వారా—కరపత్రములద్వారా తమ హక్కుల ఆవశ్యకతను ప్రచారము చేసి, ఆ యా జిల్లా విద్యార్థి సంఘముల అనుమతిని పొంది, సమ్మెలను ప్రారంభిం చవలెనని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

కాంగ్రెస్ అధ్యక్షత

5. కాకినాడలో సమావేశము కాబోయే కాంగ్రెసు ప్రతినిధులంతా సుభాష్‌బోసునే కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నుకోవలసినదని హెచ్చరిస్తూ ఒక ప్రతినిధి విషయ నిర్ణయ సభలో ప్రతిపాదించాడు. విద్యార్థులకూ యీ సమస్యకూ సంబంధం లేకపోలేదు. ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని విద్యార్థులు ఎదుర్కోవాలని సభలో యిదివ రకే తీర్మానించారు. ప్రభుత్వంతో రాజీలకు పాకులాడే కొందరు నాయకుల ప్రచారాన్ని ఆతీర్మానంలో ఖండిం చారు. ఈ తీర్మానం ఆచరణలో నెరవేరాలంటే, ఫెడ రేషన్ ప్రతికూలుడయిన సుభాష్‌బోసే కాంగ్రెసు అధ్య క్షుడుగా ఉండాలని అతని అభిప్రాయం. డాక్టరు పట్టాభి యొక్క "శుద్ధి" కార్యక్రమాన్ని ఖండిస్తూ అతడు ఆవేశపూరితమైన ఉపన్యాసం యిస్తోంటే, సభలో కర తాళధ్వనులు మారుమ్రోగాయి. కాని, పట్టాభినే ఎన్ను కోవాలని పట్టుదలగా ఉన్న విద్యార్థులు కూడా సభలో ఉన్నారు. ఒక విద్యార్థి ముందుకు వచ్చి, పట్టాభిగారు 25 సంవత్సరాలనుంచి దేశంకొరకు త్యాగం చేస్తున్నా రని అన్నప్పుడు "ఏమిటి ఆ త్యాగం" అని కొందరు అరిచారు. రెండు ముఠాలవారూ చొక్కా చేతులు పైకి తీశారు. పెద్ద గోల బయల్దేరింది. అధ్యక్షులైన రంగా గారు శాంతిని నెలకొల్పడానికి తీవ్రంగా ప్రయత్నిం చారు. ఇంత బేధాభిప్రాయం ఉన్న ఈ తీర్మానము చర్చించడము వల్ల విద్యార్థుల ఐక్యతకు భంగం వాటి ల్లుతుందని బోధించారు. చివరకు తీర్మానాన్ని ప్రతిపా దించిన విద్యార్థి యీ క్రింది రాజీ తీర్మానాన్ని ప్రతిపా దించగా, రెండవ ముఠావారు అంగీకరించారు. ఏకగ్రీ వముగా తీర్మానం ప్యాసయింది;

5. కాంగ్రెసు అధ్యక్ష పదవి ఎన్నిక సందర్భంలో కొంతమంది కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులు పక్షముల వహించు చర్యను ఈ సభవారు గర్హించుచు న్నారు. ఫెడరేషన్ పెనుభూతమును నాశన మొనర్చ వలసిన క్లిష్ట సమయములో ఎవరెక్కువ సమర్థులో మొగమాటములకు, పక్షపాతములకు,లోనుగాక త్రిపురి కాంగ్రెసు ప్రతినిధులు స్వబుద్ధితో నిర్ణయించుకొని ఎన్నుకోవలసిందని ఈ విద్యార్థి మహాసభవారు ప్రార్థిం చుచున్నారు.

తరువాత, మహాసభలో పోలీసు రిపోర్టర్లు ఉండు టను ఖండిస్తూ ఒక తీర్మానం; 124 A., 144 మొద లయిన నిర్బంధ శాసనాలను మదరాసు ప్రభుత్వము యింకా అమలు పరచడం గర్హిస్తూను మరొక తీర్మా నము; ప్రతి సంవత్సరం జనవరి 26 వ తేదీ (సంపూర్ణ స్వాతంత్ర్య దినం) పబ్లిక్ సెలవు దినముగా ప్రకటిం చాలని కోరుతూ మరొకటీ; ప్రాథమిక విద్యార్థి సం ఘాలు అనుసరించవలసిన నూతన కార్యక్రమం; విశాఖ పట్నం మెడికల్ డిగ్రీలను గుర్తించాలని యింకొక తీర్మానం: ప్రజా సామాన్యంలో వయోజన విద్యను విద్యార్థులు ప్రచారం గావించాలనీ; ఇంకా యితర తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించ బడ్డాయి. విశాఖ పట్నం మెడికల్ విద్యార్థి శ్రీ పి. రామకోటేశ్వరరావు గారు వచ్చే సంవత్సరానికి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకో బడ్డారు. సహాయ కార్యదర్శులుగా వై. వి. కృష్ణారావు (గుంటూరు), యస్. వి. రంగారావు (కృష్ణా), యి. రాజగోపాలరెడ్డి (నెల్లూరు), సి. హెచ్. వెంకటేశ్వరరావు (తూ॥ గోదావరి), యం. వి. రాఘ వేంద్రరావు, కె. వెంకట్రామ శాస్త్రి గారలు ఎన్నుకొన బడిరి.

29 వ తేదీ ఉదయం 9 గంటలకు దుర్గా కళా మందిరంలో మహాసభ తిరిగి సమావేశమై, పై తీర్మా నాలన్నీ ఆమోదించింది. "అయిదు నిమిషాలలో ఎట్లు ఉపన్యాసం యివ్వాలి" అనే విషయాన్ని గురించి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు అయిదు నిమిషాలు ప్రేక్షకులను ఆనందింప జేశారు.

జమీందారీ రిపోర్టు గడచి గట్టెక్కింది.

అసెంబ్లీలో ప్రత్యర్థులకు రాజాజీ సమాధానం



రాజాజీ

జమీందారీ విచారణ కమిటీ నివేదికపై జనవరి 23 వ తేదీని మదరాసు లెజిస్లేటివ్ ఎసంబ్లీలో చర్చ ప్రారంభ మయింది. కమిటీ నివేదికను మీర్జాపురం రాజాగారు ఎదిరిస్తూ, ఈ విధంగా ఉపన్యసించారు:

"విచారణ కావాలి అని ఎవరూ కోరలేదు. దాని అవసరము కూడా నాకు కనుపించడం లేదు. విచా రణ సంఘంలో అనుభవజ్ఞులు సభ్యులుగా ఉండాలి. గాని రాజకీయ వేత్తలు గాని, ఆవిషయములు తెలియనివారు గాని పనికిరారు. కనుక, న్యాయ శాస్త్ర ములో ఆరితేరిన న్యాయమూర్తులు గాని, అనుభవజ్ఞు లయిన శాసన సభ్యులు గాని, మేధావంతులైన న్యాయ వాదులు గాని, యింతవరకు కనుగొనని కొత్త వ్యాఖ్యా నము నేడు ఈ కమిటీవారికి కనపడడంలో ఆశ్చర్యం లేదు. కమిటీవారు తమ కార్యక్రమాన్ని ప్రారంభించక పూర్వం సాక్షులు ఫలానివారని ముందుగా నిర్ణయము చేయలేదు. పరీక్ష చేయబడిన సాక్షులు తాము చెప్పదల చుకొన్న అంశాలను చెప్పనీయలేదు. దీనికి ఫలితము యేమంటే, జమీందారుల మీద కక్ష గలవారు తమ అక్కసు నంతా తీర్చుకొనడానికి ఈ అవకాశాన్ని ఉప యోగించుకొని, వట్టి అసందర్భమైనట్టీ, నోటికి వచ్చిన రీతిగాను, సాక్ష్యం యిచ్చారు. పత్రా లెంతవరకు నమ్మదగినవో, సాక్ష్యం ఎంతవరకు నిజమో, తెలుసు కొన్న పాపాన్ని పోలేదు, కమిటీవారు.

జమీందార్లకు రావలసిన దానికంటె ఎక్కువ శిస్తు వసూలు చేస్తున్నారంటే, కొత్త సాగులు చేసినప్పుడు వాటిపై రైతుల వద్దనుంచి రావలసిన దాని కంటె ఏమీ ఎక్కువ తీసుకోవడంలేదు. ఆహార పదార్థముల ధరలు శాశ్వతముగా హెచ్చిన సందర్భాలలో కూడా యిదే జరుగుతోంది. ఉత్పత్తిలో తమ కెంత వరకు రావలసియున్నదో అంతే జమీందార్లు వసూలు చేసు కొంటున్నారు.

"భూమి హక్కు ఎవరిది అనే సమస్య ప్రీవీ కౌన్సిల్ న్యాయమూర్తులను ఎదుర్కొన్నప్పుడు, కేసులన్నిటి యందు భూమి హక్కు జమీందారుదేనని స్పష్టంగా తెలియజేయబడింది. మదరాసు హైకోర్టు న్యాయ మూర్తులయిన వేపా రామేశం, వెంకట సుబ్బారావు గారలు కూడా ప్రీవీ కౌన్సిల్‌వారి అభిప్రాయాన్నే వెల్ల డించారని నేను విన్నాను. మాకు సంబంధించినంత వరకు, పెర్మనెంటు సెటిల్‌మెంటు భూమి హక్కు జమీందారుదేనని స్పష్టం చేస్తోంది. పోర్బ్సు 1908 ఎస్టేటు ల్యాండ్ ఆక్టును ప్రవేశపెట్టినప్పుడు అందలి యితర విషయాల కంటె భూమి హక్కు జమీందారు దేనను విషయానికి ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు.

"పెర్మనెంట్ సెటిల్మెంటు జమీందారుకు—ప్రభుత్వా నికీ—రైతుకూ మధ్య జరిగిన ఒక ఒడంబడిక అనీ, పేష్కష్ నిర్ణయించబడిన రీతినే శిస్తుకూడా శాశ్వత ముగా నిర్ణయించబడినదని అంటున్నారు. కాని, పట్టా రెగ్యులేషన్‌ని జాగ్రత్తగా పరిశీలిస్తే, శిస్తు నిర్ణయానికీ, పేష్కష్ నిర్ణయానికీ సంబంధం లేనట్లు తెలుస్తుంది. ఈ రెగ్యులేషన్ యొక్క ఉద్దేశం ఏమంటే, భూస్వా ములూ—జమీందార్లు ఒక ప్రక్కనూ, రైతులూ—వ్యవ సాయదార్లు—గుత్తదారులు మరో ప్రక్కను, పట్టా లను ఎగ్జిక్యూట్ చేయడానికి నిబంధనలు తయారు చేయడం. పట్టా రెగ్యులేషన్ క్రింద శాశ్వతముగా రెవెన్యూ నిర్ణయించేటట్లయితే, గుత్తదారులకు— వ్యవసాయ దారులకు పట్టాలు గ్రాంటు చేసే అవసరం ఏమి ఉన్నది? జమీందార్లకు గుత్తదారులు చెల్లించ వలసినటువంటిన్నీ, రైతులు గుత్తదారులకు చెల్లించ వలసినటువంటిన్నీ, శిస్తు రేట్లనుకూడా పట్టా రెగ్యు లేషను శాశ్వతంగా నిర్ణయించినదని చెప్ప వీలగునా? ఒకసారి పట్టాలో చేర్చబడిన శిస్తు షరతులు దరిమి లాను హెచ్చించబడుటకు కాని, మార్చబడుటకుగాని, హక్కు లేదని యీ రెగ్యులేషన్‌లో ఎక్కడా వ్రాయ బడి యుండలేదు.

చర్చ

పిమ్మట, శ్రీ కళా వెంకట్రావు గారు విచారణ సంఘ సిఫార్సులను బలపరుస్తూ, జమీందారీ పద్ధతిని తీవ్రంగా ఖండించారు. భారతదేశ చరిత్రలో భూస్వా మ్యత లేదనీ, రైతుదే భూస్వామ్యత అంతా అనీ, నిరూపించడానికి హిందూ—మహమ్మదీయ ధర్మ శాస్త్రాలు, శివస్వామి అయ్యర్, సర్. కె. వి. రెడ్డిగార్ల అభిప్రాయాలు పేర్కొన్నారు.

"బోల్షివిజం"

మరునాడు, అనగా 24 వ తేదీని, లాంగ్లే అనే యూరపియన్ సభ్యుడు ప్రసంగిస్తూ, విచారణ కమిటీ నివేదికలో "ఈర్ష్య, ద్వేషం, పగ" యీ మూడూ మూర్తీభవించియున్న వన్నాడు. కమిటీ వారి సిఫా ర్సులు బోల్షివిక్ రష్యాను అనుసరిస్తూన్న వన్నాడు. శ్రీ పుల్లెల శ్యామసుందరరావు గారు లాంగ్లే గారి వాద నలను ఖండిస్తూ ఉపన్యసించారు.

వారి తరువాత మహబూబ్ ఆలీబేగ్ గారు జమీం దారీలను రద్దు చేయాలి అనే సవరణను ప్రతిపాదిస్తూ, 1802 వ సంవత్సరపు పెర్మనెంటు సెటిల్మెంటు వల్లనే జమీందార్లకు అక్రమముగా స్వామ్యతలు కల్పింపబడ్డ వన్నారు. జమీందారీ పద్ధతి ఉన్నంతకాలం ప్రజలు బాగుపడజాల రన్నారు. జమీందార్లకు ప్రభుత్వం కొంత పరిహారం యిచ్చి, యీ పద్ధతిని నిర్మూలించాలన్నారు.

బోడినాయకనూర్ జమీందారుగారు, దండు నారా యణరాజుగారు, బి. భక్తవత్సలం నాయుడు గారు, మల్లిపూడి పళ్ళంరాజుగారు, గద్దె రంగయ్య నాయుడు గారు మొదలయినవారు 24, 25 తేదీల చర్చలలో పాల్గొన్నారు.

ప్రధాని జవాబు

25 వ తేదీని ప్రధానమంత్రి రాజగోపాలాచారిగారు చర్చకు జవాబిస్తూ ఈ క్రింది విధంగా ఉపన్యసించారు;

"హైకోర్టు తీర్పులు, ప్రీవీ కౌన్సిల్ తీర్పులు, శాస్త్రీయమైనవే అయినా, అశాస్త్రీయమైనవే అయినా, శాసన సభలను ఏ మాత్రం అవి బంధింపజాలవు. జమీందారులు తామే భూస్వాములమని ఇంకా ఊహా ప్రపంచంలో ఊగులాడుట ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. అస్వామ్యత కాగితాలలో ఉన్నదని వారు భావి స్తూంటే, వెంటనే వారట్టి భావాలు వదలుకొనుట మం చిది. పదే పదే వారు భూస్వామ్యపు హక్కును గురించి పలుకుట వివేకంకాదు. పెర్మనెంట్ సెటిల్మెంటు కారకులయిన సర్ జాన్ షోరుగారికిని, కారన్ వాలిస్ ప్రభువునకును మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలిస్తే, రైతు చెల్లించవలసిన శిస్తుకూడా శాశ్వత ముగా నిర్ణయించబడినదని స్పష్టమౌతుంది. పట్టా రెగ్యులేషన్ 7 వ నిబంధనవల్ల, కూడా శిస్తులు శాశ్వ తముగా నిర్ణయించ బడ్డాయి. 11 వ నిబంధనలో, శిస్తు హెచ్చించుట-యితర రుసుములు వసూలు చేయుట శిక్షార్హమనికూడా ఉంది. ధాన్యపు ధరలు హెచ్చెనను కారణంతో శిస్తును హెచ్చించుటకు జమీం దారులకు ఎట్టి అధికారం ఈయబడలేదు. న్యాయమైన శిస్తు రేట్లు నిర్ణయించుట కీ సభవారికి అధికారం కలదని జమీందార్లు అంగీకరి స్తున్నారు. కాని, 1802 శిస్తు రేట్లు న్యాయమైన వని విధించుట కధికారం లేదట. దీని అర్థం, జమీందారుల దృష్టికి ఏ రేట్లు న్యాయమైనవో వాటినే శాసనసభ అంగీ కరించాలి; వారి వాదనను ఎవరూ అంగీకరింపజాలరు. యకరం 1 కి రు. 22 లు, రు. 50 లు అమలులో ఉన్న మందసా, కిర్లంపూడి, ఉర్లాం మొదలయిన జమీందారీలను తొలగించాలని ప్రజలు కోరడంలో విచిత్ర మేమైనా ఉన్నదా? పరిస్థితుల్ని యీ విధము గానే సాగనిస్తే జమీందార్లకే వ్యవహారం శృతి మించి పోతుంది. వారి శ్రేయస్సు కొరకే వారి హక్కులను లాగివేయ వలసి యుంది."

పిమ్మట, కమిటీ సిఫార్సులను ఆమోదించి, వాటి ననుసరించి త్వరలో శాసన మొనర్పవలెనని ప్రభుత్వం వారికి సిఫార్సు చేస్తూ" ప్రతిపాదించబడిన తీర్మానము ఎసంబ్లీలో ఆమోదించబడింది.

నేటి ప్రపంచం

(3 వ పేజీ తరువాయి)

మార్పులు తెచ్చాడు. యుద్ధ మంత్రిగా ఉండిన ఇన్స్కిప్‌కు డొమినియన్లు మంత్రిగాచేసి, ఆ స్థానానికి ఒక సేనాని, ఛాట్‌ఫీల్డును నియమించాడు. యుద్ధములందు ఆరితేరిన వానినే యుద్ధ మంత్రిగా చేయడము శాంతి సూచకము మాత్రము కాదు!

బెల్జియముకూడ ఆఫ్రికాలోని తన కాంగో కాలనీ సంరక్షణార్థము తగిన ఏర్పాటులు చేయడానికి మిలటరీ కమిషనును ఒక దానిని పంపించింది. కాంగోలో ఇది వరకు కేవలము పోలీసు శాఖగా మాత్రమున్న దానిని సైనిక శాఖగా మార్చి వేసింది.

ఆస్ట్రియాలో సైనిక దళాలు ఎక్కడకో బయలుదేరి వెళ్లతున్నాయని రిపోర్టులు వస్తున్నాయి. ఈపోర్టులకు హడలి, స్విట్జర్లండు ప్రభుత్వము, జర్మనీ సరిహద్దు సైన్యాన్ని ఎక్కువజేసింది.

జర్మనీలో ఆర్థిక క్షోభస్థితి చాల విషమస్థితికి వచ్చింది. డాక్టరు షాక్తీను, అతని అనుసరించు ఆర్థికవేత్తలనందరిని పదవులనుండి హిట్లరు తొలగించాడు. డాక్టరు ఫంకును రీచ్ బ్యాంకు డైరక్టరుగా చేశాడు. జర్మనీ పరిశ్రమలను వర్తకాన్ని పెంపొందించడానికి, ఇదిఅవసరమయినదట. ప్రపంచమార్కెట్టులలో పోటీచేయడానికి 16 కోట్లపౌనులు (సవరలు) అప్పుతీస్తారట. ఈ అప్పు, జర్మనీ బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు ఇస్తాయట! ఈమార్పులు ఆయుధ నిర్మాణ కార్యక్రమానికి ఆర్థిక భవిష్యత్తును తాకట్టుపెట్టుటయే యని ఫ్రెంచి పత్రిక లంటున్నాయి. ఇటలీలాగ యిక ముందు జర్మనీ కూడ ఎప్పుడూ దేశములోని ప్రజలందరిని యుద్ధానికి తయారుగ ఉంచుతుందని దీనినిబట్టి తేలిందని వ్రాస్తున్నాయి. విరివిగా నోట్లువేసి చెలామణిఎక్కువచేస్తాడనికూడ వ్రాస్తున్నాయి. లండను టైమ్సు పత్రిక "జర్మనీలోని ఈ మార్పులు కాథలిక్కులమీదగాని,విదేశ అప్పులమీదగాని హిట్లరు విరుచుకపడవచ్చునని సూచిస్తూ ఉన్నాయి.జర్మనీలో శాంతికిదాని విదేశాంగ వ్యవహారాలలో శాంతిపూర్వక అభివృద్ధికీ ఈ మార్పులు వినాశకరములు." అని వ్రాస్తూ ఉంది.

జర్మనీలో యుద్ధముచేయ శక్తి గలవారందరూ ఈ రక్షక దళాలుగా ఏర్పడి, నాజీస్టారం ట్రూపులో చేరాలని శాసింపబడింది. హిట్లరు తన సేనానాయకుల నందరిని పిలిచి, రహస్యముగా సంప్రదించాడు. జెకోస్లోవేకియా విదేశాంగమంత్రి జర్మనీకివెళ్లాడు జెకోస్లోవేకియాలో జర్మనీకి వ్యతిరేకమయిన ఎట్టి విధానానికి తావుండకూడదని అతనికి హెచ్చరిక యిచ్చారు. జర్మనీకి అనుకూలమైన వర్తకపు ఒడంబడిక విషయమై సంప్రదింపులు సాగాయి.

డాన్జిగ్‌లో గత 4, 5 వందల సంవత్సలుగ వర్తకవ్యాపారాల నభివృద్ధి చేస్తూఉండిన యూదులనందరినీ, 7000 మందిని, డాన్జిగ్ వదలి వెళ్ళిపోవుటకు ఆజ్ఞలిచ్చారు.

మెమెలు లాండుకు క్రొత్త డైరక్టరు మెమిలు లాండు యొక్కవిధానము, నాజీ విధానము ననుసరించి ఉంటుందని ప్రకటించాడు. మెమిలులోని లిథూనియన్లు కూడా నాజీ విధానమును అనుసరించవలయును. నాజీలకు వ్యతిరేకంగా ఎట్టి ప్రచారము చేయుటకువీలులేదు. జర్మనీలో వలె నాజీ సాల్యూట్‌కు అనుమతించారు.

జర్మను విదేశాంగమంత్రి రిబ్బన్‌ట్రాప్ వార్సాకు వెళ్లాడు. బెక్కుతో సంప్రదించి ఒడంబడికు వచ్చాడు. పోలండుకు ఫ్రాంసుకు ఉన్న సందర్భాలను గూర్చి చర్చించాడు. జర్మనీపత్రికల ఆనందాన్ని చూస్తే పోలండు, రష్యా ఫ్రాంసులను వదిలి తిరిగి జర్మనీ పలుకుబడిక్రిందికి వచ్చినట్లు ఊహింపవచ్చును. అంతేగాక జర్మనీ నుండి నాలుగుమాసాల క్రితము తరిమివేయబడిన పోలండు యూదులను, పోలండు సరిహద్దులనుండి తిరిగి జర్మనీకి రానివ్వడముబట్టి కూడ ఈ ఊహాబలపడుతూ ఉంది.

అమెరికాకు ఆస్ట్రియా కట్టవలసిన అప్పులు తాను కట్టవలసిన అవసరములేదని జర్మనీ అమెరికాకు తెలియజేసింది. కాని అమెరికా ఒప్పుకోలేదు. రూజ్‌వెల్టు సూచించిన ఆయుధ నిర్మాణ కార్యక్రమాన్ని సెనేటరు పిట్మన్ బలపర్చాడు. అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితులను చూచి, ఫిలప్పైను దీవులకు ఆర్థిక స్వాతంత్ర్యమును 1946 లో ఇవ్వవలసిన దానిని 1960 వరకు వాయిదావేశారు. ఇది అమెరికను సామ్రాజ్యతత్వ విజృంభణానికి మరియొక నిదర్శనము.

జర్మనీలోని యుక్రెయిన్ నేషనలు అసోసియేషనువారు, కడకు రష్యా, పోలండు, జెకోస్లోవేకియాలలోని యుక్రెయిను జాతి వారినందరిని కలిపి స్వతంత్ర రాష్ట్రముగ ఏర్పరచగల్గుదమని ప్రకటించారు

జపాను, తనపై ఆర్థిక బహిష్కారము కొనసాగిస్తే, తాను ఇతర దేశాలపై అట్టి ఆయుధాన్ని ప్రయోగించడానికి వెనుదీయనని ఇతర ప్రభుత్వాలకు తెలియజేసింది. సోవియటు యూనియను, జపానుకు వ్యతిరేకముగా రాను రాను ఎక్కువ ప్రయత్నాలు చేస్తుందని విదేశాంగ మంత్రి ప్రకటించాడు. అప్పుడే సోవియటు సైన్యాన్ని విపరీతముగా, సైబేరియా ప్రాంతానికితెస్తున్నారట! చైనాతోటి యుద్ధమును సాగించడానికి జపాన్ మరి 20 కోట్ల ఎన్నులు (జపాను నాణెము) వచ్చే పన్నులు విధించారు. చక్కెరమీద, కాఫీ, టీ, పండ్లు హోటళ్ళలో మంచి తిండిమీద, ఈ పన్నులు విధించారు కొంతవరకు, అధిక లాభాలపైన కూడ పన్ను విధించారు. ఈ జపాను దాడిని ఎదుర్కోడానికి చైనా మిగిలిన దేశాలతోటి తన సంబంధాలను పెంపొందించుకుంటూ ఉంది. బ్రిటనుతోను, రష్యాతోను చైనానుండి బర్మాకు, రష్యాకు విమాన ప్రయాణ సౌకర్యాలు ఏర్పరచడానికి ఒడంబడిక చేసుకున్నది.

పాలెస్టయినులో అరబ్బుల డెలిగేషనుగా ముఫ్తీ పార్టీ వారిచే ఎన్నుకొని పంపారు. నైషిషిబీ పార్టీకి చెందినవారు ఇద్దరు ఇందులో ఉండుటకు అంగీకరించాడు ముఫ్తీ. అందులో ఒకడు ముఫ్తీ పార్టీలో చేరాడు. మరియొకడు జబ్బుగా ఉండుటచే అండనుకు వెళ్ళడట, నైషిషిబీ పార్టీ, లండను కాన్ఫరెన్సులో పాల్గొనమని ప్రకటించారు. బ్రిటిషు ప్రభుత్వము ఈ మితవాదుల నెట్లయినా తీసుకరావలయునని అనేక విధాల ప్రయత్నిస్తూ ఉంది. ఈ లోపల పాలెస్టయిను యుద్ధము సాగుతూనే ఉంది. ఒక యూదు బ్యాంకరును చంపేశారని, జెరూసలేములో కర్ఫ్యూ ఆర్డరు ప్రకటించారు. అరబ్బుల సేనా నాయకుడు అబ్దుల్ రజాక్‌కు కావలసిన ఆయుధాలను సరఫరా చేస్తూ ఉన్నాడని ఫ్రెంచి అల్జీరియన్ మహమ్మదీయుని కొకనికి మరణ దండన బ్రిటిషు కోర్టులు విధించాయి. ఆ కోర్టులే, ఇదివరకు ఒక అరబ్బును చంపారని శిక్షింపబడిన బ్రిటిషు కోర్టులలో ముగ్గురిని విడుదల చేసింది. మరి యొకని శిక్ష మూడు సంవత్సరాలనుండి .18 నెలలకు తగ్గించింది. ఇది బ్రిటిషు న్యాయం!

ఇది ప్రపంచంలో నేటి యుద్ధ సన్నాహాలు!

ఢెంకనాల్

(10 వ పేజీ తరువాయి)

బైటనుంచి కూడా వాలంటీరు దళాలను పంపడానికి నిశ్చయించుకున్నారు. నాథా కృష్ణచౌదరి యం. యల్. ఏ. ఒరిస్సా కాంగ్రెసు సోషలిస్టు నాయకులును డిసెంబరు 3 వ తేదీని మొదటి దళాన్ని ఢెంకనాల్‌కుపంపారు. ఒరిస్సా రాష్ట్రంలోని కాంగ్రెసు మంత్రులుకూడా ఉద్యమానికి ఇంకొక విధంగా సాయంచేశారు. "సంస్థానాధీశుల రక్షణ శాసనా"న్ని ప్రవేశపెట్ట నీయలేదు. ప్రజా ఉద్యమాన్ని అణచడానికి దర్బారుకు సాయంగా పోలీసులకు పంపడానికి నిరాకరించారు. బాధలు పడలేక సంస్థానం విడిచిపెట్టి వచ్చినవారి అవస్థలు కాంగ్రెసు ప్రధాని స్వయముగా చూశాడు. ఉత్కళరాష్ట్రీ కాంగ్రెసు సంఘం, హరిపురా తీర్మానాన్ని స్మరించుకుంటూ మడిగట్టుకొని కూర్చున్నా, చాల ప్రాథమిక కాంగ్రెసు సంఘాలు మాత్రం వూరుకోలేదు. వాలంటీరు దళాలను ఏర్పాటుచేసి పంపడం, తమ తమ జిల్లాలలో మీటింగులు జరిపి ఆందోళన గావించడం మొదలుపెట్టారు. లక్ష్మీనారాయణ మిశ్రా అను అఖిలభారత కాంగ్రెసు సభ్యుడుకూడ ఒక వాలంటీరు దళాన్ని నడిపాడు. తుపాకిచే గాయపడిన ఒకనికి రక్తం ఇంజక్షన్ చేయవలసివస్తె 15 గురు మెడికల్ విద్యార్థులు తమ రక్తం ఎంత కావలిస్తే అంత తీసుకో వచ్చునంటూ వచ్చి నిలబడ్డారు.

గాంధిగారు తయారు!

ఒకదానితరువాత ఒకటిచెప్పున 7 వాలంటీరు దళాలు బయటనుండి ఢెంకనాల్కుపంపబడ్డాయి. మాలతీదేవికి ఢెంకనాల్‌కు వాలంటీర్లుగా పోవడానికి మేం సిద్ధంగావున్నామంటే మేం వున్నామంటూ వందలకొలది ఉత్తరాలు వచ్చిపడ్డాయి. ఇంతచక్కని సమయంలో, వార్ధాలో సమావేశమైన కాంగ్రెసు వర్కింగు కమిటీ సంస్థాన ప్రజలు, మనం ఒకటే అనీ, వారిది, మనది ఒకటే ఆశయమనీ, కాని వారిపోరాటంలో మనం పాల్గొనడం గాని, సహాయం చేయగూడదంటూ తీర్మానించింది ఇది మహాత్ముని తీర్మానమే అనే విషయం లోకానికంతకూ తెలుసు. అట్లు చేసినవారిపై డిసిప్లినరీ చర్యకూడా తీసుకుంటామంటూ ప్రకటించారు. మర్నాడే గాంధిగారి సలహాలతో శ్రీ కృష్ణ మెహతాబ్ తయారయ్యాడు. "మనకు ఇష్టం లేకపోయినా గాంధిగారి అభిప్రాయమిది" అంటూ ఢెంకనాల్ ప్రజలకెవరూ సహాయం చేయకూడదని శాసించాడు. వాలంటీర్లు మారుమాటాడలేక కళ్ళ వెంబడి నీరు కారుస్తూ గాంధిగారి ఆజ్ఞలను శిరసావహించారు.

ఇంతలో చలిపిడుగులాంటి ఇంకొక వార్త! రాంపూరులో పొలిటికల్ ఏజంటు హత్య చేయబడ్డాడు. మననాయకులు మండిపడుతూ స్టేటుమెంటులు ప్రకటించారు. దౌర్జన్యమార్గాల బడుతోంది కనుక సంస్థానాలలో అసలు ఉద్యమమే ఆపివేయాలనే ధోరణికూడ కాంగ్రెసుపెద్దలలో కొందరికి ఏర్పడింది. ఇదంతా చూస్తూంటే ఢెంకనాల్ నాయకులకు కాళ్ల చల్లబడ్డాయి.

మృత్యువును ధిక్కరించింది.

ఏది ఎట్లున్నను ఢెంకానాల్ మృత్యువును ధిక్కరించింది. ఇప్పుడా పోరాటమంతా గంగపాలు కావలసిందేనా? అచ్చటి స్వాతంత్ర్య వీరులు చిందించిన రక్తం వృధా గావలసినదేనా? ప్రజా సామాన్యం ప్రదర్శించిన ధైర్యసాహలన్నీ మంట గలవ వలసిందేనా? కాదు కాదు! ఢెంకానాల్ పోరాటం ఒకచిన్న సంఘటన కాదు. బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడే వరకు, సంస్థానాధీశుని నిరంకుశత్వం నిర్మూలించే వరకు అచ్చటి ప్రజలు నిద్దుర పోరు! కాంగ్రెసు సంస్థను నిద్దుర పోనివ్వరు!

గొరిల్లాలు

(19 వ పేజీ తరువాయి)

సైన్యంలో చేర్చుకొంటారు. వారికి తిరిగి తమ సైన్యాలను చేరుకోవాలంటే వదలి పెట్టారు. కాని ఆఫీసర్లను మాత్రం జాగ్రత్తగా చూస్తారు కారణం బూర్జువా సైన్యాల ఆఫీసర్లు, పీడించే వర్గాలకు చెంది ఉండటమే.

చైనాకు జయం తప్పదు

చంగు-కై-షేక్ కమ్యూనిస్టుల యుద్ధ పద్ధతుల జయము పొందుటనూ, వారి నిర్మాణమునూ గూర్చి, ఇప్పుడిప్పుడు కొన్ని సేనలను గొరిల్లా పద్ధతులమీద ఆర్గనైజు చేయుచున్నాడు. కమ్యూనిస్టులు ప్రజా సామాన్యాన్ని అంతనూ స్థానిక రక్షణలో పాల్గొనేటట్లు చేస్తే చైనా తప్పక గెలుస్తుందని మొట్ట మొదటనుండీ ఘోషించుచున్నారు. దాని వలన ప్రజా సామాన్యాకిని ఆయుధాల నివ్వవలసి వస్తుంది. కనుక చైనా బూర్జువా మొట్ట మొదటదానికి ఒప్పుకోలేదు. కాని చాంగు-కై-షేక్ గత్యంతరం లేక చివరకు కమ్యూనిస్టుల పద్ధతికి ఒప్పుకొనవలసి వచ్చింది. అందువలననే ఒకప్పుడు చైనా నాయకుడయిన 'సన్యత్ సేను'కు కుడి భుజంగా ఉన్న వాంగుచంగువై ఇప్పుడు జపానుతో కుట్రలు పన్ను తున్నాడు.

చైనా ఇప్పుడు బాగుగా తర్ఫీదు పొందిన సైనికులకు ఆధునిక ఆయుధాల నిచ్చి జపానుసైన్యాల ముందు పోరుటకు వదలిపెట్టి మిగతా సైన్యాన్ని గొరిల్లా పద్ధతులమీద పోరాడేటట్లు చేస్తూ, ప్రజా సామాన్యాన్ని సాయుధులుగాజేసి దేశ రక్షణలోనికి తీసుకొని వస్తే, చైనాకు జయం తప్పదు. జపానుకు ఇప్పటికే చాల ఖర్చు అయింది. చివరకు నిర్బంధంచేసి సైన్యంలోనికి మనుష్యులను తీసుకొనుట, ఫ్యాక్టరీల నన్నిటినీ పంటనూ ప్రభుత్వం చేతి క్రిందకు తీసుకొనుట మొదలయిన పనులు చేయవలసి వచ్చింది.

ఇదే ఆఖరుసారి. ఈ దెబ్బను చైనా తప్పించుకొని యుద్ధాన్ని సాగించిందా జపానులో కరువు తప్పదు. దాని వెంబడే విప్లవంగూడా వస్తుంది.

కోలవెన్ను

కోలవెన్ను గ్రామ వ్యవసాయ కూలీ సంఘము ది 22-1-39 తేదీన అన్నవరపు ప్రసాదంగారి అధ్యక్షతను సమావేశమై బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గంవారిచే ప్రతిపాదింపబడిన కార్మిక తగాదా బిల్లుపట్ల అసమ్మతిని తెల్పుతూ తీర్మానించారు.

బొంబాయి కార్మిక తగాదా బిల్లుపట్ల అసమ్మతిని తెలుపుతూ అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఆదేశానుసారం, ది 22-1-39 తేదీని యేలూరు, బందరు, గుంటూరు, తెనాలి విజయనగరం, విశాఖపట్టణాలలో సభలు జరిగాయి.

జమీందారీ రైతుల హక్కులకై పోరాడేది నవశక్తి	# నవశక్తి	కార్మిక, కర్షక రాజ్యం కావాలంటుంది నవశక్తి

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE